మంగళవారం
09-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 349
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జీఎస్టీ సంస్కరణలపై ప్రచారం

న్యూఢిల్లీ: జీఎస్టీ 2.0 పేరిట తెచ్చిన సంస్కరణలను మేక్ ఇన్ ఇండియా ప్రచారంలో భాగంగానే పరిగణిం చాలని, వాటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించా లని ఎన్డీయే ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సోమవారం ఎన్డీయే ఎంపీలతో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన... ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. 2.0 సంస్కర ణల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకో వాలని, ప్రతి ఎంపీ తమ నియోజక వర్గంలో 20 నుంచి 30 సమావే శాలు నిర్వహించాలని మోదీ చెప్పారు.

రద్దయిన పెద్ద నోట్లు పట్టివేత

విశాలాంధ్ర–హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరా బాద్‌లో భారీగా రద్దయిన పెద్ద నోట్లు పట్టుబడ్డాయి. తొమ్మిదేళ్ల క్రితం రద్దయిన రూ. 500, రూ.1000 నోట్లను ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. నారా యణగూడ శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న కెనరా బ్యాంకు వద్ద ఇద్దరిని, వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఇద్దరిని ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. వారి వద్ద ఉన్న మూడు బ్యాగుల్లో తనిఖీలు చేయగా రూ.2 కోట్ల విలువ చేసే రద్దయిన నోట్లు కనిపించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ నిమిత్తం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



జెరూసలేంలో కాల్పులు

జెరూసలేం: ఇజ్రాయిల్ రాజధాని జెరూస లేంలోని రామోట్ ప్రాంతంలో పట్ట పగలు కాల్పులు చోటుచేసుకు న్నాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు మరణించగా, 15 మంది గాయ పడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ దాడికి హమాస్ బాధ్యత వహించింది. దాడి తర్వాత ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు అత్యవసర భద్రతా సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిసింది. రామోట్ ప్రాంతంలో రద్దీగా ఉండే బస్ స్టాప్ దగ్గర ఇద్దరు దుండగులు ఒక బస్సు ఎక్కి కాల్పులు ప్రారంభించారు. వెంటనే భద్రతా దళాలు వారిని అక్కడికక్కడే హతమార్చాయి. దాడి చేసిన వారు వెస్ట్ బ్యాంక్‌కు చెందిన పలస్తీనియన్లు అని భద్రతా అధికారులు తెలిపారు.

ఓటింగ్‌కు బీఆర్‌ఎస్, బీజేడీ దూరం

ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధం

ఎన్డీయే, 'ఇండియా' తుది కసరత్తు

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్), బిజూ జనతాదళ్(బీజేడీ) ప్రకటించాయి. బీఆర్‌ఎస్‌కు నలుగురు, బీజేడీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు. ఈ 11 మంది ఎన్నికల్లో ఎవరికీ ఓటు వేయడం లేదు. ఇండియా ఐక్యసంఘటన అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు ఆమ్‌ఆద్మీ (10 మంది ఎంపీలు) ప్రకటించినప్పటికీ... ఎంపీ స్వాతి మాలివాల్‌కు ఆ పార్టీతో సంబంధాలు దెబ్బతిన్న క్రమంలో ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరివైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కొక్క ఎంపీ ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పార్లమెంటు భవనంలోని వసుధలో ఎఫ్–101 గదిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. సాయంత్రం 6 గంటలకు ఓట్లు లెక్కించి ఫలితం ప్రకటిస్తారు. ఈ ఎన్నికకు పార్లమెంటు ఉభయసభల సభ్యులు ఓటర్లుగా ఉన్నారు. అధికార ఎన్డీఏ తరఫున మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67), ఇండియా ఐక్యసంఘటన నుంచి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి (79) పోటీచేస్తున్న సంగతి విదితమే. మరోవైపు ఎన్నిక ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఎన్డీఏ, ఇండియా ఐక్యసంఘటన తమ ఎంపీలతో వేర్వేరు సమావేశాలు నిర్వహించాయి. తమ

- మిగతా 2 లో

ఆధార్ అంగీకరించాల్సిందే

ఈసీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటర్ల గుర్తింపు ధ్రువీకరణకు ఆధార్‌ను 12వ నిర్దేశిత పత్రంగా చేర్చాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆధార్ వాస్తవికతను పరిశీలించిన తర్వాతనే ఓటరు నిర్ధరణకు వినియోగించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ఆధార్ ద్వారా నిజమైన పౌరులను మాత్రమే ఓటు వేయడానికి అనుమతించాలని పేర్కొంది. నకిలీ పత్రాల ఆధారంగా నిజమైన పౌరులని చెప్పుకునే వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సంబంధిత అధికారులను ధర్మాసనం ఆదేశించింది. ఓటర్ల ధ్రువీకరణకు ఆధార్‌ను అధికారులు ఎందుకు స్వీకరించట్లేదని గతంలో ఇచ్చిన షోకాజ్ నోటీసులపై వివరణ ఇవ్వాలని కూడా ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ధర్మాసం ఆదేశించింది. బీహార్‌లో ఓటరు నిర్ధారణ కోసం ప్రస్తుతం 11 పత్రాలను పౌరులు సమర్పిస్తుండగా... ఆధార్‌ను 12వ నిర్దేశిత పత్రంగా చేర్చాలని ఎన్నికల

- మిగతా 2 లో

బీసీ రిజర్వేషన్లపై

ఆ రెండు పార్టీల కుట్ర

- రాహుల్ ప్రధాని కావడం అవశ్యం
- కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పదవి
- 15న కామారెడ్డి సభను విజయవంతం చేయండి
- టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో భట్టి

విశాలాంధ్ర – హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై కేంద్రంలోని బీజేపీ... రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీ కుట్ర దాగి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. నేడు బీఆర్ఎస్ మనుగడ కకావికలంగా మారిందని, ఆ పార్టీ ఎన్ని ముక్కలు అవుతుందో తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. గ్రామ, మండల స్థాయిలో వివిధ పార్టీల నుంచి వచ్చే నాయకులను కాంగ్రెస్‌లో ఓ ఉద్యమంలా చేర్చుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం దేశానికి ఎంతో అవసరముందని చెప్పారు. గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు ఏదో ఒక పదవి వరిస్తుందన్నారు. టీపీసీసీ చేపట్టే ప్రతి పనికి సీఎం రేవంత్ రెడ్డితో పాటు యావత్ క్యాబినెట్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అధికారం చేపట్టాక సంక్షేమ పథకాలకు రూ.99,529 వేల కోట్లు ఖర్చు పెట్టామని, ఏడాదిలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లన్నీ పూర్తి చేస్తామని వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కేదాకా ఎన్ని సవాళ్లను ఎదుర్కొని న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు.

ప్రతి కమిటీలో సామాజిక న్యాయం: మీనాక్షి నటరాజన్

కాంగ్రెస్ పార్టీ అంతర్గత ప్రతి కమిటీలో సామాజిక న్యాయానికి అనుగుణంగా ఎంపిక చేయ డం జరుగుతుందని ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. రాబోయే విస్తృత స్థాయి సమావేశాలు జిల్లాల్లో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. పార్టీలో 70 నుంచి 80 శాతం

- మిగతా 2 లో

గోదావరి జలాలతో మూసీ ప్రక్షాళన

- ప్రపంచస్థాయి నగరంగా హైదరాబాద్
- ఇందిరమ్మ రాజ్యంలోనే పేదోళ్లకు న్యాయం
- నెత్తిన నీళ్లు చల్లుకుంటే పాపాలు పోవు
- రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ డిసెంబరులో జాతికి అంకితం

విశాలాంధ్ర – హైదరాబాద్: నెత్తిమీద నీళ్లు చల్లుకున్నంత మాత్రాన బీఆర్ఎస్ నాయకులు చేసిన పాపాలు తొలగిపోవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ తెచ్చిన గోదావరి జలాలను నెత్తి మీద చల్లుకుని తామే ఏదో చేసినట్టు కొందరు నమ్మించారని ధ్వజమెత్తారు. నేడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే గోదావరి జలాల తరలింపునకు ముందడుగు పడిందన్నారు. గండిపేట వద్ద గోదావరి ఫేజ్ 2, 3 కి సోమవారం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ జలమండలి అధ్వర్యంలో నిర్మించిన 16 జలాశయాలను ప్రారంభించారు. నియోపోలీస్ వాటర్ సప్లై, సీవరేజ్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. కోకాపేట వద్ద నియోపోలీస్ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ ను ప్రారంభించారు. రేవంత్ మాట్లాడుతూ 1908లో నిజాం ప్రభుత్వం... ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించి హైదరాబాద్ ప్రజలను వరదల నుంచి కాపాడిందన్నారు. వందేళ్లకు పైగా ఈ నగరానికి తాగు నీరు అందుతున్నాయంటే ఆనాటి నిజాం సర్కార్ దూరదృష్టినే కారణమని పేర్కొన్నారు. కోటికిపైగా జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎంతో కృషి చేశాయని తెలిపారు. 1965లో మంజీరా నది నుంచి నగరానికి తాగు నీరు అందించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. 2002లో కృష్ణా నదీజలాలను మూడు దశల్లో నగరానికి తరలించి ప్రజల దాహార్తిని తీర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదన్నారు. కాలుష్యమయమైన మూసీతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విషతుల్యమైన మూసీని ప్రక్షాళన చేస్తానని నల్లగొండ జిల్లా ప్రజలకు ఆనాడే మాట ఇచ్చానని అన్నారు. 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్ కు తరలించబోతున్నామని, ఇందులో 16 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి కోసం వినియోగించబోతున్నట్లు వెల్లడించారు. చెరువులను నింపుకుంటూ నాలుగు టీఎంసీలను మూసీకి తరలించి ప్రక్షాళన చేస్తామని చెప్పారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్ తరలిస్తున్నట్లు తెలిపారు. ఆ సంగతి మరిచిపోయి కొందరు మల్లన్నసాగర్

- మిగతా 2 లో

గోదావరి జలాలు వాడుకుంటూ

'కాళేశ్వరం'పై అక్కసు

మల్లన్నసాగర్-మూసీ అనుసంధాన ప్రాజెక్టు ఓ కుట్ర: కేటీఆర్

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణ కల్పతరువు, కామధేనువు కాళేశ్వరం ప్రాజెక్టే అన్న నిజాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచి మూసీకి గోదావరి జలాలను తీసుకువచ్చే పథకానికి శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డికి మల్లన్నసాగర్‌కు గోదావరి నీళ్లు ఎక్కడి నుంచే వస్తాయో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణ వర ప్రదాయని కాళేశ్వరంను విఫల ప్రాజెక్టుగా ప్రచారం చేసినందుకు రేవంత్ తో సహా కాంగ్రెస్ నేతలంతా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం మీద చేప్పిన అబద్దాలను కప్పి పుచ్చుకోవడానికి మల్లన్న సాగర్ దగ్గర కాకుండా గండిపేట దగ్గర ప్రాజెక్టుకు

- మిగతా 2 లో

ఎరువుల కేటాయింపులో కేంద్రం వివక్ష

11 లక్షల మెట్రిక్ టన్నులకు... 5.2 లక్షల మెట్రిక్ టన్నులే

ప్రభుత్వంపై బీజేపీ, బీఆర్ఎస్ దుష్ప్రచారం: పొన్నం



విశాలాంధ్ర – హైదరాబాద్: ఎరువుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణ రైతాంగం ఎరువులకు పడుతున్న ఇబ్బందులపై ముఖ్యమంత్రి, పార్లమెంట్ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత మంత్రులకు విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. అవసరమైన ఎరువులు సరఫరా చేయాలని పలుమార్లు లేఖల ద్వారా విజ్ఞప్తి చేశామని చెప్పారు. కానీ బీజేపీ ప్రభుత్వం ఎరువుల సరఫరా పై వివక్ష చూపుతుందని విమర్శించారు. గాంధీభవన్ లో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎరువుల తయారీ, సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉంటుందన్నారు. రైతాంగానికి రూ.22 వేల కోట్ల రుణమాఫీ, రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.ఆరు వేల చొప్పున తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు విడుదల

- మిగతా 2 లో

రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

ఆస్ట్రేలియా 'డికన్ వర్సిటీ' భాగస్వామ్యంతో ఏర్పాటు

మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎల్ఓఐపై సంతకాలు

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ భాగస్వామ్యంతో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'డికన్ విశ్వవిద్యాల యం' ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ)పై సోమవారం అంబేద్కర్ సచివాలయంలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో 'డికన్ వర్సిటీ' వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా సంతకాలు చేశారు. అనంతరం ఒప్పంద పత్రాలను

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నేనే డియర్! జనం మా ప్రభుత్వం మీద కోపంతో నన్ను నిమజ్జనం చేసేసారు!

త్యాగధనులు కమ్యూనిస్టులు

- శత వసంతాలైనా ప్రజల గుండెల్లోనే
- ఎర్రజెండాలన్నీ ఒకే జెండాగా మారాలి
- సురవరం సంస్మరణ సభలో వక్తలు

విశాలాంధ్ర–హనుమకొండ: ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక హరిత కాకతీయ హోటల్‌లో సోమవారం సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ హనుమకొండ, వరంగల్ జిల్లా

- మిగతా 2 లో

తెలంగాణ ఉద్యమంలో

సురవరం కృషి మరువలేనిది

- గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్
- సుధాకరరెడ్డి పేరిట గ్రంథాలయం ప్రారంభం

8 లో

భారత్, రష్యాపై సుంకాల విధింపు సబబే: జెలెన్స్కీ

కీవ్: ఉక్రెయిన్‌పై యుద్ధానికి స్వస్తి చెప్పేలా ప్రపంచ దేశాలు రష్యాపై తీవ్ర ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేసే భారత్ వంటి దేశాలపై సుంకాలు విధించడం సరైన చర్యేనని ఆయన సమర్థించారు. ఇటీవల షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధినేత జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి వేదిక పంచుకోవడంపై ఓ ఇంటర్వ్యూలో జెలెన్స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన అతిపెద్ద డ్రోన్ల దాడిపై జెలెన్స్కీ మండిపడ్డారు. రష్యాపై కఠిన ఆంక్షలను విధించాల్సిన సమయం ఆసన్నమైందని పశ్చిమ దేశాలకు పిలుపునిచ్చారు. "మనం పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావడం అవసరం. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సరిగానే ఉన్నారని నేను అనుకుంటున్నా. కొన్ని దేశాలు ఇంకా రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నాయి. ఇది అన్యాయం. రష్యా నుంచి ఏదీ కొనుగోలు చేయకూడదు. యుద్ధాన్ని పరిష్కరించాలంటే రష్యాతో అన్ని రకాల డీల్స్ ఆపేయాలి. ట్రంప్ ఒత్తిడి తెస్తారని నేను నమ్ముతున్నా. పుతిన్ వద్ద ఉన్న ఆయుధం 'చమురు'. పుతిన్‌ను ఆపాలంటే ఆ ఆయుధాన్ని తీసేయాలి. ప్రపంచ దేశాలు రష్యాపై ప్రకటనలు చేయకుండా ఆంక్షలు పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. రష్యా దాడులు మాటలతో ఆగవు. ఆర్థికంగా, రాజకీయంగా ఒత్తిడి పెంచితేనే పుతిన్ వెనక్కి తగ్గుతారు" అని జెలెన్ స్కీ పేర్కొన్నారు. కాగా, రష్యాపై రెండో దశ ఆంక్షలు విధించేందుకు అమెరికా సిద్ధమవుతోంది. మాస్కోపై అదనపు టారిఫ్‌లు వేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికాతో పాటు ఐరోపా సమాఖ్య దేశాలు ద్వితీయ సుంకాలు విధిస్తే మాస్కో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని అమెరికా ఆర్థికమంత్రిగా స్కాట్ బెసెంట్ చెప్పిన చేసిన కొద్ది గంటలకే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల కాలంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలని భారత్ కూడా ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని మోదీ అటు పుతిన్, ఇటు జెలెన్స్కీతో చర్చలు జరుపుతున్నారు. పుతిన్‌తో భేటీకి ముందు కూడా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో ఫోన్‌లో మాట్లాడారు.

అవినీతి, సోషల్‌మీడియా నిషేధంపై

నేపాల్‌లో నిరసనలు హింసాత్మకం

- పార్లమెంటును ముట్టడించిన ఆందోళనకారులు
- భద్రతాబలగాల కాల్పుల్లో 20 మంది మృతి

కాట్మండు: నేపాల్‌లో ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలపై, ఇటీవల వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి కీలక సామాజిక మాధ్యమాలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా యువత చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. వేలాది మంది యువత రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నారు. ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా కాట్మండులో జరిగిన ఘర్షణల్లో 20 మంది మృతి చెందారు. 300 మంది వరకూ గాయపడ్డారు. సోషల్ మీడియా నిషేధానికి వ్యతిరేకంగా పార్లమెంటు వెలుపల జనరేషన్- జెడ్ ఆందోళనకారులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనకారులు పార్లమెంటు గేటును ధ్వంసం చేయడంతో పోలీసులు వారిపై కాల్పులు జరిపారు. జలఫిరంగులను ప్రయోగించారు. భాష్ప వాయువుని వదిలారు. రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. దీంతో చాలామంది గాయాలపాలయ్యారు. 20 మంది మృతి చెందారని ప్రముఖ మీడియా కాట్మండు పోస్టు తెలిపింది. ఏకంగా నేపాల్ పార్లమెంటు ఆవరణలోకి చొచ్చుకువచ్చిన ఆందోళనకారులు దాడులకు పాల్పడటంతో భద్రతా సిబ్బంది తమను తాము కాపాడుకోవడానికి అక్కడి నుంచి పారిపోవాల్సి వచ్చింది. వేలాది మంది ఆందోళనకారులను అదుపు చేసేందుకు భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. మరింత రెచ్చిపోయిన ఆందోళనకారులు ఇనుపరాడ్లు, సీసాలు, రాళ్లతో ఎదురుదాడికి దిగారు. నిరసనకారుల దాడుల్లో అనేకమంది భద్రతాసిబ్బంది గాయపడ్డారు. వారి షీల్డ్‌లు విరిగిపోయాయి. భద్రతా బలగాలు ప్రయోగించిన భాష్పవాయు గోళాలను నిరసనకారులు తిరిగి వారిపైనే ప్రయోగించారు. తీవ్ర ప్రతిఘటనతో తమను తాము రక్షించుకునేందుకు భద్రతా బలగాలే అక్కడి నుంచి వెనుదిరగాల్సి వచ్చింది.

ఉపాధి దెబ్బతింది: ఆందోళనకారుల ఆగ్రహం

ఒకేసారి భారీ స్థాయిలో సామాజిక మాధ్యమాలను నిషేధించడం వల్ల ఉపాధి దెబ్బతిందని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిపై ఆధారపడ్డ యూట్యూబర్లు, వ్లాగర్లు, బ్లాగర్లు ఇలా అందరి ఉపాధి నాశనమవుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చడానికే సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వం నిషేధం విధించిందని ఆందోళనకారులు ఆరోపిస్తున్నారు.

నేపాలీ కళాకారులు, నటులు, సంగీతకారుల మద్దతు

నిర్దిష్ట గడువు లోగా కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక శాఖ వద్ద రిజిస్టర్ కాలేదంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, యూట్యూబ్, ఎక్స్, రెడిట్, లింక్డిన్ వంటి సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం గురువారం నిషేధం విధించింది. ఈ మాధ్యమాలు ఆగస్టు 28 నుంచి ఏడు రోజుల్లోగా రిజిస్టర్ కావాల్సి ఉంది. టిక్‌టాక్, వైబర్, విట్క్, నింబజ్, పోపో లైవ్ మాత్రం రిజిస్టర్ అయ్యాయి. టెలిగ్రామ్, గ్లోబల్ డైరీలు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేశాయి. వాటికి ఆమోదం తెలిపే ప్రక్రియ జరుగుతోంది. కాగా కీలకమైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్‌లకు దూరమవడంతో నేపాల్ యువత రోడ్డెక్కింది. నేపాలీ కళాకారులు, నటులు, సంగీతకారులు నిరసనలకు మద్దతు పలకడంతో అది తీవ్ర రూపం దాల్చింది. ప్రభుత్వ నిషేధం భావ ప్రకటన, పత్రికా స్వేచ్ఛకు భంగకరమనీ, రాజ్యాంగం భరోసా ఇచ్చిన సమాచార హక్కును కాలరాస్తోందని నేపాల్ పాత్రికేయుల సమాఖ్య విమర్శించింది. సామాజిక మాధ్యమాలపై నిషేధం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేసింది.

దేశ గౌరవానికి భంగం కలిగిస్తే సహించం: ప్రధాని

మరోవైపు దేశంలో ఘర్షణలు ఉద్రిక్తంగా మారడంపై ప్రధాని కేపీ శర్మ ఒలి స్పందించారు. తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. దేశ గౌరవానికి భంగం కలిగిస్తే సహించబోమని స్పష్టంచేశారు. చట్టాలను ఉల్లంఘించి ఆ సంస్థలు వ్యాపారం చేస్తున్నాయని, వాటిని సహించబోమని వివరించారు. సామాజిక మాధ్యమాలను నిషేధించడం వల్ల కొంతమంది ఉపాధి కోల్పోయినప్పటికీ దాని కన్నా దేశమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.

ఓటింగ్‌కు బీఆర్ఎస్, బీజేడీ దూరం

(మొదటిపేజీ తరువాయి)

తమ ఎంపీలు ఓట్లు సక్రమంగా వేసేందుకు వీలు కల్పిస్తూ రెండు కూటములూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేశాయి. బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ అధినాయకత్వం తలపెట్టిన రెండ్రోజుల వర్క్‌షాప్ ఆదివారం దిల్లీలో మొదలైంది. ప్రధాని మోదీ దీనికి హాజరయ్యారు. సోమవారం బీజేపీ అగ్రనేతలు ఎన్డీఏ ఎంపీలతో భేటీ అయ్యి పోలింగ్‌కు సంబంధించిన వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో తమ ఎంపీలతో భేటీ నిర్వహించి ఈ ఎన్నికలో ఓటు వేయాల్సిన పద్ధతిని, పాటించాల్సిన విధివిధానాలను సభ్యులకు ఇండియా కూటమి వివరించింది. సమావేశం అనంతరం వారికి మాక్ పోల్ నిర్వహించారు. తమ కూటమి బలంగా ఉందని, విపక్షం ఐక్యంగా ఉందని ప్రతిపక్ష ఎంపీలు అన్నారు. మెజార్టీ మార్జిన్ తక్కువగా ఉందని, అందువల్ల తమ అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. తప్పుడు ఓటింగ్ జరిగే అవకాశం లేకుండా మాక్ పోలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. అన్ని పార్టీల ఎంపీలూ ఇప్పటికే దిల్లీ చేరుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఆయా పార్టీల మద్దతు కోరిన సుదర్శన్‌రెడ్డి కూడా దేశ రాజధానికి వచ్చేశారు. తాను ఏ పార్టీ తరఫునా పోటీ చేయడం లేదని, రాజకీయాలకతీతంగా తనకు ఓటు వేయాలని ఆయన ఉభయ సభల ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. మరోపక్క ఎన్నికలకు తమ ఎంపీలను సమాయత్తపరిచేందుకు ఏపీ నుంచి మంత్రి నారా లోకేశ్, తెలంగాణ నుంచి స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీ చేరుకున్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రహస్య ఓటింగ్ విధానం అనుసరిస్తారు. రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశమూ ఉంటుంది. ఇక ఈ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ఓటింగ్ ఏజెంట్లను నియమించింది. వీరిలో తెలుగుదేశం పార్టీకి చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో పాటు మరో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు, ఎంపీ శ్రీకాంత్ షిండే ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పోలింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

ఎన్డీయే వర్సెస్ 'ఇండియా'

లోక్‌సభ 542, రాజ్యసభలో 239 సభ్యులు కలిసి మొత్తం ఎలక్టోర్ల సంఖ్య 781 కాగా ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 391. అధికార ఎన్డీయే కూటమికి ఇప్పటివరకు 422 సభ్యుల బలముంది. దీంతో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ (11 మంది సభ్యులు) ఎన్డీయేకు మద్దతు ఇస్తుండడంతో మెజార్టీ పెరగనుంది. మరిన్ని పార్టీలు మద్దతు తెలిపే అవకాశం ఉంది. కాగా ఇండియా ఐక్యసంఘటనకు 311 మంది బలముంది. ఇతరులు 45 మంది ఉన్నారు. వీరితో సహా కొన్ని పార్టీలు మద్దతిచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తున్నారు. దీంతో పార్టీలకు అతీతంగా ఆలోచించి ఓటు వేయాలని 'ఇండియా' అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇప్పటికే ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఉత్కంఠ నెలకొంది.

త్యాగధనులు కమ్యూనిస్టులు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్ బాష్ మియా అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టులు నిస్వార్థపరులని... సురవరం, సీతారాం ఏచూరి, గద్దర్ వంటి వారు మరణించినప్పుడు ప్రజలు నీరాజనాలు పలకడం దీనికి నిదర్శనమన్నారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికల్లో ధన ప్రవాహంగా ... మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సీపీఐ నిలబడిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుంచి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగిస్తూ ఈసీ, సీబీఐ వంటి సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిని అణిచివేసే చర్యలు చేపడుతున్నదని విమర్శించారు. దేశంలో కమ్యూనిస్టులంతా ఏకం కావాలని, ఎర్రజెండాలన్నీ ఒకే జెండాగా మారాలని అందరూ అదే కోరుకుంటున్నారని అన్నారు. ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించడమే సురవరంకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణా సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ మనువాద భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్న బీజేపీని తరిమికొట్టేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాతో సురవరంకు అనుబంధం ఉందని, భూపోరాటాలకు సహకారం అందించారని గుర్తు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, టి. వెంకట్రాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, వలి ఉల్లా ఖాద్రి, టి.విశ్వేశ్వర్ రావు, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, ఆరూరి కుమార్ పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయింపులకు బీఆర్ఎస్ ఆజ్యం: కూనంనేని

రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బీఆర్ఎస్ పార్టీయేనని కూనంనేని సాంబశివరావు అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. పార్టీ మారగానే సభ్యత్వం రద్దు చేయాలని, ఇందుకు పార్టీ ఫిరాయింపుల చట్టంలోనే మార్పులు రావాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి పై నిష్పక్షపాతవంగా విచారణ జరపాలన్నారు. కేంద్రం కనుసన్నల్లో కాకుండా సీబీఐ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.

రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

(మొదటిపేజీ తరువాయి)

పరస్పరం మార్పిడి చేసుకున్నారు. 'అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ సంకల్పం. ఏఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ -సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు డికన్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. ఇది కేవలం లాంఛనప్రాయ ఒప్పందం కాదు. రాబోయే రోజుల్లో కీలక రంగాల్లో తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షి సంబంధాల మెరుగుదలకు దిక్సూచీగా మారుతుంది. సమాజానికి ఉపయోగపడే అత్యాధునిక ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశోధనలు, వ్యవస్థాపకతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. 'ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రంగాల్లో ప్రపంచానికి అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తెలంగాణ నుంచే అందించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ సంయుక్తంగా నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏఐ కోర్సులకు రూపకల్పన చేసి, ఇక్కడి యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణనిస్తాయి. మన ఏఐ స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్ లో తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వ వ్యాప్తం చేసేలా ఆస్ట్రేలియా నిపుణులు మార్గదర్శకత్వం చేస్తారు ' అని మంత్రి చెప్పారు. 'ఏఐ కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాకుండా, సమ్మిళిత వృద్ధికి, మానవాభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా మార్చేలా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది. ఈ లక్ష్య సాధనలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ మార్గదర్శిగా మారుతుంది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గవర్నెన్స్ తదితర రంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా సంయుక్త పరిశోధనలు నిర్వహిస్తాం. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొనేందుకు కృషి చేస్తాం' అని తెలిపారు. 'ఏఐలో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, ప్రజల శ్రేయస్సు కోసం సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతోనే భారత్ లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని డికన్ వర్సిటీ వీసీ ఇయాన్ మార్టిన్ తెలిపారు. డిప్యూటీ కాన్సూల్ జనరల్(ఆస్ట్రేలియన్ కాన్సూలేట్-జనరల్ బెంగళూరు) స్టీవెన్, కాన్సూల్ ఆండ్రూ కాలిస్టర్, ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్ మెంట్ కమిషనర్ వికా సింగ్, పొలిటిల్ అండ్ ఎకానమిక్ రీసెర్చ్ ఆఫీసర్ రంజని మాధవన్, డికన్ యూనివర్సిటీ ప్రతినిధులు రౌనీత్ పాహ్వా, ప్రియాంక సింగ్, గాయత్రి వేద్ నారాయణన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అంగీకరించాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్‌కు సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. అయితే ఆధార్ పౌరసత్వానికి మాత్రం ధ్రువీకరణ కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అక్రమ వలసదారుల సమస్య దృష్ట్యా, అవసరమైన వేళ ఎన్నికల కమిషన్ సదరు ఆధార్ సరైనదేనా అనేది తనిఖీ చేయవచ్చని వెల్లడించింది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ), ఏఐఎంఐఎం (ఏఐఎంఐఎం) ఇతర పార్టీలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషన్ల వాదనలు విన్న తరువాత మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జాబితాలో చేర్చడానికి లేదా తొలగించడానికి ఆధార్ కార్డును కూడా కమిషన్ ప్రకటించిన ధ్రువీకరణ పత్రాల జాబితాలో 12వ పత్రంగా పరిగణించాలని పేర్కొంది. ఇది 1950 నాటికి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగా తీసుకొన్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఇప్పటికే ఈ జాబితాలో పాస్‌పోర్టు, బర్త్ సర్టిఫికెట్ వంటి 11 పత్రాలను ఐడీ ప్రూఫ్‌లుగా ఎలక్షన్ కమిషన్ స్వీకరిస్తోంది. కనుక తమ ఆదేశాలు ప్రజలకు తెలిసేలా ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో ఆధార్ ధ్రువీకరణ పత్రం ఆమోదయోగ్యమే అని తెలుపుతూ నోటీసులు ప్రదర్శించాలని సుప్రీంకోర్టు సూచించింది. అంతకు ముందు ఎలక్షన్ కమిషన్ తరఫున రాకేష్ ద్వివేది తన వాదనలు వినిపిస్తూ ఈసీ ఆధార్‌ను ప్రూఫ్‌గా స్వీకరించడానికి అంగీకరించినా, పిటిషనర్లు దానిని 12వ గుర్తింపు పత్రంగా చేర్చమని కోరడం దేనికని ప్రశ్నించారు. పౌరసత్వ ధ్రువీకరణ విషయంలో పాస్‌పోర్టుకు ఉన్న విలువ ఆధార్‌కు లేదని ఆయన చెప్పారు. అలాంటప్పుడు దానిని ఆ జాబితాలో ఎలా చేరుస్తామని అన్నారు. విచారణ సందర్భంగా ఆర్జేడీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఆధార్‌ను ఉద్దేశ పూర్వకంగానే ఎన్నికల సంఘం మినహాయిస్తోందని, 11 నోటిఫైడ్ డాక్యుమెంట్లను మినహా వేటినీ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు అంగీకరించడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. ఆధార్ వంటి యూనివర్సల్ డాక్యుమెంట్‌ను నిరాకరిస్తే ఇంక్లూజివ్ ఎక్సర్‌సైజ్ అనే మాటకు అర్థం ఉండదన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... కేవలం 'ఆధార్' ఆధారంగానే ఓటర్ స్థాయిని నిర్ధారించాలని పిటిషన్ల అభిప్రాయమా అని ప్రశ్నించారు. దీనికి సిబల్ సమాధానమిస్తూ, తాను 2025 ఎన్నికల జాబితాలో ఉన్నానని, ఇంక ప్రూఫ్ చేసుకోవడం అనే ప్రశ్న ఎలా తలెత్తుందని అన్నారు. బీఎల్‌ఓలు తన పౌరసత్వాన్ని నిర్ధారించలేరని పేర్కొన్నారు. ఈసీ కోర్టులో చెబుతున్న దానికి, క్షేత్రస్థాయిలో అధికారులకు ఇస్తున్న ఆదేశాలకు మధ్య తేడా కనిపిస్తోందని ధర్మాసనం అభిప్రాయపడింది. తాము ఆదేశాలిచ్చిన ప్పటికీ ఆధార్ అక్కరలేకుండా 11 డాక్యుమెంట్లనే ఎందుకు కాపీలో ప్రస్తావిస్తున్నారని నిలదీసింది. దానికి ఎన్నికలసంఘం తరఫు న్యాయవాది రాకేష్ ద్వివేదీ సమాధానమిస్తూ... ఎక్కడైనా పొరపాటు జరిగిందేమో చూస్తానని, ఆధార్ అంగీకరించాలని కోర్టు ఇచ్చిన గత ఆదేశాలను ఎన్నికల సంఘం ప్రచురించిందని తెలిపారు.

ఎరువుల కేటాయింపులో కేంద్రం వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్టు వివరించారు. సన్న వడ్ల కి రూ.500 బోనస్ ఇచ్చినట్టు చెప్పారు. ఇన్ని చేసినా కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత రావాలని బీజేపీ, బీఆర్ఎస్‌లు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఉన్న రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ లో నాలుగు నెలలు ఉత్పత్తి ఆపివేసి తెలంగాణ రైతాంగాన్ని కావాలని ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. రాష్ట్రానికి 11 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా 5.2 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్... తెలంగాణ రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఎరువుల లోటు వల్ల దిగుబడుల పై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. రైతులను రోడ్ల మీద నిలబడే పరిస్థితి తెచ్చారని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన తెలంగాణకు ఎరువులు పంపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఎరువుల కొరత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు బీజేపీ పాపమని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు రైతులపై అవగాహన లేదని, ఎరువుల కొరత పై మీ అధినాయకత్వాన్ని ఎందుకు అడగలేదు.. ఎరువుల కొరతపై మీ పాత్ర, తీసుకున్న నిర్ణయం.. రాసిన లేఖ బయటపెట్టండని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్రెడ్డి రామ్ రెడ్డి, మీడియా కమిటీ ఛైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి, కత్తి వెంకట్ స్వామి, కైలాష్ పాల్గొన్నారు.

గోదావరి జలాలతో మూసీ ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

అని మాట్లాడుతున్నారని, చేవెళ్లలో వైఎస్ ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాసుల కక్కుర్తితో తలను తొలగించింది మీరు కాదా అంటూ ధ్వజమెత్తారు. చేవెళ్ల, తాండూరు, పరిగికి సాగునీరు అందకపోవడానికి కారణం మీరు కాదా అని నిలదీశారు. తుమ్మిడిహెట్టీ దగ్గర ప్రాణహిత చేవెళ్ల కట్టి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. గంగా నదీ, యమునా, సబర్మతీ నదులు ప్రక్షాళన చేయొచ్చు కానీ మేం మూసీ నదిని ప్రక్షాళన చేయొద్దా అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు ఎందుకు మూసీ నది ప్రక్షాళన చేపట్టలేదని నిలదీశారు. ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబరు తొమ్మిదో తేదీన తెలంగాణ సమాజానికి అంకితం ఇవ్వబోతున్నామని ప్రకటించారు. నగర అభివృద్ధిలో అందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

వంద రోజుల్లో మేడారం అభివృద్ధి పనులు పూర్తి

వంద రోజుల్లో మేడారం అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మేడారం, బాసర ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను సీఎంకు వివరించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండాలన్నారు. లోనికి వెళ్లాలన్నా... బయటకు రావాలన్నా... పార్కింగ్ వసతులు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా చెక్ డ్యామ్ ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన వివిధ సూచనలు చేశారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు వాడుకుంటూ 'కాళేశ్వరం'పై అక్కసు

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపన చేస్తున్నాడని విమర్శించారు. లక్షకోట్ల అవినీతి, కాళేశ్వరం కూలేశ్వరం అన్న ఆరోపణలు చేసిన రేవంత్ , ముఖం చెల్లకనే ఇలా చేశారని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో ఎలాంటి స్టోరేజ్ కెపాసిటీలను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదన్న కేటీఆర్, తాము మాత్రం కాళేశ్వరం ప్రాజెక్టులో 141 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 15 రిజర్వాయర్లను నిర్మించామన్నారు. దీంతో సహజంగానే నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. 2006లో అంచనాలు రూపొందించిన ప్రాణహిత చేవెళ్లకు, 2015లో అంచనాలు రూపొందించిన కాళేశ్వరానికి మధ్య తేడా ఉంటుందన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్ కు గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు తమ హయాంలో రూ.1,100 కోట్లతో రూపొందించిన అంచనాలను రూ.7,390 కోట్లకు అంటే ఏడు రెట్లు పెంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేస్తుందన్నారు. రూ.16 వేల కోట్లతో పూర్తయ్యే మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కూడా రూ.1,50,000 కోట్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెంచితే హైదరాబాద్ ప్రజలతో కలిసి దాన్ని బీఆర్ఎస్ అడ్డుకుందన్నారు. మొన్న 12 లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకుని చెక్కు చెదరకుండా ఉన్న మేడిగడ్డ బారేజ్ లోని మూడు పిల్లర్లను ఇప్పటివరకు ఎందుకు రిపేర్ చేయించడం లేదో కాంగ్రెస్ ప్రభుత్వం జవాబు చెప్పాలన్నారు. బనకచర్ల కోసమే మేడిగడ్డను బొందపెట్టే కుట్రలకు రేవంత్ తెర తీశాడని ఆరోపించారు. తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో ఇంకా విచారణ అవసరం లేదన్నారు. పీసీసీ ప్రెసిడెంట్ , కడియం శ్రీహరి అప్రూవర్ లుగా మారి నేరాన్ని అంగీకరించారని చెప్పారు. స్పీకర్ వెంటనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలని డిమాండ్ చేశారు. యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్న 71 లక్షల తెలంగాణ రైతుల కోసం తాము ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

బీసీ రిజర్వేషన్లపై ఆ రెండు పార్టీల కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

పాత వారికి పదవులు ఇచ్చామని, 20 శాతం కొత్త వారికి అవకాశం కల్పించామని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని పార్టీ యోచిస్తోందని అన్నారు. వచ్చే నెల నుంచి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలపై పూర్తిగా దృష్టి సారిస్తామన్నారు. డీసీసీ కమిటీలు వారంలో పూర్తవుతాయని, గ్రామ స్థాయిలో ఓట్ చోరీ పై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామ అధ్యక్షుల ఎంపిక మూడు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ కి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, ఈ నెల 15 న జరిగే కామారెడ్డి సభను విజయవంతం చేయాలని సూచించారు.

2029లో మోదీకి పరాభవం తప్పదు: మహేశ్ కుమార్ గౌడ్

మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పేర్కొన్నారు. దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ నిలుస్తుందని అన్నారు. ఉచిత బస్సు మొదలుకొని సన్నబియ్యం వరకు చరిత్రాత్మక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. కామారెడ్డి లో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని, వోట్ చోరీ పై రాహుల్ గాంధీ ఎనలేని పోరాటం చేస్తున్నారని అన్నారు. మోదీ, అమిత్ షా ఓట్ చోరీ చేస్తారని, మహారాష్ట్రలో ఓట్ చోరీ జరిగిందని ఆరోపించారు. ఓట్ చోరీ వల్లే మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ... 12 ఏళ్లలో 24 కోట్ల ఉద్యోగాలు ఇచ్చిందా అని ప్రశ్నించారు. బీజేపీ వాళ్లకు ఎన్నికలు వస్తే దేవుడు గుర్తొస్తారని, కిషన్ రెడ్డి, బండి సంజయ్ దేవుళ్ల పేరు చెప్పి గెలిచారని దుయ్యబట్టారు. 2029 లో మోదీకి పరాభవం తప్పదు...రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ ముక్కలవుతుందని, కవిత ప్రకటనతో కేసీఆర్ కుటుంబం దోపిడీ బట్ట బయలు అయింద న్నారు. సీఎం రేవంత్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ యాప్‌లు రద్దు చేసి పనిభారం తగ్గించాలి

విశాలాంధ్ర - ఖమ్మం : తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలపై పని భారం మోపి వారి ప్రాణాలను హరించవద్దంటూ తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం (ఏఐటీయుసి) రాష్ట్ర గౌరవాధ్యక్షులు తోట రామాంజనేయులు ప్రభుత్వానికి విన్నవించారు. సోమవారం ఏఐటీయుసి రాష్ట్ర సమితి ఎన్సిడితోపాటు ఆన్లైన్ యాప్‌లను రద్దు చేసి పని భారం తగ్గించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఫస్ట్ ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎం, అవుట్సోర్సింగ్ ఏఎన్ఎం, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాని నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో పేపర్ లెస్ ప్రోగ్రామ్స్ అంటూ మొబైల్ అప్లికేషన్‌లను తీసుకువచ్చి ఉద్యోగులను నానా ఇబ్బందుల గురి చేస్తున్నారన్నారు. 32 రకాల మొబైల్ అప్లికేషన్స్‌ను అప్లోడ్ చేయాలంటే దాదాపు 10 నుండి 16 గంటల సమయం పడుతుందన్నారు. ఆన్లైన్ వర్క్‌ల విషయంలో అధికారుల వేధింపులు మానకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జి.క్లెమెంట్, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఫస్ట్ ఏఎన్ఎం నాయకులు కృష్ణకుమారి నాగమణి, సరోజ, ఏ.విజయలక్ష్మి, సరస్వతి రచ్చ సీత, సరస్వతి, ముంతాజ్, జ్యోతి, రెండవ ఏఎన్ఎం సంఘ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, శైలజ, హేమ, సుగుణ, మంగమ్మ, భవాని, నిర్మల, శోభ, స్వాతి రెడ్డి, అభేదా, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లకు బిజెపినే ప్రధాన అడ్డంకి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: బీసీ రిజర్వేషన్లు రాకుండా, తమ రాజకీయ అవకాశవాదంతో కేంద్ర బిజెపి ప్రభుత్వం మోకలడ్డుతుందని ఆత్మ కమిటీ చైర్మన్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. సోమవారం సిపిఐ మరిపెడ మండలం కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు శాసనసభలో బిల్లు ఆమోదించినా రాజ్యాంగ సంస్థలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటూ బిల్లు ఆమోదం కాకుండా అడ్డుకుంటున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవకతవకలపై విచారణ జరిపిన పిసి ఘోష్ నివేదిక బిఆర్ఎస్ అవినీతిని తేటతెల్లంతో చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా మరింత పారదర్శకత కోసం సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం కోరడం స్వాగతించవలసిన విషయమన్నారు. లాలూచీ రాజకీయాలను మానుకొని, రాష్ట్రానికి న్యాయంగా కేటాయించాల్సిన యూరియా వెంటనే విడుదల చేసి తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, రాసాల యుగేందర్, జి.ఎల్లయ్యా పాల్గొన్నారు.

పోలింగ్‌కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో :జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే తెలియజేయా లని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురణ, తదితర అంశాలపై చర్చించారు. కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 6న జిల్లా పరిషత్, మండల పరిషత్ నియోజకవర్గాల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించామని, జిల్లాలో 23 జడ్పీటీసీ నియోజక వర్గాలు, 235 ఎంపీటీసీ నియోజకవర్గాల్లో మొత్తం 6,94,815 మంది ఓటర్లు ఉండగా, 1,272 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యంత రాలపై సెప్టెంబర్ 8న జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని, సెప్టెంబర్ 9న అందిన అభ్యంతరాలు, సూచనలను పరిష్కరించి, సెప్టెంబర్ 10న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు. జడ్పీ సీఈఓ వి.వి. అప్పారావు, డిపిఓ యాదగిరి, జడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, డిఎల్పిఓ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి రాజేశ్వరరావు, బిజెపి ప్రతినిధులు నర్సింహా, హబీద్, సీపీఐ(ఎం) ప్రతినిధి గోపి, బీఆర్ఎస్ ప్రతినిధులు బిక్షం, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, సీపీఐ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, వైఎస్సార్సీపీ ప్రతినిధి రమేష్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రతినిధులు డేవిడ్ కుమార్, సైదులు, ప్రజావాణి ప్రతినిధి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాలుర ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ హరిత విద్యాలయం

విశాలాంధ్ర - గూడూరు: స్వచ్ఛత హరిత విద్యాలయ రేటింగ్ 2025 కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన కార్యక్ర మాన్ని ఎంఈఓ రవికుమార్ గూడూరు మండల కేంద్రంలోని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా ఆదినారాయణ, రాము, మనోహర్‌లు వ్యవహరించారు. మండలంలో మొత్తం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు 103 ఉన్నాయని, వీటితో పాటు ఒక జూనియర్ కళాశాల తప్పనిసరిగా స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగును పూర్తి చేసుకోవాలని చెప్పారు. ఇది కేంద్రం ప్రాయోజిత కార్యక్రమం అయినందున తప్పనిసరిగా యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే రిసోర్స్ పర్సన్‌లను సంప్రదించాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారు లకు ఆదేశించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్షిస్తూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వనమహో త్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలనీ సూచించారు. వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్న అధికారులందరినీ ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈనెల 10న జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన ఉందని, అధికారులంతా తమ తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి ప్రాధాన్యత : మంత్రి దామోదర

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: పల్లెల ప్రగతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. దనూరలో రూ.4 కోట్ల అంచనాతో కొత్తపల్లి నుండి చింతకుంట వరకు రోడ్డు, టేక్మాల్-ధనుర రోడ్డుకు 3 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు పటిష్ట పరుచుటకు శంఖుస్థాపన చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ ఎన్టిఎఫ్టిఎఫ్ నిధులతో 5.19కోట్లతో తండా రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం మోడల్ స్కూల్‌ను పరిశీలించారు. మోడల్ స్కూల్ మౌలిక వసతులపై కలెక్టర్ రాహుల్ రాజ్, ఉపాధ్యాయులతో సంప్రదింపులు జరిపి, కంప్యూటర్ ల్యాబ్ వెంటనే ప్రారంభించాలని, కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 326 లక్షల రూపాయల వ్యయంతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి వెంకటాపూర్ తండా వరకు బిటి రోడ్డు, నార్సింగి నుండి శంకరంపేట వరకు 13 కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్, ఆర్డీఓ రమాదేవి, డిఎంహెచ్ఓ డా. శ్రీరామ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, ఈ.ఈలు సర్దార్ సింగ్, నర్సింలు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ భాషా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు ఆన్‌లైన్ బాధ్యతలు రద్దు చేయాలి

విశాలాంధ్ర - వనపర్తి : ఏఎన్ఎంలకు ఎన్‌సిడి ఆన్లైన్ ప్రోగ్రాం బాధ్యతలను తప్పించాలని ఏఐటియుసి నేతలు డిమాండ్ చేశారు. ఆన్లైన్ బాధ్యతలను ఏఎన్ఎంలకు అంటగట్టడంపై ఏఐటియుసి జిల్లా సమితి ఆధ్వర్యం లో జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. తక్షణం ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఏఐటియుసి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరి మోషలు మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎన్సీడీ ప్రోగ్రాంను ఆన్లైన్‌లో ఎక్కించే పని కూడా ఎఎన్ఎంలతో చేయించడం దుర్మార్గమైన చర్య అని ఈ చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎన్సీడీ ప్రోగ్రాం ను ఆన్లైన్లో కూడా చేయించాలని ఒత్తిడి తేవడంతో తీవ్రమైన పని ఒత్తిడితో ఏఎన్ఎంలు అనేక రకాల రోగాలకు గురవుతున్నారన్నారు. ఏఎన్ఎం లందరికీ జీతాలు పెంచి పని ఒత్తిడి తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరామ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కృష్ణవేణి, లక్ష్మి, ఎఎన్ఎంలు సుమిత్ర, లత, బాలేశ్వరమ్మ, వెంకటమ్మ. మాధవి, రాధిక, లలిత, అనురాధ, రమాదేవి పాల్గొన్నారు.

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లాలో జ్వరాలు, ముఖ్యంగా టైఫాయిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతూ, రక్షిత మంచినీరు అందించేందుకు ఆర్డబ్ల్యూఎస్ శాఖ, శానిటేషన్ కోసం పంచాయతీరాజ్ శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. గ్రామాలలో శానిటేషన్ పనులు నిరంతరం కొనసాగాలని, జ్వరాల నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి ఎక్కువగా దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఈనెల 13న ఉత్తమంగా పనిచేసిన ఉద్యోగులను మంత్రుల చేత సత్కరించే కార్యక్రమం నిర్వహించనున్న ట్లు తెలిపారు. ఇక గ్రామ పాలనలో పనిచేస్తున్న వారిని వెంటనే విధుల నుండి విడుదల చేయాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ పేర్కొన్నారు.ఈ సమావేశానికి స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్చార్జి డిఆర్వో వై. అశోక్ రెడ్డి, ఆర్డీవో రమణారెడ్డి, శ్రీదేవి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, డిఆర్డీఓ శేఖర్ రెడ్డి తదితర జిల్లా అధికారులు హాజరై ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

నూతన రోడ్లు నిర్మించాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ములుగు మండలంలో నూతన రోడ్లు నిర్మించాలని, సిపిఐ ములుగు జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ములుగు మండల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ రేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ములుగు మండలంలోని జగ్గన్నగూడెం గ్రామం నుండి కొత్తగూడెం మండలం ఊటాయి రాంపూర్ వరకు సుమారు 15 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మించాలని ములుగు మండలం కొత్తూరు యాపల గడ్డ నుండి పొట్లపూర్ సుమారు నాలుగు కిలోమీటర్లు, తదితర గ్రామాలకు రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ నూతన రోడ్ల వల్ల ములుగు మండలం నుండి కొత్తగూడెం మండలానికి, నల్లవెల్లి మండలం, గోవిందరావుపేట మండలంకు ప్రజా సంబంధాలు గిరిజన ఆదివాసి సంబంధాలు మెరుగవుతా యన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు యుండి అంజద్ పాష, మండల కార్యదర్శి ముత్యాల రాజు, సీనియర్ నాయకులు ఇంజం కొమురయ్య, తవిటి నారాయణ, మంకిడి కృష్ణయ్య, కల్తీ తిరుపతి, ఈసం మహేందర్, బానోతు నారాయణ సింగ్, భూక్యా పరంసింగ్, నరసయ్య, సాంబయ్య, సంపత్ పాల్గొన్నారు.

ఎన్‌సిడి యాప్స్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ, పట్టణ హెల్త్ సెంటర్స్‌లో పని చేస్తున్న ఏఎన్ఎంలపై ఎన్సిడీ యాప్స్ పేర అదనపు పనులతో వేదిస్తున్నారని తక్షణం దీనినుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం మెరుగైన ఫలితాలు సాధిస్తున్న ఏఎన్ఎం లపై రోజుకో యాప్స్ పెట్టి అసలు చేయాల్సిన పనులు పక్కకు పెట్టి అదనపు పళ్ళు చేయాల్సి వస్తుందని విమర్శించారు. వివిధ రకాల 32 యాప్స్ పనులు చెయ్యాలని అధికారులు వత్తిడి చేస్తున్నారని దింతో ఏఎన్ఎంలు అసలు చేయాల్సిన బాధ్యత నిర్వీర్యం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. పైగా ఎఎన్సి టార్గెట్ ల పేర ప్రతి నెల గర్భిణీ లు నమోదు చెయ్యాలని వత్తిడి చేస్తూ టార్గెట్ పూర్తి కాకుంటే జీతం కట్ చేస్తామని ఇబ్బందులు పెట్టటం ఏమాత్రం సమంజసం కాదని ప్రసాద్ విమర్శించారు. ఇలాంటి ఒత్తిడిల వల్ల ఏఎన్ఎంలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఈ ధర్నా వద్దకు వచ్చిన జిల్లా వైద్య అధికారి జయలక్ష్మి కి వినతిపత్రం అందించారు. ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె భరోసా ఇచ్చారు. ఈ ధర్నాలో జిల్లా సంఘం అధ్యక్షురాలు ప్రియాంక, ప్రధాన కార్యదర్శి సారిక,నాయకురాళ్లు ఉమాదేవి, సీత, శుశీల, ధన లక్ష్మి,శారదా, బాల నాగమ్మ, పుష్ప, ఈరమ్మ పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొమురం భీం : తపాలా శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్ లతో కలిసి పోస్టల్ శాఖ సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల సేవలను తపాలా శాఖ కార్యాలయాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని, పొదుపు ఖాతాలు తెరవడం, ప్రధానమంత్రి కిసాన్, గ్యాస్ రాయితీ, అన్ని రకాల బిల్లు చెల్లింపులు చేయవచ్చని, అన్ని రకాల ప్రభుత్వ పథకాల లబ్ది పొందవచ్చని, అనేక రకాల జీవిత బీమా అవకాశం కల్పించిందని, సంవత్సరానికి 565 రూపాయల ప్రీమియం చెల్లిస్తే 10 లక్షల రూపాయల వ్యక్తిగత ప్రమాద బీమా, 345 రూపాయలు చెల్లిస్తే 5 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం తపాలా శాఖ కల్పిస్తుందని. జిల్లాలోని అన్ని తపాలా శాఖ కార్యాలయాలను ఈ సేవలు లభిస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్‌రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులకు జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన కేసులో ఐదేళ్లు జైలు శిక్ష

విశాలాంధ్ర - ఖమ్మం : కొణిజర్ల మండలం, గుబ్బగుర్తి గ్రామానికి చెందిన నిందితుడు బచ్చు హూస్సెన్ (23)కి కులం పేరుతో దూషించిన కేసులో ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 9500 జరిమాన విధిస్తూ.. ఖమ్మం ఎస్సి ఎస్టీ కోర్టు జిల్లా న్యాయాధికారి డి. రాంప్రసాద్ సోమవారం తీర్పు చెప్పారని వైరా ఏసీపీ రహేమాన్ తెలిపారు. బాధితురాలు ఖమ్మం నుంచి గుబ్బగుర్తి గ్రామానికి నిందితుని ఆటోలో వచ్చింది. ఆటో దిగి ఇంటికి వెళ్లి మరల ఆటోలో తన సామాన్లు మరిచిపోయానని, నిందితునిని అడగగా నిందితుడు కులం పేరుతో దూషించాడని 23 జనవరి 2019న కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో ఛార్జిషీట్ ధాఖలు చేయగా, అట్టి కేసును విచారించిన న్యాయాధికారి నిందితుడిపై నేరం రుజువు కావడంతో పై విధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. కృష్ణ మోహన్ వాదించినారు. విచారణ అధికారి అప్పటి వైరా ఏసీపీ ప్రసన్న కుమార్, ప్రస్తుత వైరా ఏసీపీ రహేమాన్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై శ్రీకాంత్, కానిస్టేబుల్ మల్లికార్జున్, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు, హోంగార్డ్ పాషాను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

నేటి బాలలే రేపటి పౌరులు

విశాలాంధ్ర-తొర్రూర్: నేటి బాలలే రేపటి పౌరులని లైన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ అధ్యక్షులు డాక్టర్ రామ నరసయ్య అన్నారు. సోమవారం వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా ఫిజియోథెర పిస్ట్ డాక్టర్ శాంతి, రోహిత్ హాస్పిటల్ నందు ఉన్న పేషెంట్స్‌కి ఫిజియోథెరపీ గాయం లేదా శస్త్ర చికిత్స తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుంది అని కండరాలు ఎముకలు కీళ్ల సమస్యలను పరిష్కరిస్తుందని నొప్పిని తగ్గించి కదలికలను మెరుగుపరుస్తుందని, కాళ్లు చేతులు విరిగిన అప్పుడు ఫిజియోథెరపీ చేపిచ్చుకుంటే త్వరగా కోలుకుంటారని తెలుపుతూ అవగాహన కల్పించి చిన్నచిన్న ఎక్సర్సైజులు ఎలా చేసుకోవాలి అని తెలిపి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. శాంతి, డా.కిరణ్ కుమార్ సన్మానించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం డే సందర్భంగా డాక్టర్ రామ నర్సయ్య, డాక్టర్ కిరణ్ కుమారులు మాట్లాడుతూ తల్లిదండ్రులకి పిల్లల చదువు కుంటే, భవిష్యత్తు ఎలా ఉంటదని, తెలిపి ఎన్ని ఆటంకాలు వచ్చినా పిల్లల్ని చదివించాలని నేటి బాలలే రేపటి పౌరులని, ప్రపంచాన్ని మార్చే ఆయుధం చదువు ఒక్కటే అని అన్నారు. ఆర్సి దామెర సరేష్, క్లబ్ సెక్రెటరీ ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్, పాల్గొన్నారు.

పోడు రైతులపై దాడులు సహించేది లేదు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : అనాదిగా పోడు సాగుచేసుకొని బుక్కెడన్నం తింటున్న గిరిజన, గిరిజనేతర రైతులపై అటవీ శాఖ అధికారులు జరుపుతున్న దాడులు, దౌర్జన్యాలకు స్వస్తి చెప్పాలని లేకుంటే పేదల నుంచి తిరుగుబాటు తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా హెచ్చరించారు. వ్యవసాయ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, మిగిలి పోయిన పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వలస ఆదివాసీలకు కులధృవీకరణ పత్రాలు అందించాలని డిమాండ్ చేస్తూ బికెఎంయు రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో ముఖ్య అతిధిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ పోడుసాగుదారులు, వ్యవసాయ కార్మికుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉండాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో పేదలు పోడుసాగు చేసుకొని పట్టెడు మెతుకులు తింటున్నారని వీరి భూములు లాక్కొని మల్లి అడవిలో దుంపలు తినే పరిస్థితి కల్పించవద్దని అధికారులు, ప్రభుత్వాన్ని కోరారు. దశాబ్దాల నుంచి సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో కందకాలు తవ్వి, సాగులో ఉన్న పంటలను ధ్వంసం చేస్తూ, మొక్కలు నాటి బలవంతంగా భూములు లాక్కునే చర్యలు అమామవీయమన్నారు. సంక్షేమ పథకాల అమలులో మంచి పేరు తెచ్చుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇలాంటి పరిణామాలు పేదలపై యుద్ధం ప్రకటించినట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఈ చర్యలు మానుకోవాలని సాబీర్ పాషా అభ్యర్థించారు. అనంతరం సమస్యల వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ఈ ఆందోళనలో సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, రేసు ఎల్లయ్య, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, ఎస్ డి. సలీం, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఎండి. యూసుఫ్, పేరాల శ్రీనివాస్, అనంతనేని సురేష్, జి. రామకృష్ణ, నాగేశ్వరరావు, ఎస్. ధర్మ, విజయ్, కే. హన్మంతరావు, బి. కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటీసీ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. సోమవారం ఆయన మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల, ఏటీసీ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ భవన సముదాయా న్ని పరిశీలించారు. ఐటిఐలను ఆధునీకరించే క్రమంలో ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో శిక్షణ పొందిన విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువ లభిస్తాయన్నారు. శిక్షణ కాలంలో కష్టపడి చదివి సంపూర్ణ నైపుణ్యాన్ని పొందాలని సూచించారు. వారికి కావలసిన పుస్తకాలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఇక్కడ విద్యార్థులకు కావలసిన పరికరాలు సౌకర్యాల కల్పనకు నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో 11వ ఎన్సి సి క్యాంపును సందర్శించారు. ఈ క్యాంపు 17 వరకు నిర్వహించడం జరుగుతుం దన్నారు. 700 మందితో ఈ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఐటిఐ సూపరింటెంట్ జ్యోతిరాణి, ఏటీవోలు జీ.వీ కృష్ణారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ఖరారుపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం రెండవ సాధారణ ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాల కోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సోమవారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో ఈ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఎన్నికల నిర్వహణ కోసం తయారుచేసిన ఓటర్ల, పోలింగ్ స్టేషన్ల జాబితాను నాయకులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 471 పంచాయతీలలో మొత్తం 6,69,048 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 3,25,045, మహిళలు 3,43,979 మంది తోపాటు 24 మంది ఇతరులు ఉన్నారని కలెక్టర్ వివరించారు. 4168 వార్డులకు గాను 4242 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుంటు న్నట్లు చెప్పారు. మరో అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ జెడ్పీ సీఈవో చంద్రశేఖర్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ నుంచి బాల ప్రసాద్, బిఆర్ ఎస్ నుంచి అనుదీప్, సిపిఐ, సిపిఎం నుంచి ఎస్. శ్రీనివాస్, సత్యనారాయణ, బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీల నుంచి నోముల రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

విశాలాంధ్ర - పినపాక : పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పినపాక మండలంలో ఆయన పర్యటించారు. పర్యటనలో బాగంగా జానంపేట అభయ ఆంజనేయ ఆలయం దగ్గర నుండి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని బైకులతో ర్యాలీ చేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అమరారం నుండి కిష్టాపురం వరకు రూ. 80 లక్షల అంచనాతొ వ్యయంతో నిర్మించానున్న బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ మారుమూల గ్రామాలైనా అమరారం, కిష్టాపురం గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక ప్రజల ఇబ్బందులను గుర్తించి బిటిరోడ్డు నిర్మిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదోడి అభివృద్ధికి దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. తహసిల్దార్ గొంది గోపాలకృష్ణ, ఎంపీడీవో సునీల్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం, నాయకులు పేరం వెంకటేశ్వర్లు, కంది సుబ్బారెడ్డి, పాటి బండ్ల సత్యనారాయణ, ఉడుముల లక్ష్మారెడ్డి, కొర్స ఆనంద్, ఈసం భవతి, బందారు సాంబ, గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ అధ్యక్షులు మనోజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవి ఎయిడ్స్‌పై కళాజాత

విశాలాంధ్ర-కొత్తగూడెం అర్బన్: జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యధికారి డాక్టర్ జయలక్ష్మి సూచనల మేరకు హెచ్ఐవి ఎయిడ్స్ నివారణపై కళాజాత నిర్వహించారు. సోమవారం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పుల్లారెడ్డి జండా ఊపి పల్లె సుద్దుల ఈ ఎయిడ్స్ కళాజాతను ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవి సోకినవారిపట్ల వివక్షత చూపించకూడదని స్పష్టం చేశారు. హెచ్ఐవి సోకిన వారు క్రమం తప్పకుండా ఏఆర్టి మందులను వాడాలని సూచించారు. హెచ్ఐవి ఎలా వస్తుంది... తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలూరి రాము బృందం కళారూపాల ద్వారా ఆకట్టుకునేలా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సత్య కుమార్, సెక్యూర్ సంస్థ బాధ్యులు రాజేంద్ర ప్రసాద్, కావేరి, కళా బృందం సభ్యులు గురవయ్య, రాంబాబు, సత్యనారాయణ, గంటనాగలక్ష్మి పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ, షా వెన్నులో వణుకు

బీజేపీలో అత్యంత శక్తిమంతులు అనుకునే ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెన్నులో వణుకు ప్రారంభం అయినట్టు కనిపిస్తోంది. ఇది కేవలం ఉపరాష్ట్రపతి ఎన్నికలో క్రాస్ ఓటింగ్ జరగవచ్చునన్న భయంతో మాత్రమే కాదు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో అనుసరించవలసిన విధానాన్ని చర్చించే సమావేశంలో ప్రధానమంత్రి మోదీ ఆఖరి వరసలో ఎందుకు కూర్చున్నట్టు? నాయకుడు ముందుండి నడిపించాలికదా! బీహార్‌లో ప్రత్యేక నిశిత ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టు అంతిమ తీర్పు రాకపోయినా ఎన్నికల కమిషన్ మెడలు వంచడానికి న్యాయమూర్తులు సూర్యకాంత్, జోయ్ మాల్యా వెనకాడడం లేదు. మొదట వారు ఆధార్ కార్డును కూడా ఒక ప్రమాణ పత్రంగా అంగీకరించాలని సూచించారు. చివరకు సోమవారం నాటి విచారణలో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది విషయంలోనే కాక ఇతరుల విషయంలోనూ ఆధార్ కార్డును ప్రామాణికంగా పరిగణించాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు నకిలీవి అయి ఉండొచ్చునన్న ప్రభుత్వ పక్ష న్యాయవాది చేసిన వాదనలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులిద్దరూ నిర్ద్వంద్వంగా నిరాకరించారు. కడకు ఆధార్ కార్డును ప్రామాణికంగా స్వీకరించాలని ఆదేశించవలసి వచ్చింది. ఇది ఎన్నికల కమిషన్ ఆట కట్టించడానికి జారీ చేసిన ఆదేశమే అనుకోవాలి. రాహుల్ గాంధీ సాక్ష్యాలతో సహా ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో నిరూపించిన తరవాత మోదీ, షా జంట ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఎన్నికల కమిషన్ దీని నుంచి గుణపాఠం నేర్చుకోవడానికి ఇప్పటికీ సిద్ధంగా లేదనేది నిజమే అయినా ఇది రాజకీయ సంచలనం సృష్టించింది. ప్రభుత్వ అవకతవకలను ఎత్తి చూపడంలో ప్రతిపక్ష పార్టీలన్నీ చాలా పట్టుదలతో వ్యవహరిస్తున్నాయి. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ రాహుల్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు సంధిస్తూనే ఉన్నారు. దీనితో మోదీ, షా ద్వయానికి ఊపిరాడుతున్నట్టు లేదు. ఈ దాడిని ఎదుర్కోవడానికి మోదీ, షా తొండాట మొదలు పెట్టారు. కొన్ని విదేశీ శక్తులు మన దేశాన్ని బలహీనం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయన్న అర్థరహిత ఆరోపణలకు దిగారు. రాహుల్ గాంధీ ఈ శక్తులతో కుమ్మక్కయ్యారన్న వితండ వాదానికి దిగారు. విదేశీ శక్తులు అంత పనిచేస్తూ ఉంటే ప్రభుత్వం ఏం చేస్తున్నట్టో! ఆ శక్తులను అడ్డుకోవడానికి చేసింది మాత్రం శూన్యం. విదేశీ శక్తులు మన దేశాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేస్తూ ఉంటే అమిత్ షా ఎందుకు మిన్నకుండి పోయినట్టు. ఈ విషయంలో ఆయన క్రియాశీలంగా చేసిన పని ఏదీ కనిపించడం లేదు. విదేశాంగ మంత్రి జై శంకర్ మాట ఈ మధ్యకాలంలో వినిపించి చాలా కాలం అయింది. ఎక్కడ ఎన్నికలు ఎదురైనా మోదీ, షా ముక్త కంఠంతో ఆయా రాష్ట్రాలలో చొరబాటుదార్లున్నారన్న వాదన లేవదీస్తారు. విదేశీ చొరబాట్లను నిరోధించవలసిన బాధ్యతను మాత్రం విస్మరిస్తారు. దిల్లీ, జార్ఖండ్ ఎన్నికలు జరగాల్సిన సమయంలో ఈ చొరబాటుదార్ల గురించి కేంద్ర ప్రభుత్వ పెద్దలు నానా గోల చేశారు. ఇప్పుడు ఎన్నికల మొగదలలో ఉన్న బీహార్‌లోనూ అదే పని చేస్తున్నారు. ఒక వేళ నిజంగానే వివిధ రాష్ట్రాలలో విదేశీయులు చొరబడ్డారనుకున్నా వారిని నిరోధించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే కదా! వస్తు సేవల పన్ను విధానంలో లోపాలు ఉన్నట్టు బీహార్ ఎన్నికలు జరగవలసిన సమయంలోనే మోదీ ప్రభుత్వానికి ఎందుకు గుర్తొచ్చినట్టు? ఇంత కాలం నుంచి ప్రతిపక్షాలు చేసిన సూచనలను సంస్కరణల పేరిట ప్రభుత్వం ఎందుకు ముందుకు తేవలసి వచ్చిందన్న ప్రశ్నకు మోదీ కానీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కానీ ఇప్పటివరకూ సమాధానం చెప్పనే లేదు. మోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సన్నిహిత మిత్రుడని బాకాలూదారు. ఇప్పుడు ట్రంప్ సుంకాల మీద సుంకాలు విధిస్తూ ఉంటే మోదీ నోరు పెకలడమే లేదు. ట్రంప్ అనేక రకాలుగా మోదీనే కాదు భారత్‌నే అవమానిస్తున్నా మోదీ దిక్కు తోచని స్థితిలో పడిపోయారు.

ట్రంప్ దెబ్బకు తాళ లేక మోదీ చైనా వెళ్లొచ్చారు. అక్కడ చైనా మీద కన్నెర్ర చేయలేదు సరికదా చిరునవ్వులు చిందిస్తూ ఉండిపోయారు. కొన్ని సందర్భాలలో అర్థరహితంగా నవ్వడం ద్వారా తన లోపాన్ని కప్పిపుచ్చుకునే విఫల యత్నంచేశారు. చైనా చేస్తున్న ఒక్క ఆగడాన్నీ ప్రశ్నించలేదు. మన మార్కెట్లను చైనా సంపూర్ణంగా ఆక్రమిస్తూ ఉంటే మోదీ స్వదేశీ మంత్రం జపిస్తున్నారు. మేక్ ఇన్ ఇండియా ఎందుకు విఫలమైందో మాత్రం చెప్పరు. చైనా వెళ్లి మనకు ప్రయోజనం కలిగించే ఒక్క అంశమైనా సాధించుకొచ్చారన్న దాఖలాలూ లేవు. రెండేళ్లుగా మణిపూర్ తగలబడి పోతూ ఉంటే ఆ రాష్ట్రాన్ని మన దేశంలో భాగంగానే గుర్తించని మోదీ వచ్చే 13వ తేదీన మణిపూర్ వెళ్తారట. దానికి తగిన ప్రాతిపదిక ఏర్పాటు చేయడం కోసం కుకీ–జోతో ఒప్పందం చేసుకున్నామంటున్నారు. మణిపూర్ జగడంలో మరో పక్షమైన మెయితీలు ఈ ఒప్పందాన్ని సమ్మతించడం లేదు. రెండేళ్ల నుంచి మోదీ మణిపూర్ ప్రస్తావనే తీసుకు రాలేదు. ఒకసారి తీసుకొచ్చినా చాలా పొదుపుగా మాట్లాడారు తప్పితే అసలు సమస్యను పట్టించుకోనేలేదు. అప్పుడు మణిపూర్ ముఖ్యమంత్రి బీరేంద్ర సింగ్‌ను బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలన్న ప్రతిపక్షాల మాటను చెవికెక్కించుకోనేలేదు. చివరకు బీరేంద్ర సింగ్‌తో రాజీనామా చేయించి రాష్ట్రపతి పాలన విధించక తప్పలేదు. అయినా మణిపూర్ చల్లారనే లేదు. బీజేపీ ఎంపీల మధ్య కూడా సఖ్యత లేదని దిల్లీలోని కానిస్ట్యూషన్ క్లబ్ అధ్యక్ష పదవి ఎన్నికలు నిరూపించాయి. ప్రభుత్వ పక్షం సహకారం లేకపోయినా మరో బీజేపీ ఎంపీ సంజీవ్ బాలియాన్‌ను ఓడించి బీజేపీ నాయకుడు రాజీవ్ ప్రతాప్ రూఢీ విజయం సాధించారు. ఇదీ మోదీ, షా ద్వయం ఓటమి కిందే లెక్క గెలిచిన రాజీవ్ ప్రతాప్ రూఢీ మరో బీజేపీ నాయకుడు నిశికాంత్ దుబేపై ఘోరమైన విమర్శలు చేయడం బీజేపీలో భిన్న రాగాలు వినిపిస్తున్నాయనడానికి సంకేతం. పంజాబ్‌లో వరదలు వస్తే మోదీకి ఆ ప్రాంతంలో పర్యటించాలన్న ధ్యాసే లేదు. పంజాబ్ ప్రజలు అంతా ఏకమై బాధితులను ఆదుకునే ప్రయత్నం చేస్తున్నారు. సిక్కు సంప్రదాయమైన సేవ, లంగర్ లాంటివి మాత్రమే బాధితులకు ఆసరా అయినాయి. వరద బీభత్సం నుంచి పంజాబ్‌ను ఆదుకున్నది అక్కడి ప్రజల మానవతావాదం తప్ప మోదీ ప్రభుత్వం కాదు. ఆ రాష్ట్ర ప్రజలు బాధితులను ఆదుకొని బాధలు కొంతమేర తగ్గించాక మోదీ నెమ్మదిగా పంజాబ్‌లో పర్యటించడం ఏమిటి? ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే ఓట్లు చెదిరిపోకుండా చూడడానికి ఎంపీలను సంప్రదించే ప్రయత్న చేస్తూ ఉంటే కొందరు బీజేపీ ఎంపీలు అందుబాటులోకే రావడం లేదు. ప్రస్తుత పరిస్థితిపై ఎంత కలత చెందకపోతే ఐక్య రాజ్య సమితి సర్వసభ్య సమావేశానికి వెళ్లే ప్రతిపాదనను మోదీ ఎందుకు రద్దు చేసుకుంటారు? రాహుల్ విదేశీ పర్యటన మీద మాత్రం బీజేపీ ఐటీ విభాగం అవాకులు చెవాకులు పేలుతూనే ఉంటుంది. ఇదంతా మోదీని ఆవహించిన అస్థిరతకే నిదర్శనం.

దోస్త్ మేరా దోస్త్

చింతపట్ల సుదర్శన్

'ఎవరికెవరు ఈ లోకంలో ఎవరికి ఎరుక?' అని పాడుతూ అరుగు ఎక్కింది డాంకీ. అప్పటికే అరుగు మీద ఉన్న డాగీ ఆశ్చర్యపడింది. ఫర్వాలేదే నీకూ స్వర మాధుర్యం అబ్బినట్టుంది. గార్దభ స్వరం అని వెక్కిరిస్తారు కానీ ఇప్పుడు నువ్వు అందుకున్న పాట గుండె లోతుల్లోంచి వచ్చిందేమో అందుకేనేమో బాగా వినిపించింది అంది డాగీ.

మనసులోని బాధ మాటల్లో చెప్పినా పాటల్లో పాడినా మనసున్న వాడికెవడికైనా స్పందన కలుగుతుందిలే అంది డాంకీ తన చోటులో కూచుంటూ. ఏమైంది డాంకీ? పాటలోనే కాదు నీ ముఖంలోనూ ఏదో బాధ కొట్టొచ్చినట్టు కనబడుతున్నది అంది డాగీ. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందంటారు. నాది మరీ బానపొట్ట పైగా కాళ్లకి గోళ్లు

రంగస్థలం

లేవు ఏం చెప్పమన్నావు డాగీ ఈ లోకంలో కుళ్లూ కుతంత్రం, చెత్తాచెదారం తప్ప ఏమీ లేదు. అసలీ లోకమే ఓ పెద్ద 'డస్ట్‌బిన్' అనిపిస్తున్నది. అదేంటి డాంకీ అంత మాటనేశావు ఈ లోకాన్ని ఏలుతున్న మనుషులు వింటే తట్టుకోలేరు అసలు ఆ స్థాయి దాకా వెళ్లిపోయావేం? అంది డాగీ. లేకపోతే ఏమనాలి? ఈ లోకంలో ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్లు ఉండాలా వద్దా?

ప్రజాస్వామ్యం, సమాన హక్కూ గాడిద గుడ్డూ అంటారు కదా. అవును నా ఇష్టం. నేను గాడిదనే. అయినప్పటికీ ఈ పాత కొంపలో ఈ పెచ్చులూడిన, కూలిన కొంపలో, ఓ కుక్కతో కల్సి జీవిస్తున్నాను. దీనివల్ల ఆ అడ్డగాడిద కేమి నష్టం? ఏమి కడుపు నొప్పి? చెప్పు అంది డాగీ చిరాగ్గా. ఏ అడ్డగాడిద? ఏమంది? అసలేమయింది?? నేనో గాడిదను. నా జాతికే చెందిన మరో గాడిదకు నేను నీతో ఉండటం ఇష్టం లేదట. దోస్తీకి జాతితో సంబంధమేమిటో నాకు అర్థం కాలేదు. గాడిదలు గాడిదల్తోటే, కుక్కలు కుక్కల్తోటే, మనుషులు మనుషులతోటే స్నేహం చెయ్యాలంది. ఒక గాడిద, ఓ కుక్క, ఓ అబ్బాయీ స్నేహంగా ఉండటం ప్రకృతి విరుద్ధమట. ఎవరు ఎవరితో స్నేహం చేసినా 'స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం' కదా అంది డాగీ ఆవేశపడుతూ.

సరిగ్గా ఈ టైముకి అరుగు ఎక్కాడు అబ్బాయి, పాడుతా తీయగానా? 'ఇండియన్ ఐడల్' ప్రోగ్రాము జరుగుతున్నది అంటూ.

చూడు 'బ్రో' మన స్నేహం తప్పట. అలాగని ఇవ్వాళ ఓ పొట్టితోక గాడిద నన్ను బజార్లో పట్టుకుని, నోటి దూల తీర్చుకుంది. నువ్వు చెప్పు స్నేహానికి జాతీ, మతమూ, కులమూ వర్గమూ ఉంటాయా? ఎవరా మాటన్నది తోలు వలిచెయ్యాలి అయినా గాడిద తోలు చెప్పులు కుట్టడానికి పనికి వచ్చునో లేదో దాని మానాన అది పోతుందిలే. చింతపట్ల సుదర్శన్ అనే పేరున్న ఓ కాలమిస్టు కారణంగా కలిసిన మనం, ఎప్పటికీ ఇలాగే కలిసుందాం మన స్నేహం కల్మషం లేనిది, స్వంత లాభం కోసం కానిది అన్నాడబ్బాయి.

స్వంత లాభం ఏమిటి 'బ్రో' స్నేహానికి దానికి సంబంధం ఉందంటావా? అంది డాగీ. నువ్వో అమాయకపు డాగీవి. మనుషుల్లో స్నేహమూ, చుట్టరికమూ, బంధాలు అనుబంధాలు అన్నీ అవసరాల కోసమే. ాశ్రీశ్రీ ప్రబఝిఖ తీవశ్రీఫ్ఆశీఅం ఖతీవ టఱఖఅఎఱఖశ్రీ తీవశ్రీఫ్ఆశీఅం అనగా అన్ని మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలే అన్నాడు కారల్‌మార్క్స్. మనకిది బాగా అర్థం కావాలంటే రాజకీయ నాయకులనడగాలి. కొత్త పార్టీలు ఎందుకు పుడతాయో, పార్టీల నుంచి పార్టీలకు మనుషులు ఎందుకు కప్పల్లా గెంతుతారో, అవసరం ఉన్నప్పుడు తల మీద పెట్టుకుని అవసరం తీరితే ఎలా ఎత్తి కుదేస్తారో చూస్తున్నాం కదా. అవసరానికి దోస్తీ అనేది ప్రాంతీయ, జాతీయ స్థాయి అంశమే కాదు అంతర్జాతీయ స్థాయి అంశం కూడా అన్నాడు అబ్బాయి.

అవును 'బ్రో' మొన్నటి దాకా ఒకాయన దోస్తీకి నజరానాగా నోబెల్ కోసం తహతహలాడాడు. అన్ని యుద్ధాలూ అరచేతిని అడ్డుపెట్టి ఆపుతానన్నాడు. అడిగిందివ్వకపోతే, కోరింది దక్కకపోతే, గ్లోబ్ కే కొరివి పెట్టడానికి తయారయ్యేడు. పిచ్చోడిలా టారిఫ్‌ల రాయి చేత పట్టుకున్నాడు అంది డాంకీ.

తను కాదన్నవాడు, తన శత్రువుకి మిత్రుడైనప్పుడు కానీ తెల్సిరాదు, స్నేహమంటే ఏమిటో? చేతులు కాలాక కానీ ఆకులు పట్టుకోని వాళ్లుంటారు లోకంలో మరి అంది డాగీ.

అవసరానికో అబద్ధం ఆడేవాళ్లు, నిమిషానికో ఆలోచనచేసే చపలచిత్తులూ, తెలివి ఎక్కువయినందు వల్ల మూర్ఖత్వం పెట్రేగే వాళ్లూ, అందితే గడ్డం అందకపోతే కాళ్లూ పట్టుకునే వాళ్లు ఈ మనుషులు. అయితే నువ్వూ, నేనూ, అబ్బాయీ మాత్రం అందుకు భిన్నం అంది డాంకీ.

ఇప్పుడెవరయినా మైక్‌లో 'దోస్త్ మేరా దోస్త్' అనే పాట వినిపిస్తే బాగుణ్ణు డాన్స్ చేసేద్దును అంది డాగీ.

కళ ఆయుధంగా చైతన్యం సుంకర సొంతం

చంద్ర నాయక్
ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాకవి సుంకర సత్యనారాయణ కృష్ణాజిల్లా విజయవాడ సమీపాన గల ఈడుపుగల్లు గ్రామంలో 1909 మార్చి 23వ తేదీన రామచంద్రుడు, కోటమ్మల ప్రథమ సంతానంగా జన్మించారు. ఆయనకు ముగ్గురు సోదరులు, ఒక సోదరి. సుంకర గురించి చెప్పే ముందు వారి తండ్రి రామచంద్రుడు గురించి నాలుగు మాటలు చెప్పాలి. తండ్రి రామచంద్రుడు పేదలను ఎంతో ప్రేమించే వ్యక్తి. వారి కోసం 60 ఎకరాల ఆస్తిని పోగొట్టుకొని చివరకు ఉన్న ఇంటిని కూడా అమ్ముకున్న త్యాగశీలి. సహజంగా గ్రామంలో ఉండే అస్పృశ్యత అనేది ఎంత అనాగరికపు చర్యో గ్రహించి ప్రథమంగా అన్ని కులాల వారికి గ్రామాల మొత్తంగా సహపంక్తి భోజనాలు పెట్టి కడవరకు వారిలో ఒకరుగా మమేకమైన అరుదైన వ్యక్తి. వారి గుణగణాలే వారి బిడ్డలు సుంకర సత్యనారాయణ, వీరభద్రరావు పుణికిపుచ్చుకున్నారు. సుంకర 12 సంవత్సరాల వయస్సులో కాకినాడ కాంగ్రెస్ మహాసభకు వెళ్లేందుకు తండ్రిని కోరగా ఆయన మరో మనిషిని తోడిచ్చి పంపి కొడుకు రాజకీయ జీవితానికి అంకురార్పణం చేశారు. కాంగ్రెస్ మహాసభ నుంచి తిరిగి వచ్చిన సుంకర హైస్కూల్లో ఆంగ్ల భాషను అభ్యసించవలసి వచ్చినందుకు ఆ భాషను వ్యతిరేకించి చదువుకు స్వస్తి పలికారు. తండ్రి తీసుకువచ్చిన ఒక హిందీ ఉపాధ్యాయుడు వద్ద హిందీ భాషను కొంతవరకు నేర్చుకున్నారు. తన తమ్ముళ్లు మిగతా పిల్లలతో పాటు స్వతంత్ర గీతాలు ఆలాపిస్తూ ఊరంతా తిరిగేవారు. బుర్రకథ, జంగంకథ పట్ల ఎక్కువ మక్కువ చూపేవారు. రాత్రిపూట ఆ కథలు విని పగలు పిల్లలతో చేరి ఆ కథలు ఆలపించేవారు. ఆ కథల పట్ల కొడుకుకున్న ఆసక్తి గమనించి వారి తండ్రి, కొడుకు కోరినప్పుడు అవి వినేందుకు ఎక్కడికైనా సరే పంపేవారు. ఆ అనురక్తే సుంకర భావి జీవితంలో సామాజిక స్పృహ కలిగిన ఎన్నో మంచి బుర్రకథలు రాసి గొప్ప రచయిత అయ్యేందుకు పునాదిగా మారింది.

1930లో గాంధీ ఉప్పు సత్యాగ్రహం తలపెట్టి ఈడుపుగల్లు మీదుగా వెళ్లేటప్పుడు ఆ ఊరివారు, సుంకర రామచంద్రుడు ఆధ్వర్యంలో గాంధీని ఆహ్వానించి విరాళాలు సేకరించి ఇచ్చారు. ఇంటికొక్కరుగా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనేందుకు తన తండ్రి వెళ్లదలచినపుడు "కాదు నేను వెళతాను" అని సుంకర ముందుకు వచ్చారు. అప్పుడు ఆయన తండ్రి 'చిన్నవాడివి పోలీసుల లాఠీచార్జీలకు భయపడి వెనుదిరిగి వస్తే నిన్ను గుమ్మం మీద పెట్టి నరుకుతా' నని ఖండితంగా చెప్పి పంపారు. సుంకర ఆ సందర్భంలో బాగా లాఠీ చార్జీకి గురయ్యారు. పార్టీ కార్యకలాపాలలో తీవ్రంగా కృషిచేసి పోలీసు రికార్డులోకెక్కి మూడేళ్ల జైలు శిక్ష అనుభవించారు. జైలు నుంచి విడుదలయ్యాక సుంకర తిరిగి తన కార్యకలాపాలు మామూలుగానే కొనసాగిస్తూ తమ్ముడు వీరభద్రరావుతో కలిసి ఈడుపుగల్లులో అందరినీ కూడగట్టి చిన్న లైబ్రరీని ఏర్పాటు చేశారు. మరోసారి గాంధీ ఆంధ్రదేశం పర్యటించడానికి వచ్చినప్పుడు ఆ ఊరి ప్రజలు మరల ఆయనను ఆహ్వానించారు. అప్పుడు వారంతా ఎవరికి తోచిన రీతిలో వారు విరాళాలు అందజేశారు. తన వంటిమీద నగలను, చెవులకున్న జూకాలను లాగి రక్తసిక్తమైన వాటిని గాంధీకి అందించి తన జాతీయాభిమానాన్ని రుజువు చేసుకున్న నాటి ఆరేళ్ల చిన్నారి, సుంకర అనుంగు సోదరి అన్నే అనసూయ. వివాహానంతరం సుంకర తిరువూరు తాలూకా కాకర్ల గ్రామంలో వ్యవసాయం ప్రారంభించారు. వ్యవసాయం చేయడంలోనూ మంచి దిట్ట. పొగరుబోతు గిత్తలను సైతం అదుపులో పెట్టడంలో గట్టివాడు సుంకర. మంచి గిత్తలపై ఆయనకున్న అభిరుచే "నమ్మిన బంటు" సినిమాలో ఎద్దులకు తర్ఫీదు ఇచ్చే అవకాశాన్నిచ్చింది.

పార్టీ ఆదేశానుసారం సుంకర ఇటు ఆంధ్రకు, అటు తెలంగాణకు సరిహద్దు గ్రామమైన కొణత మాత్మకూరులో నివాసం ఏర్పరచుకున్నారు. గ్రామంలో సుంకర హిందీ ఉపాధ్యాయునిగా జీవితం కొనసాగిస్తూ వెనుకబడివున్న ఆ గ్రామం నుంచి మంచి కార్యకర్తలను, విద్యార్థులను తయారు చేయడంలో విశేష కృషి చేశారు. తర్వాత సుంకర విజయవాడలోనే ఉండి ప్రజానాట్యమండలిలో బాధ్యతలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. జిల్లా బాధ్యులుగా సుంకరను, రాష్ట్ర



బాధ్యులుగా గరికపాటి రాజారావును నియమించారు. చదలవాడ కుటుంబరావు, లక్ష్మీ పెరుమాళ్ళు, కేశవ నారాయణ, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, మాచినేని వెంకటేశ్వరరావు, కోసూరి పున్నయ్య, రామకోటి, పురుషోత్తం, నాజర్, వల్లం నరసింహారావు, కొండేపూడి రాధా, వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, కోడూరి అచ్చయ్య, పొట్లూరి సుబ్బారావు మొదలైన వారితో సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వడానికి పూనుకున్నారు. అప్పటికే రాజకీయ చరిత్ర కలిగి హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నందిగామ దగ్గరలోని వీరులపాడు వాస్తవ్యులు వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర మంచి స్నేహితులు. వారిరువురు కలిసి ఆంధ్ర రాష్ట్రాన్ని ఊపివేసిన తెలంగాణ పోరాటాన్ని ప్రతిబింబించిన 'మా భూమి', "ముందడుగు", "అపనింద", వంటి మహోన్నతమైన నాటకాలను, 'ఐక్యత' అనే నాటికను మనకందించారు. వందల నాటక సమాజాలు వాటిని అనేకసార్లు ప్రదర్శించాయి. ఒకే రాత్రి ఒకే నాటకాన్ని మరోసారి ప్రదర్శించిన ఘనత వీరికే దక్కింది. విశ్వనాథ సత్యనారాయణ, బెజవాడ గోపాలరెడ్డి, కె.ఎ. అబ్బాస్ వంటి మరెందరో ప్రముఖులు వాటిని చూసి, రచయితలను ఎంతగానో ప్రశంసించారు. ఒకసారి రాహుల్ సాంకృత్యాయన్ విజయవాడకు వచ్చినప్పుడు సుంకరను గైడుగా ఇచ్చారు. ఆ సమయంలో సుంకర ఆయన రచనల అనువాదానికి అనుమతి కోరగా 'ఓల్గా నుండి గంగ' పుస్తకం అనువాదానికి అనుమతినిచ్చారు రాహుల్‌జీ. దానిని సుంకర అనువదించారు. "గెరిల్లా" అనే శతకాన్ని రాశారు. కానీ అవి రెండు పోలీసుల దాడులలో కాలిబూడిద అయ్యాయి. ఓగిరాలలో యూత్ ఫెడరేషన్ కాన్ఫరెన్స్ జరిగింది. రష్యా నుండి, మరెన్నో ప్రాంతాల నుండి హాజరైన డెలిగేట్స్ సభలో అప్పటికప్పుడు సుంకర రాసి ఇచ్చిన "ఓడ ఎక్కి నీ లండన్ పట్నం నేడే పో పోరా" అనే గేయాన్ని ప్రజానాట్యమండలి కళాకారులు పాడగా ఆ సభాస్థలి కరతాళ ధ్వనులతో మారు మోగిపోయింది. సుంకర అనేక గేయాలను ఆయా సందర్భాలలో రాయగా ఆనాడు ఆ గేయాలని "ప్రజాశక్తి" పత్రిక ద్వారా ఆంధ్ర ప్రజానీకానికి అందించారు. తరువాత "జయగీతి" పేరిట గేయ సంపుటిగా ఆంధ్ర ప్రజానీకానికి అందించారు.

> ఊరూరా తిరుగుతూ సోవియట్ భూమి చందాదార్లుగా చేర్పించుతూ మరో వైపు సమాజంలో లంచగొండితనానికి అద్దంపట్టే 'నూరుకాకుల్లో' అనే నాటకాన్నీ రచించారు. దానికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. సుంకర 1963-64లో సోవియట్ పర్యటనకు వెళ్లివచ్చారు.

1949వ సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో సుంకర, వారి సోదరులు ఎక్కడెక్కడో తలదాచుకోవలసిన అగత్యం ఏర్పడింది. అప్పుడు సుంకర తన భార్య బిడ్డలతో రాయలసీమలో గుంతకల్లు దగ్గరున్న కమ్మకొట్టాల గ్రామంలో హిందీ అయ్యవారిగా రహస్య జీవితం గడిపారు. సోదరి అనసూయ సేలం జైలు డిటెన్యూగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఎత్తివేసిన తర్వాత సుంకర మద్రాసులోని మిత్రుల పిలుపు మేరకు మద్రాసు నగరం చేరారు. అక్కడ 'పల్లెటూరు', 'పుట్టిల్లు', 'కన్నతల్లి', 'జ్యోతి' సినిమాలకు కథ–మాటలు రాసారు 'ఏది నిజం' సినిమాకి రచన చేశారు. దానికి రాష్ట్రపతి అవార్డు వచ్చింది. 1952వ సంవత్సరంలో జనరల్ ఎన్నికల సందర్భంగా సుంకర విజయవాడలో సాంస్కృతిక దళాలను నిర్వహించేందుకు వచ్చారు. తర్వాత సుంకర విజయవాడ నివాసం మార్చారు. విజయవాడలో ఉంటూ 'భూమికోసం', 'కోతలరాయుడు' వంటి నాటకాలను రాశారు. తన నాటకాల్లో తనూ పాత్ర పోషణ చేశారు. 'భూమి కోసం' నాటకాన్ని గుంటూరు జిల్లా కారంచేడుకు చెందిన యార్లగడ్డ వెంకన్న చౌదరి సినిమా తీసేందుకు పూనుకున్నారు. ఆ సందర్భంగా 1957లో సుంకర మరల తన మకాం మద్రాసుకు మార్చవలసి వచ్చింది. 'నమ్మినబంటు' సినిమా కోసమే మద్రాసు వెళ్లారు. సినిమా రంగంలో ఉండగా సుంకర తీవ్ర మానసిక సంఘర్షణకి గురయ్యారు. వ్యాపార సరళిలో సాగిపోయే ఈ సినిమా మాయాజగత్తులో ఆయన తను నమ్మిన ఆశయాలనూ, ఆదర్శాలనూ, అభిమానాన్ని పణంగా పెట్టలేక పోయారు. దర్శక, నిర్మాతకు తలొగ్గి ఉంటే ఆయన సినీ ప్రపంచంలో ఆర్థికంగా ఎత్తుకు ఎదిగేవారే కానీ అలా చేయలేదు.

1960వ సంవత్సరంలో ఆర్థికరమైన ఇబ్బందులతో సుంకర ఆరోగ్యం బాగా దెబ్బతింది. మిత్రులు గరికిపాటి రాజారావు సలహా మేరకు పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు నుంచి ఆయన బావమరిది అన్నే వెంకటేశ్వరరావు, శ్రీమతి అన్నే అనసూయ వచ్చి సుంకరను విశ్రాంతి కోసం తమ ఇంటికి తీసుకు వెళ్లారు. అక్కడ డాక్టర్ తిలక్ పర్యవేక్షణలో సుంకర ఆరోగ్యపరంగా పుంజుకున్నారు. కానీ సుంకర భార్య 1960 సెప్టెంబరు 11న అకస్మాత్తుగా కన్నుమూశారు.

'సోవియట్ భూమి' ఏజన్సీ కూడా తీసుకున్నారు. అయినా ఆయన తన సాహిత్య రంగానికి దూరం కాలేదు. ఒకవైపు ఊరూరా తిరుగుతూ సోవియట్ భూమి చందాదార్లుగా చేర్పించుతూ మరో వైపు సమాజంలో లంచగొండితనానికి అద్దంపట్టే 'నూరుకాకుల్లో' అనే నాటకాన్నీ రచించారు. దానికి సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఇంతేగాక సుంకర అప్పటికే 'వీరకుంకుమ', 'ఆగస్టు 15', 'కనువిప్పు', 'శ్మశాన శాంతి', 'జీతగాడు', 'ప్రతిఫలం', 'భూదేవి', 'గిత్తలబేరం', 'దొరికితే పట్టుకున్నాం', 'రాబంధులు', 'ఆంగేజా – కాంగేజా', 'శికారులు', 'పిచ్చివాడు', 'పీటంమీద పెళ్లి', 'దిద్దుబాటు' 'రచ్చబండ', 'ప్రతిజ్ఞ' వంటి నాటికలను రచించారు. సుంకర 1963-64లో సోవియట్ పర్యటనకు వెళ్లివచ్చారు. అక్కడ చిన్న పిల్లల విద్యావిధానంపై ఒక వ్యాసాన్ని సోవియట్ భూమిలో ఆయన రాశారు. కమ్యూనిస్టు పార్టీ చీలిన సందర్భంలో సుంకర సీపీఐలోనే ఉండిపోయారు.

'మా భూమి' నాటకానికి రెండవ భాగం రాయాలనేది ఆయన చిరకాలవాంఛ. అందుకే ఆయన 'మా భూమి' నాటకానికి న్యాయం చేకూర్చటమే ధ్యేయంగా 'గెరిల్లా' నాటకాన్ని రచించారు. 'గెరిల్లా' అనేది నాటి పార్టీ అభిప్రాయాలకు భిన్నమైనప్పటికీ భూపోరాటంలో భూమికోసం ఆయన ఇచ్చిన తీర్పే గెరిల్లాగా రూపొందింది. ఆనాడూ, ఏనాడూ ఆయన తమ నమ్మిన ఆశయాన్ని వీడలేదు... తన కవితా సృష్టిని మరెవరికీ బానిస కానీయలేదు. తదుపరి మరల మద్రాసులో ఉంటూ డైరెక్టర్ కేవీ తిలక్ (అనుపమ పిక్చర్స్) నిర్మించిన 'భూమికోసం' సినిమా కథకు శ్రీశ్రీతో కలిసి మాటలు రాశారు. దానితో పాటు సినిమాలో నాయకుని తండ్రి పాత్రను పోషించారు. 'భూమికోసం' సినిమా విడుదల అనంతరం తిరిగి 'గెరిల్లా' నాటక ప్రదర్శనకు పూనుకున్నారు. స్నేహితుడు సుంకర చంద్రమౌళీశ్వరరావు సహకారంతో ధవళ సత్యం దర్శకత్వంలో 'గెరిల్లా' నాటక బృందాన్ని తయారు చేశారు. కష్టనష్టాలకు ఓర్చి విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో 1975 జూన్‌లో 'గెరిల్లా' నాటకం ప్రదర్శించారు. అదే రాత్రి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రవేశపెట్టడంతో అది అంతటితో ముగిసింది. ఆయన చివరి ఘడియలలో పేపరు చదివించుకుని వింటూ 'రత్నాల్లాంటి కుర్రాళ్లు అనవసరంగా ఎన్‌కౌంటర్లో బలైపోతున్నారు' అని ఆవేదన చెందారు. "సమస్యలు లేని జీవితం జీవితమే కాదు. సమస్యలు వస్తూ ఉండాలి. వాటిని పరిష్కరించుకుంటూ ఉండాలి. అదే జీవితమంటే, అని చెప్పి సుంకర మూడు రోజులపాటు మృత్యువుతో పోరాడి, చివరికి 1975 సెప్టెంబరు 9వ తేదీన కన్నుమూశారు. సుంకర సత్యనారాయణ గౌరవార్థం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సుంకర స్మారక బుర్రకథల పోటీ 1981లో నిర్వహించింది. ఇందులో అభ్యుదయ కవులుగా పేరుగాంచిన అదృష్ట దీపక్, కాగితాల రాజేశ్వరరావు సంయుక్తంగా రాసిన 'సమరశంఖం' బుర్రకథ బహుమతి పొందింది.

(9వ తేదీ మంగళవారం సుంకర సత్యనారాయణ 50వ వర్ధంతి సందర్భంగా)

ఉపరాష్ట్రపతి ఎన్నికలు – రాజ్యాంగ విలువలు



టి. లక్ష్మీనారాయణ

నూతన ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ మంగళవారం జరగనుంది. భారత రాజ్యాంగం పౌరులందరికీ శిరోధార్యం. రాజ్యాంగబద్ధ పదవుల్లో రెండవ స్థానం ఉపరాష్ట్రపతిదే. రాష్ట్రపతి తరువాతి స్థానంలో ఉపరాష్ట్రపతి ఉండడమే కాకుండా పెద్దల సభ అయిన రాజ్యసభాధ్యక్షునిగా కూడా అత్యంత కీలక పాత్ర పోషిస్తారు. ఈ బాధ్యత నిర్వహించే వారికి రాజనీతిజ్ఞానంతో పాటు నైతిక ఆధిపత్యం, రాజ్యాంగ స్ఫూర్తితో తటస్థతగా వ్యవహరించే వ్యక్తిత్వం ఉండాలి. రాజకీయ పార్టీల అనుబంధంలేని నేపథ్యం ఉన్నవారు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి స్థానాలను అలంకరిస్తే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా కర్తవ్య నిర్వహణ చేసే అవకాశం మెండుగా ఉంటుందన్న విశ్వాసం ప్రజలకు ఉన్నది. తాజా ఉదాహరణ ఆ పాఠాన్నే దేశ ప్రజలకు నేర్పింది. కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలకు తన వ్యవహారశైలి రుచించలేదన్న సంకేతం అందగానే, ఆరోగ్య సమస్యను ప్రస్తావిస్తూ జగదీప్ ధన్కర్ రాజీనామా చేయడం పర్యవసానంగా ఉపఎన్నిక జరుగుతున్నది. బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) ప్రతిపాదించిన సీపీ రాధాకృష్ణన్, ప్రతిపక్ష పార్టీలు ప్రతిపాదించిన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి మధ్య ముఖాముఖి పోటీ జరుగుతున్నది.

ఈ ఎన్నికల్లో రాజ్యసభ, లోక్‌సభ సభ్యులకు మాత్రమే ఓటు హక్కు ఉన్నది. కానీ, వారిని ఆకర్షించడానికి మాత్రమే ఎన్నికల ప్రచారం పరిమితం కాలేదు. అభ్యర్థులు, వారి మద్దతుదారులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఈ తేడా స్పష్టంగా కనపడింది. ఎన్డీఏ తన అభ్యర్థిగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూలాలున్న తమిళనాడుకు చెందిన, మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్నికల బరిలో నిలిపింది. దక్షిణాదిలో బలహీనంగా ఉన్న బీజేపీ తన బలాన్ని పెంచుకోవాలన్న అభిలాషతో రాధాకృష్ణన్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసుకున్నదనడంలో ఏమాత్రం అనుమానంలేదు. రాధాకృష్ణన్ ఎన్నికల ప్రచారం సాదసీదాగా చేశారు. పెద్దగా మాట్లాడినట్లు ప్రసారమాధ్యమాల్లో కూడా రాలేదు. కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అసంబద్ధమైన వివాదాస్పద వ్యాఖ్యలు ఎన్నికల ప్రచారాన్ని బాగా వేడెక్కించాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీలో ఉన్న జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి నేతృత్వం వహించిన సుప్రీంకోర్టు బెంచ్ 2011లో సల్వా జుడుం కేసులో ఇచ్చిన

తీర్పుపై వక్రభాష్యంతో అమిత్ షా వ్యక్తిగత ఆరోపణ చేయడంద్వారా ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియను ప్రభావితంచేసే అప్రజాస్వామిక చర్యకు పాల్పడ్డారు. జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి "నక్సలిజాన్ని ప్రోత్సహించారు" అన్న భావన ధ్వనించేలా దురుద్దేశంతో వ్యాఖ్య చేశారు. రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంకుచిత రాజకీయ, భావజాల రంగుపులిమారు. ఆ తీర్పు లేకపోతే 2020 నాటికే ఎర్రదళ సమస్య తీరిపోయేదని అమిత్ షా అన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును వ్యక్తిగత ఆరోపణ చేసే స్థాయికి దిగజార్చారు. అమిత్ షా వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. 18 మంది మాజీ సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు సంయుక్త ప్రకటన విడుదలచేసి, ఆ వ్యాఖ్యలు దురదృష్టకరమైనవిగా, తీర్పును తప్పుగా అర్థం చేసుకోవడంగా పేర్కొన్నారు. ఆ తీర్పులో ఎక్కడా నక్సలిజానికి మద్దతు ఇవ్వలేదని, చట్టబద్ధ పద్ధతులకు విరుద్ధంగా "ప్రైవేట్ మిలీషియా" విధానాన్ని ప్రభుత్వం అమలు చేయడాన్ని మాత్రమే తిరస్కరించిందని స్పష్టం చేశారు. ఇటువంటి రాజకీయ వక్రీకరణలు న్యాయవ్యవస్థ స్వతంత్రతపై ప్రతికూల ప్రభావాన్ని చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉపరాష్ట్రపతి పదవి రాజ్యాంగ పరిరక్షణ, సమాఖ్య వ్యవస్థ, పార్లమెంటరీ సంప్రదాయాలను కాపాడే కీలక స్థానమని అనేక మంది ప్రముఖులు కూడా గుర్తుచేస్తూ, అలాంటి పదవిని రాజకీయ కలహాలకు వేదికగా మార్చడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని, రాజ్యాంగ నైతికత దెబ్బతింటుందని హితవు పలికారు. ఈ ధోరణి స్థిరపడితే భవిష్యత్‌లో మరిన్ని రాజ్యాంగ పదవులు కూడా వ్యక్తిగత దూషణల బారినపడే అవకాశం ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఒక న్యాయకోవిదుడుగా హుందాగా, చురుకుగా దేశ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. భారత రాజ్యాంగం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా దేశం ముందు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా చర్చకు పెట్టారు. కానీ, ప్రత్యర్థి వైపు నుంచి స్పందన కరువైయ్యింది. అలా విభిన్న రాజకీయ దృక్పథాలు, తాత్విక చింతనల నేపథ్యంలో ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరగబోతున్నాయి. పార్టీల అనుబంధాలకు అతీతంగా ఎంపీలు మనస్సాక్షితో ఓటు వేయాలని జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి చేసిన విజ్ఞప్తికి పార్లమెంటు సభ్యులు సానుకూలంగా స్పందించే ప్రజాస్వామిక వాతావరణం లేదు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల మొత్తం సంఖ్యలో ఎన్డీఏ కూటమికి ఆధిక్యత ఉన్నది. రాధాకృష్ణన్ విజయం నల్లేరు మీద నడకే కావచ్చు. కానీ, దేశ ప్రజలు మాత్రం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి ఎన్నికల ప్రచార వేదికల్లో ప్రస్తావించిన అంశాలపై దృష్టిసారించి, అప్రమత్తంగా వ్యవహరిస్తూ, రాజ్యాంగ విలువలను పరిరక్షించుకోకపోతే దేశ భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుంది. ప్రజాస్వామ్యాన్ని ఆధిపత్య రాజకీయాలకు బలిచేసే ప్రమాదం పెరుగుతుంది.

రాజకీయ విశ్లేషకులు

ది టెలిగ్రాఫ్ ఎడిటర్ కన్నుమూత

న్యూఢిల్లీ: ది టెలిగ్రాఫ్ ఎడిటర్ శంకర్షన్ ఠాకూర్ సోమవారం గుర్గావ్ ఆసుపత్రిలో కన్నుమూశారు. 63 ఏళ్ల ఠాకూర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నారు. చురుకైన రాజకీయ విశ్లేషణ, గ్రౌండ్ రిపోర్టింగ్‌కు పేరు గాంచిన ఠాకూర్ సమకాలీన జర్నలిజంలో అత్యుత్తమ రచయితలలో ఒకరిగా పరిగణించబడ్డారు. బీహార్ రాజకీయాల చరిత్రకారుడు అయిన ఠాకూర్ ప్రసిద్ధ పుస్తకాలలో మేకింగ్ ఆఫ్ లాలూ యాదవ్, ది అన్‌మేకింగ్ ఆఫ్ బీహార్, సింగిల్ మ్యాన్ : ది లైఫ్ అండ్ టైమ్స్ ఆఫ్ నితీశ్ కుమార్ ఆఫ్ బీహార్, అలాగే ది బ్రదర్స్ బిహారీ ఉన్నాయి. పాట్నాలోని సెయింట్ జేవియర్ హై స్కూల్‌లో చదువుకున్న ఠాకూర్ జర్నలిజం ప్రపంచంలో చేరడానికి ముందు దిల్లీ విశ్వవిద్యాలయంలోని హిందూ కళాశాల నుంచి పొలిటికల్ సైన్స్‌లో పట్టభద్రుల య్యారు. ఆయన మరణ వార్త జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర విషాదం నింపింది. 'జర్నలిజం వర్గాల్లో ఒక నిర్భయమైన స్వరాన్ని మనం కోల్పోయాము. ఆయన పదునైన రాజకీయ విశ్లేషణ, సత్యం పట్ల అచంచలమైన నిబద్ధత మనకు తీవ్ర లోటు కలిగిస్తుంది' అని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో పేర్కొంది. 'ఆయన చురుకైన రిపోర్టింగ్, నిర్భయమైన రాజకీయ వ్యాఖ్యానం, వాగ్ధాటి రచనా శైలి శాశ్వత వారసత్వాన్ని మిగిల్చాయి' అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు.

గిరిజనుల హక్కులకు భంగం

నికోబార్ దీవుల ప్రాజెక్టుపై రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ: గ్రేట్ నికోబార్ దీవుల ప్రాజెక్టు గిరిజనుల హక్కులను తుంగలో తొక్కేస్తుందని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఈ ప్రాజెక్టు వల్ల నికోబార్ ప్రజలు అన్యాయానికి గురవుతారని, ఈ ప్రాజెక్టుతో సున్నితమైన పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ద హిందూ ఆంగ్ల పత్రికలో రాసిన వ్యాసాన్ని రాహుల్‌గాంధీ సోమవారం సోషల్‌మీడియాలో షేర్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ట్రాన్షిప్‌మెంట్ పోర్ట్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఎనర్జీ ప్లాంట్, టౌన్‌షిప్, సమగ్ర అభివృద్ధి వంటి లక్ష్యాలతో ఈ ప్రాజెక్టును నిర్మించనుంది. అయితే ఈ ప్రాజెక్టు చేపట్టడం ఒక దుస్సాహసం. గిరిజన హక్కులను తుంగలో తొక్కడం, చట్టపరమైన, చర్చా ప్రక్రియలను అపహాస్యం చేయడమేనని రాహుల్‌గాంధీ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. కాగా, సోనియాగాంధీ హిందూలో రాసిన వ్యాసంలో ఈ ప్రాజెక్టు వల్ల నికోబార్ ప్రజలకు, సున్నితమైన పర్యావరణ వ్యవస్థకు జరిగే అన్యాయాన్ని ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టు ప్రపంచంలోని అత్యంత ప్రత్యేకమైన వృక్షజాలం, జంతుజాలం నాశనమవుతుందని, దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందని సోనియా గాంధీ ప్రధానంగా ప్రస్తావించారు. రూ.7,200 కోట్లతో

నిర్మించే ఈ ప్రాజెక్టు ఆ ద్వీపంలోని గిరిజన వర్గాల ఉనికికి ముప్పు కలిగిస్తుంది. నికోబారీ గిరిజనుల పూర్వీకుల గ్రామాలు ప్రాజెక్టు ప్రతిపాదిత భూభాగ పరిధిలోకి వస్తాయని, అందుకే 2004లో హిందూ మహాసముద్ర సునామీ సమయంలో వీరంతా తమ గ్రామాలు ఖాళీ చేయవలసి వచ్చిందని ఆమె వివరించారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు గిరిజనులను అక్కడి నుంచే లేకుండా చేసే ప్రయత్నమేనని సోనియా తెలిపారు. కేంద్రం ఈ ప్రాజెక్టును నిర్మించడానికి తెచ్చిన షోంపెన్ పాలసీ, గిరిజన తెగకు, వారి సంక్షేమానికి పెద్ద ముప్పు కలిగిస్తుంది. ఎందుకంటే వారు నివసించే భూభాగాన్ని డీనోటిఫై చేస్తుంది. దీంతో వారి ఉనికి, నివాసం ప్రమాదంలో పడుతుంది. ఈ అంశాలను కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ నోటిఫై చేసిందని ఆమె ఆ వ్యాసంలో పేర్కొన్నారు. గిరిజన హక్కులను పరిరక్షించడానికి స్థాపించబడిన రాజ్యాంగ, చట్టబద్ధమైన సంస్థలు లేవనెత్తే అంశాలను ఈ ప్రక్రియలో పక్కన పెట్టారని సోనియా విమర్శించారు.

ఛోక్సీకి జైలులో సకల సదుపాయాలు

బెల్జియంకు భారత్ హామీ

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీని తమకు అప్పగిస్తే అతడిని ఏకాంతంగా నిర్బంధిస్తామని బెల్జియంకు భారత్ హామీ ఇచ్చింది. అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపింది. బెల్జియం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఛోక్సీని ముంబై జైలులో బ్యారక్ నంబర్ 12లో ఉంచనున్నారు. అందులో ఎక్కువమంది ఖైదీలు ఉండరు. అంతేకాకుండా ఛోక్సీని బంధించే సెల్‌పై 24 గంటలు నిఘా ఉంటుంది. ఫర్నిచర్ కాకుండా మూడు చదరపు మీటర్ల స్థలం అందుబాటులో ఉంటుంది. ఈ సెల్‌లో సరిపడా గాలి, వెలుతురు, వస్తువులు దాచుకునే సౌకర్యం, కాటన్ పరుపు, దిండ్లు, బెడ్‌షీట్, దుప్పటి ఏర్పాటుచేస్తారు. వైద్య సౌకర్యాలకు తగినట్లుగా బెడ్ ఉంటుంది. శుద్ధమైన తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయం కల్పిస్తారు. పరిశుభ్రమైన మరుగుదొడ్లతోపాటు... వాటిని ఎప్పటికప్పుడు కడిగించే ఏర్పాట్లు చేయనున్నారు. మెహుల్ ఛోక్సీకి రోజూ గంటకు పైగా వ్యాయామం చేసుకోవడానికి అనుమతిస్తారు. నిర్బంధ కాలంలో సరిపడా ఆహారం అందిస్తారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆంట్వర్ప్‌లో మెహుల్ ఛోక్సీని బెల్జియం అధికారులు అరెస్టు చేశారు. భారత దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన అభ్యర్థన కారణంగానే అరెస్టు జరిగింది. అప్పటినుంచి అతడు ఆ దేశంలోని జైలులో ఉన్నాడు. ఇటీవల బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా... దేశం నుంచి పారిపోతాడనే కారణంగా న్యాయస్థానం ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చింది. సెప్టెంబర్ రెండో వారంలో అతడి అప్పగింత పిటిషన్ విచారణకు రానుంది.

అంగన్‌వాడీలకు నితీశ్ ఎర

పట్నా: త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీఎం నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆ రాష్ట్ర ప్రజలకు వరాల జల్లు కురిపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రజాకర్షక పథకాలను ఆయన ప్రకటించారు. తాజాగా చిన్నారులకు, గర్భిణీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్లకు జీతాలు పెంచుతామని ప్రకటించారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో 1.20 లక్షలకు పైగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే... అంగన్‌వాడీలు ఇప్పుడు పొందుతున్న రూ.ఏడు వేల జీతాన్ని రూ.తొమ్మిది వేలకు పెంచుతామని, హెల్పర్స్(సహాయకా) జీతం రూ.నాలుగు వేల నుంచి రూ.4,500లకి పెంచుతామని ఆయన సోమవారం ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఈ జీతాల పెంపు ఆయా విభాగాలకు ఆదేశాలు జారీ చేయబడ్డాయని నితీశ్ తెలిపారు.

పినరయి విజయన్ ఇంటికి బాంబు బెదిరింపు

తిరువనంతపురం: కేరళలో బాంబు బెదిరింపు కలకలం రేపుతోంది. ఓ అగంతకుడు రాష్ట్రంలోని ప్రముఖ ప్రాంతాల్లో బాంబుల్ని ఏర్పాటు చేసినట్లు బెదిరింపులకు దిగారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగింది. సోమవారం ఉదయం తిరువనంతపురం జిల్లా కోర్టుకు అధికారిక ఈ-మెయిల్‌కు ఓ మెసేజ్ వచ్చింది. సీఎం పినరయి విజయన్‌తో పాటు తిరువనంతపురం జిల్లా కోర్టులో బాంబు పెట్టామనేది ఆ మెయిల్ సారాంశం. సీఎం పినరయి విజయన్ అధికారిక నివాసం, జిల్లా కోర్టులో బాంబు ఉందంటూ వచ్చిన సమాచారంతో బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగింది. విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

కుల్గాంలో ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో సోమవారం ఉదయం భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందగా, ముగ్గురు జవాన్‌లు గాయపడి నట్టు అధికారులు తెలిపారు. కుల్గాం జిల్లా గుడార్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదుల ఉనికిపై సమాచారం అందగానే భద్రతా దళాలు గుడార్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ ప్రారంభించినట్టు చెప్పారు. ఇదే సమయంలో ఉగ్రవాదులు భద్రతా దళాలపై కాల్పులు జరపడంతో భారత సైన్యం తిప్పికొట్టింది. ఈ సమయంలో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు.. ఒక జూనియర్ కమిషన్డ్ అధికారితో మరొకరు గాయపడ్డారు. ఇండియన్ ఆర్మీ, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని భారత సైన్యంలోని చినార్ కార్ప్స్ తెలిపింది.

ఉపరాష్ట్రపతి ఎన్నికే సరైన సమయం

బీజేపీపై వ్యతిరేకతను బీజేడీ నిరూపించుకోవాలి: కాంగ్రెస్

భువనేశ్వర్: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ బీజేపీ పట్ల తన పార్టీ వ్యతిరేకతను నిరూపించుకోవాలని ఒడిశా కాంగ్రెస్ సోమవారం హితవు పలికింది. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఒడిశాలో బీజేడీ నిజమైన ప్రతిపక్షమని ప్రజలకు స్పష్టమైన చిత్రాన్ని ఇవ్వడానికి పట్నాయక్‌కు ఇది సరైన అవకాశం. ఈ పరిస్థితిని నివారించడానికి ఉపరాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉండటం చివరికి బీజేపీకి సహాయపడుతుంది' అని తెలిపారు. రాజ్యసభలో వక్ఫ్ (సవరణ) బిల్లు ఆమోదం సమయంలో బీజేడీ వైఖరిని మార్చుకున్న విషయాన్ని దాస్ గుర్తు చేసుకున్నారు. 'ప్రారంభంలో బిల్లును వ్యతిరేకించాలని పార్టీ నిర్ణయించింది. అయితే రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి కొంతకాలం ముందు బీజేడీ అకస్మాత్తుగా తన వైఖరిని మార్చుకుంది. అధికారిక విప్ జారీ చేయకుండా దాని ఎంపీలు వ్యక్తిగత మనస్సాక్షి ప్రకారం ఓటు వేయడానికి అనుమతించింది' అని అన్నారు. పట్నాయక్ ఒక ప్రజాదరణ పొందిన నాయకుడని, అతని బీజేడీ రాష్ట్రంలో ఒక పెద్ద రాజకీయ పార్టీ అని పేర్కొంటూ, 'వారు కాంగ్రెస్, బీజేపీ రెండింటి నుంచి సమాన దూరం పాటిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ వారు అసెంబ్లీలో లేదా ఇతర బహిరంగ వేదికలపై అలా చేయడం లేదు' అని తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల సమయంలో 'బీజేపీ ముందు లొంగిపోయినట్లు కనిపించే' నిర్ణయం తీసుకోవద్దని ఆయన ప్రాంతీయ పార్టీని కోరారు.

14 మంది నకిలీ బాబాలు అరెస్ట్

డెహ్రాడూన్: బంగ్లాదేశ్ జాతీయులతో సహా 14 మంది నకిలీ బాబాలను ఉత్తరాఖండ్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ప్రజలను మోసం చేయడం, మత మార్పిడికి పాల్పడం వంటి అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తులు, నకిలీ బాబాలను గుర్తించేందుకు ప్రభుత్వం 'ఆపరేషన్ కాలనేమి' చేపట్టింది. ఈ ఆపరేషన్ కింద రాష్ట్రంలో 5,500 మందిని పోలీసులు ప్రశ్నించారని, వీరిలో 1,182 మందిపై చర్యలు తీసుకున్నారని పోలీసు అధికారి చెప్పారు. ఈ ఏడాది జూలైలో 'ఆపరేషన్ కాలనేమి'ని పోలీసులు ప్రారంభించారు. ఇది అద్భుతమైన విజయాన్ని సాధించిందని ఐజీపీ భరానే తెలిపారు. పెద్ద సంఖ్యలో ప్రజలను ప్రశ్నించినట్లు చెప్పారు. ఆగస్టులో 4,000 మందిని పోలీసులు ప్రశ్నించిన తర్వాత 300 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. హరిద్వార్‌లో 2,704 మందిని తనిఖీ చేసి ముగ్గురిని, డెహ్రాడూన్‌లో 922 మందిని తనిఖీ చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఐజీపీ భరానే తెలిపారు. టెహ్రీ, పౌరి, అల్మోరా, నైనిటాల్‌తోపాటు ఇతర జిల్లాల్లో కూడా పోలీసులు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 'దేవభూమి పవిత్రత'ను కాపాడటమే ఈ ఆపరేషన్ లక్ష్యమని అన్నారు. బంగ్లాదేశ్ పౌరుడైన అమిత్ కుమార్ బెంగాలీ వైద్యుడిగా చెలామణి అవుతున్నాడని, గత ఎనిమిది ఏళ్లుగా నకిలీ పత్రాలతో సెలాకీలో నివసిస్తున్నాడని ఐజీపీ భరానే తెలిపారు. అతడి ఆధారాలు పరిశీలించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన ఇఫ్రాజ్ అహ్మద్ లోలు తన మతాన్ని దాచాడని వివరించారు. దిల్లీకి చెందిన రాజ్ అహుజా అనే వ్యక్తి ధనవంతుడిగా నటిస్తూ మహిళలతో సంబంధాలు పెట్టుకున్నాడని, అతడిని కూడా సెలాకీలో అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

దిల్లీలో 'ఫులేరా' ప్రభుత్వం

సీఎం రేఖా గుప్తాపై ఆప్ విమర్శలు

న్యూఢిల్లీ: దిల్లీ ప్రభుత్వ అధికారిక సమావేశంలో ముఖ్యమంత్రి రేఖా గుప్తా భర్త పాల్గొనడంతో రాజకీయ దుమారం చెలరేగింది. అభివృద్ధి ప్రాజెక్టులపై జరిగిన సమీక్షా సమావేశంలో సీఎం భర్త మనీశ్ గుప్తా పాల్గొనడంపై ప్రతిపక్ష ఆప్ మండిపడింది. ప్రభు త్వంలో ఎటువంటి హోదా లేకపో యినా... అధికారిక సమీక్షల్లో పాల్గొన డం రాజ్యాంగ విరుద్ధమని విమర్శిం చింది. దిల్లీలో 'ఫులేరా' తరహా ప్రభు త్వం నడుస్తోందా అని ప్రశ్నించింది. 'దిల్లీలో 'ఫులేరా' ప్రభుత్వం నడు స్తోందా? అనేక మంది అధికారులు, ఉద్యోగులతో సీఎం రేఖా గుప్తా సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం పక్క కుర్చీలో ఆమె భర్త ఉన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. కుటుంబ పాలనపై కాంగ్రెస్‌ను విమర్శించే బీజేపీ... దీనికి సమాధానం చెప్పాలి. ఇది కుటుంబ పాలన కాదా? భర్తకు ఎలాంటి అధికారాలు ఇవ్వాలని సీఎం కోరుకుంటున్నారు? పాలనా విషయాల్లో ఆయనను ఎందుకు భాగస్వామ్యం చేస్తున్నారు?' అని ఆప్ నేత, దిల్లీ మాజీమంత్రి సౌరభ్ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. అధికారిక కార్యక్రమాల్లో సీఎం భర్త పాల్గొంటూ... తనిఖీలు చేస్తున్న విషయాన్ని గతంలోనే ప్రస్తావించా మన్నారు. దిల్లీలో ఓ నియోజకవర్గంలో అభివృద్ధి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేఖా గుప్తా ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో సీఎం భర్త మనీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోను రేఖా గుప్తాతోపాటు సీఎంఓ సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. దీనిపైనే ఆమ్‌ఆద్మీ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇటీవల ఓటీటీలో వచ్చిన 'పంచాయత్' వెబ్ సిరీస్‌ను ఉదహరిస్తూ... ఫులేరా గ్రామ సర్పంచ్‌గా మహిళ ఉన్నప్పటికీ అధికారిక కార్యక్రమాలను ఆమె భర్త చూసుకోవడాన్ని ప్రస్తావించింది.

హెలికాప్టర్లకు పెరిగిన గిరాకీ

బీహార్ ఎన్నికల కోసం ఇప్పటికే బుకింగ్

పట్నా: బీహార్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే ఆ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు హెలికాప్టర్ల బుకింగ్‌ల కోసం పోటీపడుతున్నాయి. 2020 ఎన్నికల్లో కోవిడ్ కారణంగా బుకింగ్‌లు పెద్దగా జరగలేదు. ఈసారి మాత్రం పోటాపోటీగా ప్రచారం జరగనుండటంతో హెలికాప్టర్లకు డిమాండ్ బాగా పెరిగింది. బీహార్‌లో సాధ్యమైనంత మేరకు అన్ని నియోజకవర్గాలను చుట్టేయాలని ముఖ్యనేతలు భావిస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు మార్గాలను నమ్ముకుంటే ప్రచారంలో వెనకబడతామనే భయం నాయకుల్లో నెలకొంది. అందుకే రోజుకు కనీసం 20 హెలికాప్టర్లు గాల్లో ఎగిరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్(ఎన్డీయే), ఇండియా ఐక్యసంఘటన నేతలు ఇప్పటికే కొన్ని హెలికాప్టర్లు బుక్ చేసుకొని ప్రచారానికి సిద్ధంగా ఉన్నారు. భారతీయ జనతా పార్టీ(బీజేపీ), జేడీయూ కూటమి చేతిలో డజన్‌కు పైగా హెలికాప్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో దాదాపు 12 హెలికాప్టర్లు బీజేపీ నేతలే వినియోగించనున్నట్లు సమాచారం. ఐదు హెలికాప్టర్లతో ప్రచారం ముగించేయాలని ప్రతిపక్షం భావిస్తోంది. కాంగ్రెస్ రెండు హెలికాప్టర్లను బుక్ చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఆర్జేడీ కూడా కొన్ని బుక్ చేసింది. ఒక సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంటుంది. అదే డబుల్ ఇంజిన్ అయితే రూ.3 నుంచి రూ.4 లక్షలు. ఎన్నికల వేళ ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. సింగిల్ ఇంజిన్ అద్దె 25 శాతం, డబుల్ ఇంజిన్ అద్దె 100 శాతం పెరగొచ్చని తెలుస్తోంది. రోజు వారీ కార్యక్రమాల కోసం బుకింగ్‌లు చేసుకునే నేతలు జీఎస్టీతో కలిపి మూడు గంటల అద్దె ముందుగా చెల్లించాలి. ఇదిలాఉండగా... తాము పరిమిత వనరులతోనే ప్రచారం సాగిస్తున్నామని ఆర్జేడీ నేత రాజేశ్ యాదవ్ తెలిపారు. 'మా అధినేత లాలూప్రసాద్ యాదవ్ పాతబడిన జీపులో ప్రచారం చేస్తారు' అని చెప్పారు. తేజస్వికి యువత మద్దతు ఉందని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలు చుట్టేయాల్సిన అవసరం ఉంటేనే హెలికాప్టర్లను వినియోగిస్తామని స్పష్టంచేశారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టేయాలనే ఆలోచనతో హెలికాప్టర్లు బుకింగ్ చేసుకుంటున్నామని బీజేపీ అధికార ప్రతినిధి వినోద్ శర్మ తెలిపారు. గత ఎన్నికల కంటే ఇప్పుడు ఎక్కువ హెలికాప్టర్లు బుక్ అయ్యాయని పట్నా ఎయిర్‌పోర్టు గ్లోబల్ ఫ్లైట్ సర్వీస్ మేనేజర్ దేవేంద్ర కుమార్ వెల్లడించారు.

వాట్సాప్ సేవల్లో అంతరాయం

న్యూఢిల్లీ: మెటాకు చెందిన ప్రముఖ మెసింజర్ యాప్ వాట్సాప్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. భారత్‌లో యూజర్లు యాప్‌ను ఉపయోగించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమకు ఎదురైన సమస్యలపై వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం... సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ సమస్య తలెత్తింది. వాట్సాప్ సేవల్లో అంతరాయంపై దాదాపు 410కిపైగా ఫిర్యాదులు వచ్చాయి. వాట్సాప్‌లో మెసేజ్‌లు వెళ్లడం లేదని, స్టేటస్‌లు కూడా అప్‌లోడ్ కావడం లేదని పేర్కొన్నారు. తామంతా తీవ్ర అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. దాదాపు 54 శాతం మంది యూజర్లు సర్వర్ కనెక్షన్‌లో సమస్యల గురించి ఫిర్యాదు చేశారు. 24 శాతం మంది డెస్క్‌టాప్‌లో, 22 శాతం మొబైల్ యాప్‌లో అంతరాయాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు.

మహారాష్ట్ర తీరానికి అనుమానాస్పద కంటైనర్లు

ముంబై: మహారాష్ట్రలోని సముద్రతీరానికి మూడు అనుమానాస్పద కంటైనర్లు కొట్టుకురావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పాల్ఘర్ జిల్లాలోని సత్పతి, షిర్గావ్ బీచ్‌లకు మూడు అనుమానాస్పద కంటైనర్లు కొట్టుకురావడంతో భద్రతా, విపత్తు నిర్వహణ సంస్థలను అప్రమత్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న కోస్టుగార్డ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని... అవి ఎక్కడి నుంచి వచ్చాయి... అందులో ఏముందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. దీంతో తీర గ్రామాలను అప్రమత్తం చేసి... బీచ్‌ల వెంబడి ముమ్మరంగా పెట్రోలింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. సముద్రంలో అధిక ఆటుపోట్లు ఉండడం వల్ల కంటైనర్లను తెరవడం కష్టతరంగా మారిందని, ఓ కంటైనర్ పాక్షికంగా మునిగిపోయిందని అధికారులు తెలిపారు. పోలీసులు, సముద్ర నిఘా అధికారులు, కోస్ట్ గార్డ్‌లు సమన్వయంతో పని చేస్తూ... కంటైనర్లకు సంబంధించిన వివరాలు తెలుసుకోవడానికి షిప్పింగ్ లాగ్‌లు, తీరప్రాంత నిఘా డేటా ద్వారా దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఆగస్టులో ఒమన్ నుంచి వెళ్తున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడ్డాయని, ప్రస్తుతం అవే కొట్టుకొచ్చినవి అయ్యుంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. సముద్ర తీరాల్లో అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే ముట్టుకోవద్దని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంత గ్రామస్తులకు సూచించారు. ఆగస్టులో ఒమన్ నుంచి వెళ్తున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడ్డాయి. కంటెయినర్లు అరేబియా సముద్రం గుండా మహారాష్ట్రలోని ఒడ్డుకు కొట్టుకువచ్చే సూచనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. కంటెయినర్లను లేదా సంబంధిత వస్తువులను గుర్తిస్తే భారత నావికాదళానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంత గ్రామస్థులు, గస్తీ బృందాలకు అధికారులు సూచించారు.

నేడు పంజాబ్‌కు ప్రధాని

చండీగఢ్: పంజాబ్‌లో ఇటీవల సంభవించిన వరదల వల్ల 48 మంది మృతి చెందారు. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. ఈ ప్రకృతి విపత్తుకి వేలాది హెక్టార్లలో పంట నీట మునిగింది. దీంతో అక్కడి పరిస్థితిని పరిశీలించడానికి మంగళవారం ప్రధాని మోదీ పంజాబ్‌లో పర్యటించనున్నారు. భారత సైన్యం, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), సరిహద్దు భద్రతా బలగాలు, పంజాబ్ పోలీసులు, జిల్లా అధికారులంతా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఇప్పటికీ వారు కొనసాగిస్తు న్నారు. వీరితో పాటు స్థానికులు, సినీనటులు, సహాయ సంస్థలు సహాయక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.

రాష్ట్రానికి రూ.15,516 కోట్ల పెట్టుబడులు

సీఎం స్టాలిన్



చెన్నై: తమిళనాడుపై నమ్మకం ఉంచి... సహకార వెంచర్లకు పది కొత్త కంపెనీలు ముందుకు వచ్చాయని, మరో 17 సంస్థలు తమ వెంచర్లను విస్తరించాలని నిర్ణయించాయని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సోమవారం తెలిపారు. జర్మనీ, బ్రిటన్ నుంచి వచ్చిన ముఖ్యమంత్రికి ఇక్కడి విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వచ్చేలా హామీ ఇచ్చినందున ప్రతిపక్షాలు తన పర్యటనను సహించలేకపోతున్నాయని అన్నారు. 'జర్మనీ, బ్రిటన్‌కు నా ఒక వారం పర్యటన సంతృప్తికరంగా ఉంది. ఇది విజయవంతమైన పర్యటన. ఇది 17,613 మందికి ఉద్యోగాలు కల్పించే రూ.15,516 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. మొత్తంగా, 33 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. నా విదేశీ పర్యటన విజయవంతమయింది' అని ఇక్కడకు వచ్చిన వెంటనే విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. ఉత్సాహభరితమైన పారిశ్రామిక వాతావరణం 17 సంస్థలను తమిళనాడులో విస్తరణకు ప్రోత్సహించడంతో అవి ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లకూడదని నిర్ణయించుకున్నాయని స్టాలిన్ తెలిపారు.

17 లోపు కున్బి సర్టిఫికెట్లు

మహారాష్ట్ర సర్కార్‌కు జరాంగే అల్టిమేటం



ముంబై: సెప్టెంబరు 17 లోపు మరాఠాలకు కున్బి కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడానికి గత వారం జారీ చేసిన జీఆర్‌ను అమలు చేయాలని కోటా కార్యకర్త మనోజ్ జరాంగే సోమవారం డిమాండ్ చేశారు. లేకుంటే తాను మళ్లీ కఠినమైన నిర్ణయం తీసుకుంటానని అన్నారు. తమ డిమాండ్లలో 96 శాతం నెరవేరాయని, మరాఠా సమాజానికి పూర్తి న్యాయం కోసం తన పోరాటం కొనసాగుతుం దని నొక్కి చెప్పారు. మరాఠ్వాడ, పశ్చిమ మహారాష్ట్రకు చెందిన మరాఠా సమాజ సభ్యులకు రిజర్వేషన్లు లభిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇతర వెనుకబడిన తరగతి (ఓబీసీ) ని వర్గీకరించబడిన సామాజిక సమూహం అయిన కున్బి వారసత్వానికి చెందిన చారిత్రక ఆధారాలతో మరాఠా సమాజ సభ్యులకు కున్బి కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పుడు సెప్టెంబరు 2న ముంబైలో కోటా కోసం కార్యకర్త తన ఐదు రోజుల నిరాహార దీక్షను ముగించారు. 'రాష్ట్రంలోని తాలూకా స్థాయి కార్యాలయాలు జీఆర్‌పై చర్య తీసుకోవాలని ప్రభుత్వం కోరుతుందని మేము ఆశిస్తు న్నాము. సెప్టెంబరు 17 లోపు పని ప్రారంభించాలి. పూర్తి చేయకపోతే, నేను కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది' అని జరంగే గత వారం తన ఆందోళనను విరమించిన తర్వాత చికిత్స పొందుతున్న ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఒక ఆసుపత్రిలో విలేకరులతో అన్నారు. 'ధ్రువీకరణ పత్రాల పంపిణీ సెప్టెంబరు 17 లోపు జీఆర్ ఆధా రంగా ప్రారంభం కావాలి. ప్రభుత్వం దానిపై చర్య తీసుకుంటుందని నేను నమ్ముతున్నాను. వారు యోలా నుంచి ఎవరైనా (స్పష్టంగా మంత్రి ఛగన్ భుజ్‌బల్‌ను సూచిస్తూ) విని ఏదైనా తప్పు జరిగితే మా రిజర్వేషన్‌లను ఇతరులకు ఇచ్చిన 1994 జీఆర్‌ని కూడా మేము సవాలు చేస్తాము' జరాంగే అన్నారు. నాసిక్ జిల్లాలోని యోలాకు చెందిన ఓబీసీ నాయకుడు, ఎమ్మెల్యే అయిన భుజ్‌బల్, మరాఠ్వాడాలకు ఇతర వెనుకబడిన తరగతుల కేటగిరీ కింద రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు. కాగా 17ను మరాఠ్వాడా విముక్తి దినోత్సవంగా జరుపుకుంటారు. 'రాష్ట్రంలోని మరాఠీ సమాజం జీఆర్ గురించి కొంచెం ఓపికగా ఉండాలి' అని అన్నారు. 'బీడ్‌లోని నారాయణ్‌గడ్‌లో జరిగే దసరా ర్యాలీలో మా విధానాన్ని మరింత ప్రకటిస్తాము. ఇది (ర్యాలీ) పెద్దగా ఉండదు. కానీ అది జరుగుతుంది' అని ఆయన తెలిపారు.

భారత్‌కు ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ భారత పర్యటనకు వచ్చారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు బెజలెల్ స్మోట్రిచ్ దేశంలో పర్యటించనున్నట్లు విదేశాంగ శాఖ అధికారిక వర్గాలు తెలిపాయి. రెండుదేశాల మధ్య కొంతకాలంగా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుగుతున్నాయని, ప్రస్తుత పర్యటనలో భాగంగా భారత్-ఇజ్రాయిల్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. దీంతో రెండు దేశాల మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడనున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. స్మోట్రిచ్ గాంధీనగర్‌లోని భారతదేశ ప్రపంచ ఆర్థిక సేవల కేంద్రాన్ని సైతం సందర్శించనున్నారు. బెజలెల్ స్మోట్రిచ్ భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో భేటీ కానున్నట్లు అధికారులు చెప్పారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ప్రజావాణి ఆర్జీలను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్జీదారులు ఒకే సమస్య పై పదేపదే రాకుండా హెచ్ఓడి లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 51 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు వేణు గోపాల్, రఘు ప్రసాద్, గీతా రాధిక, సుభద్రాదేవి, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ ఎస్.పి (విజిలెన్స్) సుదర్శన్, సి ఈ రత్నాకర్, హౌసింగ్ సి ఈ నిత్యానంద, అడిషనల్ సి సి పి లు గంగాధర్, వెంకన్న, ప్రదీప్, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, తదితరులు పాల్గొన్నారు.

తులసి రమణాచార్యులకు కాళోజీ పురస్కారం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మానవ సేవయే మాధవ సేవగా భావించి నిత్యం మాధవ సేవా చేస్తూ సమాజ చైతన్యం కోసం సామాజిక సాంస్కృతిక సాహిత్య ఆధ్యాత్మిక సేవా రంగాల్లో కృషి చేస్తున్న అక్షర కౌముది సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు యువ కవి, రచయిత, అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు కృషి నీ గుర్తించిన ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ మహాకవుల జయంతోత్సవం పేరిట కార్యక్రమాన్ని నగరంలో బిర్లా ప్లాంటోరియం భాస్కర్ ఆడిటోరియంలో జరిగిన సభలో తులసి వెంకట రమణా చార్యులకు కాళోజీ పురస్కారం అందించారు. ఆర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పారిశ్రామిక వేత్త పొట్లూరి హరికృష్ణ మహాకవుల జయంతోత్సవం సందర్భంగా కాళోజీ, సినారె దాశరథి, గురజాడ, గిడుగు రామమూర్తి వంటి మహా కవులు పేరిట తెలంగాణ తెలుగు భాషా దినోత్సవంను పురస్కరించుకొని పలు రంగాల్లో కృషి చేసిన వారికి వివిధ పురస్కారాలను కవులకు కళాకారులకు అందించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత తులసి వెంకట రమణా చార్యులు మాట్లాడుతూ... సమాజం కోసం ఏదో ఒకటి చెయ్యాలనే సంకల్పంతో అక్షర కౌముది సంస్థను స్థాపించి వివిధ రంగాల్లో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో ఆనంద దాయకమని, ఈ అవార్డు నాపై ఎన్నో భాధ్యతలను పెట్టిందన్నారు. ముఖ్య అతిథిగా పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు డా.నందిని సిద్ధారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వర రావు, ప్రముఖ కవులు ఎన్వీ రఘువీర్ ప్రతాప్, భీంపల్లి శ్రీకాంత్, సుతారం వెంకట నారాయణ, సురేంద్ర, అయ్యల సోమయాజులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (64) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

జీవో 99ను సవరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్రం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జీవో 99ను సవరించాల్సిన అవసరాన్ని వివరిస్తూ, రోస్టర్ విధానంలో జరుగుతున్న అసమానతలు, ముఖ్యంగా ఎస్సీ కులాల్లోని వివిధ వర్గాలకు అన్యాయం జరుగుతున్న విషయాన్ని ఎమ్మెల్యేకి వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. జీవో 99 సవరణ ద్వారా ఎస్సీ వర్గాల్లో న్యాయమైన ప్రాతినిధ్యం లభించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే రోస్టర్ విధానాన్ని పునః సమీక్షించాలని వారు కోరారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత స్థాయిలో ఈ అంశాన్ని ఉంచి, పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ పరశురాములు, ఎస్సీ, ఎస్టి, (పిఓఏ) ఆక్ట్ మెంబర్ శరణగిరి, ఆంజనేయులు, మురళి, నాగరాజు, సతీష్, తిరుపతయ్య, రాజేంద్రప్రసాద్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

వికలాంగుల కాలనీకి నీటి సరఫరా చేయాలి

విశాలాంధ్ర - ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ కెఎల్ మహేంద్రనగర్ (వికలాంగుల) కాలనీలో నీటి సదుపాయం కల్పించాలని, పన్నుల మినహాయింపు ఇవ్వాలని కోరుతూ సీపీఐ పార్టీ నాయకులు కల్లూరి జయచంద్ర, లొట్టి ఈశ్వర్లు సోమవారం పోచారం మున్సిపాలిటీ కమిషనర్ నిత్యానందకు వినతిపత్రం ఇచ్చారు. అన్నోజిగూడ సర్వే నంబర్ 14లో దాదాపు 296 మంది వికలాంగులకు 2011లో ఇండ్లు కేటాయించారని, నాటిని నుండి వికలాంగులు తమ సొంత డబ్బులతో బోర్ల ద్వారా ఇండ్లలోకి వాటర్ సరఫర చేసుకుంటున్నారని, 2014 నిర్మించిన మిషన్ భగీరథ ట్యాంక్ నుండి నీటి సరఫర చేయాలని కమిషనర్‌కు విన్నపించారు. వికలాంగుల ఇండ్లకు పన్నులు వసులు చేయవద్దని ప్రభుత్వం చెపుతున్నప్పటికి మున్సిపాలిటీ అధికారులు మాత్రం ఇంటి పన్నులు వసులు చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యం లో స్థానిక సమస్యలపై పోరాటాం చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

కమర్షియల్ టాక్స్, మైనింగ్ శాఖల రాబడుల్లో పెరుగుదల

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : కమర్షియల్ టాక్స్ శాఖలో 4.7శాతం, మైన్స్ శాఖలో 18.6 శాతం పెరుగుదల కనిపిస్తున్నది ఇతర శాఖల్లో ఆదాయ సమీకరణలో వెనుకబాటు కనిపిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఆదాయ వనరుల సమీకరణ సబ్ కమిటీ సమావేశం కమిటీ చైర్మన్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ పూడిక తీత పనులతో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది, ఇసుక ద్వారా రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుందనీ మంత్రి ఉత్తమ్ వివరించారు. మొదట ఒక ప్రాజెక్టులో పూడికతీత కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇసుక తవ్వకం పనులను పూర్తిగా ట్రైబల్ ఏజెన్సీల ద్వారా నిర్వహించాలని మంత్రులు సూచించారు. గిరిజనులకు యంత్ర సామాగ్రి అందుబాటులో ఉండదు ఈ నేపథ్యంలో ఐటీడీఏలోని ఇంజనీరింగ్ విభాగం యంత్ర సామాగ్రి సహాయం అందించాలని మంత్రులు సూచించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు మూడు వారాల్లో విధి విధానాలు రూపొందించాలని మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్, కమర్షియల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మైన్స్ డైరెక్టర్ శశాంక, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ట్రాన్స్పోర్ట్ కమిషనర్ సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత-చేవెళ్ల పునరుద్ధరణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా తుమ్మడి హట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వచ్చే డిసెంబర్ నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న దరిమిలా రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సోమవారం నీటిపారుదల శాఖా ప్రధాన కార్యాలయం జలసౌధలో జరిగిన నీటిపారుదల శాఖా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని రాష్ట్రం లోని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మొదలు పెట్టిం చేవెళ్ల-ప్రాణహితను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయల్సిన ప్రాజెక్టులలో సమ్మక్క- సారక్క ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 23 న ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం సమావేశానికి హాజరై ఆ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులతో పాటు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ నుండి అనుమతి తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అదే విధంగా ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వంతో చర్చించి అనుమతులు తీసుకోవాలని ఆయన సూచించారు. సీతారాం సాగర్, మోడికుంట వాగు, చనాకా/కొరాట డిస్ట్రిబ్యూటరీ సిస్టంతో పాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మణాలకు కావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం నుండి విడుదల చేసే విదంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి పంపాలన్నారు. కృష్ణా జలాల వివిధ ట్రిబ్యునల్ విషయమై సుప్రీంకోర్టులో ఈ నెల 23-25న వాదనలు ఉన్నందున అంతకు ముందే సుప్రీంకోర్టు న్యాయవాది సి.ఎస్.వైద్యనాధ్‌తో చర్చలు జరగనున్నాయన్నారు. జాతీయ డ్యామ్‌ల పరిరక్షణ సంస్థ చేసిన సూచనలకు అనుగుణంగా మెడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజ్‌లను పునరుద్ధరణ ఉంటుందన్నారు. బ్యారేజ్‌లను పునరుద్ధరించడంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతతో ఉందని అయితే ఎన్డీఎస్ ఏ సూచనాలకనుగుణంగా పనులు ముందుకు సాగుతాయని ఆయన స్పష్టం చేశారు.అయితే అదే సమయంలో ఐఐటీ వంటి సంస్థలతో నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరీక్షించేలా చర్యలు తీసుకోవడంతో పాటు వరదలు తగ్గిన వెంటనే పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించు కోవలన్నారు.వచ్చే సంవత్సరం వానాకాలం లోపు పనులు పూర్తి చేయాలన్నారు. అన్నింటికీ మించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్ లో ఉన్నభూసేకరణ, పునరావాసంతో పాటు అటవిశాఖా అనుమతుల వంటి ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలన్నారు.కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.అదే విదంగా డిండి, ఎస్.ఎల్.బి.సి, పెండ్లి పాకల, నక్కలగండి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. జూరాల ప్రాజెక్టు బ్రిడ్జిపై రోజు రోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి అక్కడి ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు

విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందాలి :కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం నాంపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందాలని సూచించారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహార పదార్థాలు అందించాలని, డిజిటల్ విద్యాబోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు గ్రేడింగ్ ద్వారా విద్యాబోధన అందించి నూరు శాతం ఉత్తీర్ణత ఉండేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు వివిధ క్రీడల్లో రాణించేలా ప్రత్యేక తర్ఫీదు అందించాలని సూచించారు. తదుపరి తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన తీరును పరిశీలించి ఎఫ్.ఆర్.ఎస్ తీరుపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల స్టైంత్, అందిస్తున్న మెనూ విధానం అలాగే గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర అంశాలపై ఉపాధ్యాయులు కలెక్టర్‌కు వివరించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. డీఈవో రోహిణి, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, హెచ్.ఎం హాబీ బా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలు అర్జీలపై సత్వరమే స్పందించాలి : కలెక్టర్

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండిప్రజలు అందచేసిన అర్జీలపై సత్వరమే అధికారులు స్పందించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలనితో కలసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వికలాంగులు, వయోవృద్ధులు వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే అర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సూచించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అవరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, సికింద్రాబాద్ ఆర్డీఓలు సాయిరాం, హైదరాబాద్ ఆర్డీఓ రామకృష్ణ, సిపిఓ డాక్టర్. సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. వెంకటి, హౌసింగ్ పి.డి.అశోక్ చక్రవర్తి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు జి. ఆశన్న, కోటాజి, ఇలియాస్ అహ్మద్, జి.ఎం ఇండ్రస్ట్రీస్ పవన్ కుమార్, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైక్రోబ్రూవరీల పేరుతో మద్యం అమ్మకాల అనుమతిపై నిరసన

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ పట్టణం కార్పొరేషన్‌గా మారుతున్న సందర్భంలో జిల్లా ఎక్సైజ్ శాఖ కమిషనర్ ద్వారా మైక్రోబ్రూవరీల పేరుతో మద్యం అమ్మకాల అనుమతుల కోసం ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఆ ప్రకటనపై తీవ్ర వ్యతిరేకతను తెలుపుతూ ఎన్ ఎఫ్ ఐడబ్ల్యూ నిరసన వ్యక్తం చేశారు. మహబూబ్ నగర్ పట్టణంలోని సురవరం వెంకట్రాంరెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షురాలుజీ భార్గవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తాగుడు కు బానిసలై ఇప్పటికే చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. భర్తలు తాగుబోతులుగా మారి బాధ్యతలు మరిచిపోతుంటే మహిళలు కష్టపడుతూ కూలి నాలి చేసి పిల్లల్ని సాధుతున్నారు ఏ పని చేతకాని మహిళలు పిల్లల్ని చంపేసి తాము చావడానికి సిద్ధపడుతున్నారు. దీనంతటికీ కారణం ఈ విచ్చలవిడి మద్యం అమ్మకాలే కారణమన్నారు. అంతేకాకుండా మరోవైపు యువత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి తల్లిదండ్రుల మాట వినడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటిదాకా కేవలం వైన్ షాపులు మాత్రమే ఉండేవి అక్కడికి వెళ్లాలంటే మహిళలు కానీ మైనర్లు కానీ భయపడే వాళ్ళు ఇబ్బంది పడే వాళ్ళని, కానీ ఇలా టీ స్టాల్ లాగా ఓపెన్ చేసి ఎక్కడికక్కడ బీర్లు తయారు చేసే అమ్మే సెంటర్లు పెడితే విద్యార్థి దశ నుండే తాగుడుకు బానిస అవుతారని అన్నారు. యూనిట్లలోని మిషనరీల ద్వారా కూల్ డ్రింక్స్ లాగా అప్పటికప్పుడే బీర్లు తయారు చేసి గ్లాసు, జగ్గు ద్వారా అందిస్తామని అంటున్నారు ఏ రోజు తయారైన బీరు ఆ రోజే అమ్మాలి. ధర కూడా నిర్వాహకులే నిర్ణయించుకోవా లన్నారు. ఓవైపు అన్నదాతలు ఎరువులు యూరియా అందక రోడ్డున పడి ఏడుస్తున్నారు అదే యూరియా కంపెనీలు ఎక్కడ పడితే అక్కడ పెట్టొచ్చు కదా అని నిలదీశారు. కేవలం బీర్లు మద్యం ఎక్కడ పడితే అక్కడ అమ్ముకోవడానికి ఎలా పర్మిషన్ ఇస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే ఈ ప్రకటనని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని, లేదంటే ఎలాంటి ఆందోళన కార్యక్రమానికైనా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ ఐడబ్ల్యూ పట్టణ కార్యదర్శి బి ఇందిర, మహేశ్వరి, సత్యమ్మ, కారూరి, అంజమ్మ, మాధవి, పూజ పాల్గొన్నారు.

రహదారులు, డ్రైనేజీ మరమ్మత్తులు చేయండి



విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని పలు రోడ్లు డ్రైనేజీ మరమ్మత్తులు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.) మల్కాజిగిరి మండల సమితి ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఉప కమిషనర్ జకియా సుల్తానాకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్ మాట్లాడుతూ సి.పి.ఐ. ప్రతినిధి బృందం పలు కాలనీలలో ప్రకటించి వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిని పాడైపోయి గుంతలు గుంతలుగా ఏర్పడి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయని, ద్విచక్ర వాహనాలపై వెళుతున్న ప్రజలు కిందపడి కాళ్లు చేతులు విరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని, ఆయా మార్గాల్లో ప్రయాణం నరకయాతనగా మారిందని, ఇట్టి విషయం పైన భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ,) గా రోడ్లు మెరుగు పర్చాలి కోరుతున్నామన్నారు. వినాయక్ నగర్ డివిజన్‌లోని దీనదయాల్ నగర్, టెలికాం కాలనీ, రేణుక నగర్, మధురానగర్, కాకతీయ నగర్, నేరేడ్ మెట్ డివిజన్‌లో గౌతమ్ నగర్, డివిజన్‌లోని పలు రహదారులు భారీగా గుంతలు పడ్డాయని ప్రజల సౌకర్యార్థం త్వరతగిరి రోడ్డు మరమ్మత్తులు చేయగలరని, డ్రైనేజీ మురికి కాలువలు కూడుకపోయి వర్షపు నీరు రోడ్లపై వచ్చి ఇండ్లలోకి నీళ్లు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నీళ్లు రావడం వల్ల నిత్యవసర వస్తువులు ఇంటి సామాగ్రి పాడైపోయిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని డివిజన్లలోని పాడైపోయిన వీధిలైట్లను రిపేరు చేయాలని యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ బృందం జిహెచ్ఎంసి మల్కాజిగిరి ఉప కమిషనర్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శులు కాసర్ల నాగరాజు, కె.అశోక్ నాయకులు బి.యాదగిరి. పి.సత్యనారాయణ, ఏం.లింగం, ఏ.బాబు, బి.నరేంద్ర చారి, డి.జంగయ్య, ఏ.సదానంద్, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా

సమ్మక్క, సారలమ్మ ఆలయ ఆధునీకరణ : మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపడతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ ఆధునీకరణను చేపడుతున్నామని, ఈ పనులను ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించి జనవరి మొదటి వారంలోగా పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే మేడారం ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారని, మూడు నెలల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా ఆదేశించారని తెలిపారు. సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా యూరియా పంపిణీ చేయాలి : మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్ : యూరియా పంపిణీలో క్యూ లైన్స్ లాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు సజావుగా యూరియా పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. గత కొద్ది రోజులుగా యూరియా పంపిణీలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా రైతు వేదికల వద్ద కూడా యూరియా పంపిణీ చేపట్టాలని మంత్రి తుమ్మల ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా 500 రైతు వేదికల వద్ద యూరియా అమ్మకాలు జరిపేందుకు వీలుగా రెండు రోజుల వ్యవధిలో 500ఈపీవోస్ మిషన్లు తెప్పించి, సిబ్బందికి శిక్షణ ఇప్పించి యూరియా అమ్మకాలు చేపట్టడం జరిగింది. రైతులకు ముందుగానే టోకెన్లు జారీ చేసి క్యూ లైన్లు లేకుండా తోపులాటలు లేకుండా యూరియా పంపిణీ సజావుగా సాగింది. యూరియా పంపిణీపై మంత్రి తుమ్మల ఆదేశాలతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో అగ్రికల్చర్ డైరెక్టర్ గోపి నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. రైతు వేదికల వద్ద యూరియా పంపిణీ మొదటి రోజు ఎలాంటి ఆందోళనలు లేకుండా సజావుగా సాగుతుండటంతో అదే పద్ధతిలో పకడ్బందీగా యూరియా పంపిణీ చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జియో పాలిటిక్స్ వల్ల యూరియా ఇంపోర్ట్ లేకపోవడం, దేశీయంగా ఉత్పత్తి డిమాండ్ కు తగ్గట్టు లేకపోవటం వల్ల తెలంగాణ లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో యూరియా సరఫరాలో కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారనీ మంత్రి తుమ్మల తెలిపారు. రైతులకు ప్రజా ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందనీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వ విధానాన్ని స్పష్టం చేశారు.

10న జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితా

విశాలాంధ్ర - హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ కె. శ్రీనివాస్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగింది. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీ.ఈ.ఓ రంగరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ఎన్. మహేష్, ఆవుల యాదయ్య, కె.రాజ్ కుమార్, బిఆర్ఎస్ నుండి వనం శ్రీనివాస్, బిజెపి నుండి కె.అనంతయ్య గౌడ్, అంబాజీ శ్రీనివాస్,సిపిఐ(యం) నుండి పగడాల యాదయ్య, సిపిఐ నుండి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, టీడిపి నుండి జె. రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయపోరాటం చేస్తా



విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ డివిజన్, గోకుల్ నగర్ కాలనీలోని ఖాళీ ప్లాట్ (నెంబర్ 300) యజమాన్య హక్కు దారుడిని తానేనని విజయవాడ మాజీ శాసన సభ్యులు యలమంచిలి రవి స్పష్టం చేశారు. సోమవారం ఆయన తన స్థలాన్ని సందర్శించి, అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, 1968లో తన తండ్రి కొందరు భాగస్వాములతో కలసి 49 ఎకరాలలో గోకుల్ నగర్ లే అవుట్ వేశారని, అప్పుడు కొన్ని ప్లాట్లు ఉంచుకున్నారని తెలిపారు. కాగా, కొంతమంది తన 300 నెంబరు ప్లాటును తప్పుడు రిజిస్ట్రేషన్‌తో వేరెవరికో విక్రయించారని గత డిసెంబరులో పోలీస్ కేసు పెట్టానని రవి చెప్పారు. ఈ అన్యాయంపై న్యాయ పోరాటం చేస్తానని తెలిపారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ :బీసీలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. సోమవారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై కవిత కీలక సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కులాల నాయకులతో భేటీ ఆమె భేటీ అయ్యారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇంతవరకు తెలంగాణ బీసీల రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు పార్లలో ప్రస్తావించలేదో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి ప్రభుత్వానికి సూచించారు. బీసీ సంఘాలను కలుపుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమ కార్యాచణ రూపొందించాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాదించే వరకు వెనక్కి తగ్గేది లేదని.కవిత స్పష్టం చేశారు.

అబద్ధాల అంబాసిడర్‌గా కేటీఆర్: సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణలో అబద్ధాలకు అంబాసిడర్ గా బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరిపోయారని మంత్రి సితక్క అన్నారు. ఆత్మహత్య చేసుకున్న మైదం మహేష్ జీతం ఆలస్యానికి ప్రభుత్వానికి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. జీతం ప్రాసెస్‌లో నిర్లక్ష్యం చేసిన ఇద్దరు సిబ్బందిని ఇప్పటికే విధుల నుండి తొలగించామని ఆమె వివరించారు. ములుగులో మల్టి పర్పస్ వర్కర్ మైదం మహేష్ మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం కేటీఆర్ గారు వాడుకోవడం సిగ్గుచేటన్నారు. టీఆర్ఎస్ హయాంలో పారిశుద్ధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు రాక సమ్మెలు చేసిన రోజులు ప్రజలు మరిచిపోలేదని తెలిపారు. సిరిసిల్ల నుంచి సిద్దిపేట దాకా కలెక్టరేట్ల ఎదుట సఫాయి అన్నలు నిరసనలు చేస్తే పట్టించుకోని మీరు, నేడు మొసలి కన్నీరు కారిస్తే కార్మికులు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న వేలాది పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల్లాగే ప్రతి నెల జీతాలు చెల్లిస్తున్నామని, ఇందు కోసం గ్రీన్ ఛానెల్ విధానాన్ని ప్రవేశపెట్టి, జీతాలు ఆలస్యం కాకుండా సమయానికి చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. మీ హయంలో ఎప్పుడు జీతం వస్తుందో తెలియక ఇబ్బంది పడిన 50 వేల మందికి పైగా ఎం.పీ.డబ్ల్యూ కార్మికులకు ఇప్పుడు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు అందుతున్నాయన్నారు. ములుగులో మైదం మహేష్ జీతం ఆలస్యం కావడంలో ప్రభుత్వ తప్పిదం లేదని, జీతం ప్రాసెస్ చేసే సమయంలో స్థానిక పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వలన రెండు నెలల వేతనం ఆలస్యమైందన్నారు. బాధ్యులపై తక్షణ చర్య తీసుకొని పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి, బిల్ కలెక్టర్‌ను విధులనుంచి తొలగించామన్నారు. మైదం మహేష్ కుటుంబానికి పరిహారం అందించడం జరిగిందన్నారు. కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు తన సొంత నియోజకవర్గంలో సర్పంచ్‌లు, కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు పట్టించుకోలేదు. ముగ్గురు పిల్లలున్నారని ఆదుకోవాలని ఓ తల్లి విజ్ఞప్తి చేస్తే.. నా కోసం పిల్లల్ని కన్నవా అని అవమానాలకు గురి చేశాడన్నారు. అలాంటి కేటీఆర్ ఇప్పుడు అధికారం పోగానే ప్రజల మీద కపట ప్రేమ ప్రదర్శించడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు.

అంగన్వాడీలకు ఫుడ్ గ్యాప్ ఉండొద్దు...

సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు. శాఖలో జరుగుతున్న పనుల పురోగతిపై, అమలవుతున్న పథకాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సమీక్ష సందర్భంగా మంత్రి సీతక్క అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గుడ్లు, పాలు, పప్పు, మంచినూనె, స్నాక్స్, బాలమృతం సరఫరాపై సమీక్ష జరిపారు. అధికారుల నివేదిక ప్రకారం పాలు మినహా మిగిలిన వస్తువులన్నీ 98 శాతం పైగా సరఫరా అవుతుండగా, పాలు మాత్రం గత నెలలో 58 శాతం మాత్రమే సరఫరా అయ్యాయని తెలిపారు. పాల సరఫరా లోపంపై మంత్రి సీరియస్‌గా స్పందించి, పాలతో సహా ఎక్కడా ఫుడ్ గ్యాప్ లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. గుడ్ల సరఫరా విషయంలో మంత్రి సీతక్క అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు.

కాళోజీ కథల పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి జూపల్లి



విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రచురించిన పద్మ భూషణ్ కాళోజి నారాయణరావు రచించిన కథల పుస్తకాన్ని సోమవారం డా.బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్ పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాళోజి సాహిత్యానికి చేసిన కృషిని ఆయన కొనియాడారు. నా గొడవ అనే పుస్తకంలో ఆయన రాసిన కవిత్వమే కాకుండా సాహిత్యంలోని అనేక అంశాలను ఆయన స్పృశించారని, తెలంగాణ భాషకు ఆయన చేసిన కృషి కూడా గొప్పదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళోజి జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో శుభ సూచకమని, ఇంతటి గొప్ప సాహిత్యవేత 111వ జన్మదిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కాళోజీ కథల పుస్తకాన్ని తీసుకురావడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలా చారి, కవి యాకుబ్, ఈమని శివనాగిరెడ్డి, ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటా

విశాలాంధ్ర - మొయినాబాద్ : ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు తన ప్రోత్సాహం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని వారికి అండగా ఉంటానని మొయినాబాద్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పార్టీ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మొయినా బాద్ మున్సిపల్ పరిధిలోని పెద్ద మంగళారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు ఆయన తన సొంత నిధులతో షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్నారని వారికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. విద్యార్థులకు అవసరమైన ఇతర సామాగ్రిని కూడా అందజేస్తానని చెప్పారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను డోజర్ సహాయంతో తొలగించి చదును చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఉపాధ్యాయులు ఉమాదేవి, అలివేలు, బీబీ హాజ్రా, గ్రామస్తులు వీరారెడ్డి, ఓం రెడ్డి, రాజేందర్ రెడ్డి, శంకర్, మల్లేష్, నిజాం, జనార్దన్ రెడ్డి, నరసింహ, ప్రశాంత్ పాల్గొన్నారు.

విలేకరులపై దాడులకు పాల్పడితే సహించేది లేదు

విశాలాంధ్ర- కొత్తూరు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీసి పత్రికల్లో ప్రచురించి సమస్యల పరిష్కారానికి కృషి చేసే విలేకరులపై దాడులు చేస్తే సహించేది లేదని టియుడబ్ల్యూజే (ఐజేయు), టియుడబ్ల్యూజెఎఫ్ సంఘాల నాయకులు హెచ్చరించారు. నందిగామ మండల ఆదాబ్ హైదరాబాద్ విలేఖరి సందీప్ పై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం బాధితుడు సందీప్‌ని షాద్నగర్ సీనియర్ జర్నలిస్టు, టియుడబ్ల్యూజెఎఫ్ నాయకులు ఎండి కాజా పాషా(కెపి), జిల్లా కమిటీ నాయకులు లక్కాకుల రమేష్ కుమార్, నరసింహారెడ్డి, అంజనేయులు, షాద్నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్, కార్యదర్శి నరేష్, టి యుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, ప్రధాన కార్యదర్శి రమేష్, షాద్నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్ర, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఎన్ టివి నరసింహా, కార్యదర్శి బిగ్ టీవీ ఫయాజ్ లతోపాటు సంఘాలకు అతీతంగా కొత్తూరు, నందిగామ మండలాలకు చెందిన పలువురు జర్నలిస్టులు నందిగామ మండలానికి చేరుకొని సందీప్ ని పరామర్శించి జరిగిన ఘటనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు నందిగామ సిఐ ప్రసాద్‌ను కలుసుకొని జర్నలిస్టు సందీప్ పై జరిగిన దాడి ఘటనపై పూర్తిగా విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏది ఏమైనా ఫిర్యాదులు అందాయని పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని సిఐ ప్రసాద్ భరోసా ఇచ్చారు. సందీప్ పై జరిగిన దాడిపై విచారణ జరిపి న్యాయం చేయాలని, సందీప్ కుటుంబానికి తామందరం అండగా ఉంటామని జర్నలిస్టు సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం షాద్నగర్ నియోజక వర్గ నాయకులతోపాటు కొత్తూరు, నందిగామ విలేకరులు పాల్గొన్నారు.

నల్లగండ్ల మెయిన్‌రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ లోగల నల్లగండ్ల మెయిన్ రోడ్డు పూర్తిగా గుంతల మయమైపోవడంతో వాహనదారులు ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్న నేపథ్యంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే సీసీ ప్యాచ్ వర్క్ పనులను చేపట్టమని ఆదేశించారు. జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులు వెంటనే స్పందించి ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పనులను పరిశీలిస్తూ.. ప్రజలు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, ప్రజాప్రతినిధులు ఇటీవల తన దృష్టికి తీసుకొని రావడంతో వెంటనే అధికారులకు ఆదేశించి నల్లగండ్ల మెయిన్ రోడ్డు సీసీ ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించి పరిశీలించానని పేర్కొన్నారు.

బయ్యారం ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విముఖత

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : బయ్యారం ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విముఖత చూపించడం సరికాదని ఆలిండియా జై హింద్ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దశరథ రామరెడ్డి అన్నారు. బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కనీ అన్నారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని ప్రారంభిస్తే 50 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. అంతేకాకుండా 2 లక్షల కోట్ల రూపాయల పైనే ముడి ఖనిజం ఉందని ప్రభుత్వం అంచనా వేసిందని గుర్తు చేశారు. ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014లో తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కి పొందు పరిచిన విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని ప్రారంభించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. త్వరలో ఇందిరా పార్క్ లో దీక్ష చేపట్టాలన్నట్లు వెల్లడించారు. సర్వయ్య, ప్రొఫెసర్ రమణ, వెంకటేశ్వరరావు, సంగీతం రాజలింగం, డాక్టర్ రాజేష్ కుమార్, నాగేశ్వరరావు, బాల్ రాజు, బాలస్వామి, విజయ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : చందా నగర్ పరిధిలో గల న్యూ గుడ్ షెప్పర్డ్ చెవిటి, మూగ హైస్కూల్ నందు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ విద్యార్థిని, విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ (నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, షార్ప్ నర్లు, ఎరేజర్లు మొదలగునవి) పండ్లు, బిస్కెట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ "మానవుని సర్వతోముఖాభివృద్ధి కేవలం విద్య తోటే సాధ్యం" అని అన్నారు. "ప్రపంచంలో చాలా దేశాల వెనుకబాటు తనానికి కారణం నిరక్షరాస్యత అని భావించి యునెస్కో వారు తేదీ: 08 సెప్టెంబర్ 1967 నుండి అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రపంచమంతటా ఒక ప్రత్యేకమైన నినాదంతో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరపు నినాదం 'డిజిటల్ యుగంలో అక్షరాస్యతను ప్రోత్సహించడం'. దీని ప్రధాన ఉద్దేశ్యం విద్య ప్రాథమిక హక్కుగా, వ్యక్తిగత, సామాజిక అభివృద్ధిలో కీలక భాగమే అని తెలియజేయడం" అని అన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజాల సమస్యలతో సమర్పించిన అర్జీలపై అధికారులు సత్వరమే స్పందించి, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.బి. హరిప్రియలతో కలసి కలెక్టర్ ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన ఆర్జీలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. ప్రజలకు ప్రజావాణి నిర్వహణపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. స్వీకరించిన ఆర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ లో వచ్చిన దరఖాస్తుల పై అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించి పెండింగ్ లేకుండా చూడాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ రోజు ప్రజావాణిలో 86 ఆర్జీలు వచ్చాయని, అందులో ఇందిరమ్మ ఇండ్లు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యా, పౌరసరఫరాల శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

తుది ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు సంబంధించి తుది ఓటర్ల జాబితా సమగ్రంగా సిద్ధం చేసేందుకు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా సెప్టెంబర్ 2, 2025న ప్రచురించామనీ అన్నారు. ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం 139 లొకేషన్ లు, 407 పోలింగ్ స్టేషన్లు ఉండగా 3 లక్షల 92 వేల 669 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ జాబితాను అన్ని రాజకీయ పార్టీలకు అందజేసినట్లు, అలాగే తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్లలో కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను (%దీూాం%) నియమించి, పారదర్శకంగా, ఖచ్చితంగా జాబితా సవరణలో భాగస్వాములు కావాలని పార్టీ ప్రతినిధులను కోరారు. సెప్టెంబర్ 17 వరకు దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం ఉందన్నారు. జూలై 1, 2025 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసుకున్న అర్హులైన పౌరులు, సెప్టెంబర్ 17లోపు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలన్నారు. జాబితాలో ఏమైనా సవరణలు, మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే సెప్టెంబర్ 17లోపు సంబంధిత దరఖాస్తు ఫారాలు సమర్పించాలని చెప్పారు. ఇప్పటి వరకు ఫారం-6, 6ఎ, 7, 8 ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తులు , అభ్యంతరాల్లో 8.62 శాతం దరఖాస్తులను పరిష్కరించామని, మిగతా దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కర్ణన్ తెలిపారు. తుది ఓటర్ల జాబితా సెప్టెంబర్ 30, 2025న ప్రచురించబడుతుందన్నారు. ఎల్.బి.నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రాబాద్ కాంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి విజయవన్ శి, అదనపు కమిషనర్ (ఎలక్షన్స్) మంగళతాయారు హాజరయ్యారు. రాజకీయ పార్టీల తరపున నందేశ్ కుమార్ (బహుజన్ సమాజ్ పార్టీ), పి. వెంకటరమణ, పవన్ కుమార్ (భారతీయ జనతా పార్టీ), విజయ్ మల్లంగి (ఆమ్ ఆద్మీ పార్టీ), ఎం. శ్రీనివాసరావు (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా-మార్క్సిస్టు), రాజేష్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), వై. జయసింహ, కె. మాధవ్ (భారత్ రాష్ట్ర సమితి), కె. జోగేందర్ సింగ్, ప్రశాంత్ యాదవ్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీల మరమ్మత్తులు చేపట్టాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిపిఐ పార్టీ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం పిర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్ మాట్లాడుతూ పిజ్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భారీ వర్షాలకు అన్ని డివిజన్లో దెబ్బతిన్న రోడ్లని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మ్యాన్ వాళ్లను వెంటనే మరమ్మతులు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. అలాగే ప్రధాన రోడ్ల పై ఉన్న ఐమాక్స్ లైట్లు కొన్నిచోట్ల పనిచేయడం లేదని కొన్ని కాలనీలో గుంతలలో నీళ్లు నిలవడం వల్ల దోమల ప్రబలి అంటువ్యాధులు ప్రజలకు బారిన పడే అవకాశం ఉంది కావున వెంటనే ఎక్కడెక్కడ అయితే గుంతలలో నీరు నిలిచాయో వాటిని తొలగించాలని, భగత్‌సింగ్ నగర్ కాలనీలో త్రాగునీరు సక్రమంగా రావడం లేదని వెంటనే కాలనీవాసులకు త్రాగునీరు క్రమం తప్పకుండా నీళ్లు వదలాలని, భగత్ సింగ్ నగర్ కాలనీలో స్ట్రీట్ లైట్ సరిగ్గా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారని మరియు భగత్‌సింగ్ నగర్ కాలనీలో సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడం జరిగినది తెలియజేశారు. జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి జే లక్ష్మి, మేడిపల్లి మండల సహాయ కార్యదర్శిలు సిహెచ్ మాధవి, జి నాగరాజు ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్, బీసీ సంఘం జిల్లా నాయకులు బాపురాజు, కె.ప్రమీల, బి కే యం యు మండల కార్యదర్శి అధ్యక్షులు కే మహాలక్ష్మి, బి ఐలయ్య మేడిపల్లి మండలం సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి, సోమరాజు, ఆండాలు, బొందయ్య, జ్యోతి, రమాతార, నర్సమ్మ, భారతి, మణెమ్మ, రాజమ్మ, నర్సమ్మ, లక్ష్మమ్మ, సరిత, సత్తమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, భావి భారత పౌరులను తయారు చేయాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గత 25 సంవత్సరాలుగా ప్రతి ఏటా గురు పూజోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఆయన అభినంది. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాల గురుపూజోత్సవ వేడుకలకు ఎస్పీ పరితోష్ పంకజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ తన తండ్రి ఒక ఉపాధ్యాయుడని.. సమాజంలో ఒక విద్యార్థి పౌరుడుగా ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మినీ ఇండియాగా పేరుందిన పటాన్ చెరువు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని. వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం పటాన్‌చెరువు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 100 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు 5000 రూపాయలు చొప్పున నగదు పారితోషకాన్ని అందించి అభినందించారు. డీఎస్పీ ప్రభాకర్, రామచంద్రా పురం కార్పొరేటర్ పుష్ప నగర్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీలు దేవానందం, యాదగిరి యాదవ్, మాజీ జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సీఐలు వినాయక రెడ్డి, లాలూ నాయక్, ఎంఈఓలు పీపీ రాథోడ్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు పని భారం పెంచే యాప్స్ రద్దు చేయాలి



విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎం ఉద్యోగులకు తలకు మించిన తీవ్రమైన పని భారాన్ని పెంచుతున్న ఎన్సిడి, యూ-డబ్ల్యూఐఎస్, ఎంసిహెచ్ లాంటి ఆన్‌లైన్ యాప్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ అనుబంధం నేషనల్ హెల్త్ మిషన్ ఏఎన్ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్సిడి ఇతర ఆన్ లైన్ యాప్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎం ఉద్యోగులు భారీ ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయికి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ కృష్ణకి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి అంటు వ్యాధులు ప్రబలకుండా కావలసిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యం మెరుగు పడటానికి ముందస్తు జాగ్రత్తలతో పాటు అవగాహన కల్పించడానికి, చిన్నపిల్లలకు టీకాలు వేయడానికి ఏఎన్ఎంలను ఉద్యోగాల్లోకి తీసుకున్నారని అన్నారు. కానీ కాలక్రమేనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గత కొంతకాలంగా వీరు చేసే పనుల రిపోర్టును ఆన్‌లైన్‌లో పంపించాలని రెండు యాప్‌లతో అలవాటు చేసి ప్రస్తుతం 14 రకాల మొబైల్ అప్లికేషన్స్ యాప్స్ పూర్తి చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూడబ్ల్యూఐఎస్ యాప్ అప్లోడ్‌కి సంబంధించి రాత్రి పదకొండు గంటల నుండి మధ్యరాత్రి 1 గంటల వరకు మధ్యలోనే పనిచేస్తుందని దీనితో ఏఎన్ఎంలు రాత్రంతా మేల్కొని పనిచేయాల్సి వస్తుందని అన్నారు. ఆఫ్‌లైన్ ఆన్‌లైన్‌లలో తీవ్రమైన పని ఒత్తిడితో ఏఎన్ఎంలు బీపీ షుగర్ లాంటి వ్యాధులతో అనారోగ్యాలతో పాటు కంటి చూపు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం అధికారులు ఏఎన్ఎం లకు ఆన్ లైన్ యాప్‌లు రద్దుచేసి పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం ఉద్యోగులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయమ్మ నేతలు ఏఎన్‌ఎంలు నజ్మతుల్లా, లలిత, అంజమ్మ, పద్మజ, అన్నపూర్ణ, వెంకటేశ్వరమ్మ, గౌరీ, రేణుక, సునీత, విజయలక్ష్మి, కళావతి, సరిత, సుజాత, సుగుణ, పద్మావతి, మౌనిక, జానకమ్మ, సత్యమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

10న ముస్లిం రిజర్వేషన్ల సాధనకై చలో చార్మినార్

విశాలాంధ్ర - బషీర్ బాగ్: ముస్లిం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని ఈనెల 10న చలో చార్మినార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఇంక్విలాబ్ సేనా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం ఎం హుస్సేన్ తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. రిజర్వేషన్లు అమలు చేసినట్లయితే విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ముస్లింలు ముందుంటారని అన్నారు. ఎల్లుండి నిర్వహించే మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తుంగతుర్తి రవి

విశాలాంధ్ర- మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో ప్రమాదవశాత్తు ఒక గుడిసెలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గుడిసెలో ఉన్న కొన్ని నిత్యవసర సరుకులు పాక్షికంగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి సోమవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్వి ఫౌండేషన్ ద్వారా తక్షణసాయంగా బాధ్యత కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని తుంగతుర్తి రవి అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ దేవుడి పూజలో వెలిగించిన దీపం కారణంగా మంటలు వ్యాపించాయని చుట్టుపక్కల వాళ్ళు గమనించి మంటలు ఆర్పడంతో భారీ ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. కాలనీలో మంచినీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థసరిగ్గా లేకపోవడం, వీధి దీపాలు లేకపోవడం, కరెంటు వైర్లపై చెట్టుకొమ్మలు పడడం తదితర సమస్యలను గమనించిన తుంగతుర్తి రవి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి భగత్ సింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం డి మజార్, బర్రె నాగరాజు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

హింద్వేర్ ఇటాలియన్ కలెక్షన్ నుంచి కొత్త రకం టైల్స్

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : తనదైన బ్రాండ్ హింద్వేర్ ఇటాలియన్ కలెక్షన్ టైల్సునుంచి కొత్త రకమైన టైల్స్‌ను లాంచ్ చేసింది. గురుగ్రామ్ లోనిహయత్ మనేసర్ లో హింద్ వేర్ లిమిటెడ్ బాత్ అండ్ టైల్స్ చీఫ్ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిరుపమ్ సహాయ్, ఇంకా పంకజ్మెడిరట్టా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, హింద్వేర్ టైల్స్ అరుణిమా యాదవ్, వైస్ ప్రెసిడెంట్, హెడ్ ఆఫ్మార్కెటింగ్, హింద్వేర్, బాత్ టైల్స్, హాజరైన భాగస్వాములసమావేశంలో ఈ కొత్త రకం టైల్స్ ను ఆవిష్కరించారు. ఈ చాలా రకాలతో కూడుకొని ఉన్న పోర్ట్ఫోలియో భారతీయఇంటీరియర్స్ మార్కెట్లో హింద్వేర్ యొక్క స్థానాన్ని బలపరుస్తుంది, కొత్త శకానికి తగ్గటుగా అధునాతన టైల్ సొల్యూషన్లకుపెరుగుతున్న డిమాండ్ కు అనుగుణంగా అందిస్తుంది. తెలుపు రంగులో లభించే ఇదిసిమెంట్ ఆధారిత స్క్రీడ్లు, మోర్టార్లు, ప్లాస్టర్లు ఇతరసిమెంట్ సబ్స్ట్రేట్లకు అనుగుణంగా కూలంగా ఉంటుంది. ఈ సందర్భంగా హింద్వేర్ లిమిటెడ్ బాత్ అండ్ టైల్స్ చీఫ్ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిరుపమ్ సహాయ్ మాట్లాడుతూ, "హింద్వేర్ ఇటాలియన్ కలెక్షన్ టైల్స్ భారతీయఇంటీరియర్స్ మార్కెట్ కు అన్ని సొల్యూషన్స్ అందించడంతో తనస్థానాన్ని బలోపేతం చేసుకుంది. ఇంటిగ్రేటెడ్సొల్యూషన్స్ కు డిమాండ్ పెరగడంతో హింద్వేర్ ఎల్లప్పుడూఇన్నోవేషన్, క్వాలిటీ, నమ్మకంతో ముందుకు వెళ్తుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-జవహర్‌నగర్ : ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాల కారణంగా జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 28 డివిజన్లో దెబ్బతిన్న రోడ్లు డ్రైనేజీ వీధి దీపాలు తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమం కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జవహర్‌నగర్‌లో భారీ వర్షాల కారణంగా అనేక కాలనీలో రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ మాట్లాడుతూ చెన్నాపురం నుండి వికలాంగుల కాలనీ వరకు వీధిదీపాలు వేసి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు. వర్షాల కారణంగా రోడ్లు తెగి నానా అవస్థలు పడుతున్న ప్రజలు తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, ఏఐటిసి మండల అధ్యక్షుడు ఏ ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, సిపిఐ నాయకులు కే కురుమయ్య, సూర్యం, కే గంగారం, రాజు నాయక్, డి మల్లిక, నాగేష్, సురేష్, సాకలి నరసింహ, కిరణ్ కుమార్, అర్జున్, ఏఐటియుసి నాయకులు కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో సురవరం కృషి మరువలేనిది

- గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్
- సురవరం సుధాకరరెడ్డి పేరిట గ్రంథాలయం ప్రారంభం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక వహించిన సీపీఐకి ప్రత్యేక రాష్ట్ర చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానం ఉంటుందని, ఇందులో కమ్యూనిస్టు అగ్రనాయకులు సురవరం సుధాకరరెడ్డి కృషి మరువలేనిదని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయపరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ అధ్వర్యంలో నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లోని మాజీ కేంద్ర మంత్రి ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో సోమవారం సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ జరిగింది. సీపీఐ జాతీయ కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కే నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ , మాజీ ఎమ్మెల్సీ పి.జె.చంద్రశేఖర్ రావు , సీఆర్ ఫౌండేషన్ అధక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కోశాధికారి వీ చెన్న కేశవరావు, సురవరం సుధాకరరెడ్డి సతీమణి డా. బీవీ విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ముఖ్యఅతిథి డాక్టర్ రియాజ్ ప్రారంభించారు. గ్రంథాలయం లోగోను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆవుల మంజులత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి లాంటి గొప్ప నాయకుడి పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించడం తన అదృష్టం అన్నారు. చిన్నతనంలో విన్న సీపీఐ నాయకులు నల్లమల్ల గిరిప్రసాద్ ఉపన్యాసం తనపై చెరగని ముద్ర వేసిందన్నారు. సీపీఐ అధ్వర్యంలో నాడు సోవియట్ పత్రిక వచ్చేదని... దానిని చూసిన ప్రతిసారీ భూతల స్వర్గమైన ఆ దేశ భూభాగంపై ఏనాటికైనా అడుగు పెట్టాలనే కోరిక బలంగా ఉండేదన్నారు. అలాంటి సోవియేట్ యూనియన్ పతనం మానవ నాగరికతలోనే ఓపెద్ద విషాదమన్నారు. ఆ దేశం విచ్ఛిన్న కాకపోయి ఉంటే ప్రపంచానికే ఆదర్శంగా ఉండడంతో పాటు భారత దేశానికి ఓ స్ఫూర్తిగా నిలిచేందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ చరిత్రలో కమ్యూనిస్టులు చేసిన అసాధారణ ఉద్యమాలు, త్యాగాలు ఏ పార్టీలు, నాయకులు చేయలేదన్నారు. ప్రగతిశీల శక్తులే సమాజాన్ని ముందుండి నడిపిస్తాయన్నారు. సీపీఐ అంటే తనకు ప్రత్యేక అభిమానమని, పిడివాదంతో కాకుండా లిబరల్‌గా ఉండడం ఇందుకు కారణమని చెప్పారు. కగార్ అపరేషన్‌కు వ్యతిరేకంగా మొట్టమొదట సీపీఐ గళమెత్తిందని, ఇది దేశ వ్యాప్తంగా ప్రభావం చూపిందని ఆయన పేర్కొన్నారు.మత మౌఢ్యం పెచ్చరిల్లుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజల వాటి బారిన పడకుండ చైతన్యవంతులను చేసేందుకు అభ్యుదయ రచయితల సంఘం వంటివి చాల అవసరమని రియాజ్ పేర్కొన్నారు. సమాజంపై సాహిత్యం ప్రభావం ఎంతో ఉంటుందని, ఇందుకు ఇలాంటి అభ్యుదయవాదులందర్నీ ఒక చోటికి చేరి ప్రోత్సహించాలని ఈ బాధ్యతను సీపీఐ తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరముందన్నారు. అంతకుముందు సభాధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు నేత అని, దేశ రాజకీయాల్లోనే కాకుండా విద్యార్థి, యువ జన నాయకుడుగా అంతర్జాతీయ రాజకీయాల్లో సైతం క్రియాశీల పాత్ర పోషించారన్నారు. ఆయన ఎంత సౌమ్యుడో రాజకీయ, సైద్ధాంతిక అంశాల్లో అంత నిక్కచ్చిగా ఉండేవారన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి అంటే ఓ విజ్ఞాన గని అని కొనియాడారు. తన ప్రసంగాల ద్వారా లక్షలాది మందిని ఆకట్టుకోవడం ద్వారా వేలాది మందిని కమ్యూనిస్టులను తయారు చేశారని అందులో తను ఒకడినని పేర్కొన్నారు. సురవరం మచ్చలేని నాయకుడని, కమ్యూనిస్టు పార్టీ కీర్తి ప్రతిష్టను పతాక స్థాయికి చేర్చిన గొప్ప నేత అన్నారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ సువరం సుధాకర్‌రెడ్డి జీవితం తెరిచిన పుస్తకమని, ప్రతి ఒక్కరితో కలిసి పోయే మానవతా వాది అని కొనియాడారు. పార్లమెంట్ సభ్యులుగా ఆయన అనేక అవినీతి కుంభకోణాలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పనలోక్రియాశీలక పాత్ర పోషించారన్నారు. దేశ వ్యాప్తంగా జాతీయ ఉపాధి హామి పథకం రూపకల్పనలో కీలక భూమిక వహించారని... ఇప్పుడు ఆ పథకం వల్ల దేశంలో కోట్లాది మందికి ఉపాధి దొరుకుతోందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ ప్రజా సంఘాల నిర్మాణం, ఉద్యమాల్లో సురవరం సుధాకరరెడ్డి కృషి ఎప్పటికీ మరువలేనిదన్నారు. ప్రజా సంఘాలే పార్టీకి కీలకమని భావించే ఆయన వాటి బలోపేతానికి అందించిన సహాయ సహకారాలు నిర్మాణాత్మకంగా ఉంటేవని చెప్పారు. సురవరం సుధాకరరెడ్డి సతీమణి బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే ప్రజా సమస్యలను పరిష్కారం అవుతాయని సురవరం సుధాకరరెడ్డి బలంగా విశ్వసించే వారన్నారు. ఆయన నిత్య అధ్యయశీలుడన్నారు. ఆరోగ్యం బాగున్నా లేకపోయినా తన అధ్యయనాన్ని మాత్రం ఎప్పుడు మరువలేదన్నారు. అలాంటి వ్యక్తి పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేయడం సముచిత నిర్ణయమని ఆనందం వ్యక్తంచేశారు. ప్రముఖులు జె. కల్పన కవిత, డాక్టర్ కె.ప్రతిభ, డాక్టర్ రజని, ఏబీకే ప్రసాద్, నర్సారెడ్డి, పూర్ణచందర్‌రావు, చంద్రకాంత్, తమ్మారెడ్డి భరద్వాజ, రమేశ్‌బాబు,ఆవుల మంజులత మాట్లాడుతూ... సురవరం సుధాకరరెడ్డితో తమకు అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

బీఆర్ఎస్ వైఖరి ఆత్మహత్యాసదృశ్యం: నారాయణ

ప్రతిష్టాత్మకంగా ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికలలో బీఆర్ఎస్ తటస్థ వైఖరి తీసుకోవడం అత్యంత విచారకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం తెలంగాణ ప్రజలను మోసం చేయడమే అవుతుందని విమర్శించారు. తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సహకరించిన వ్యక్తి అని, అనేక చారిత్రాత్మక తీర్పులు ఇచ్చిన న్యాయకోవిదుడు అని అన్నారు. అలాంటి వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తుంటే తటస్థంగా ఉండడమంటే బీఆర్ఎస్ ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందని నారాయణ అన్నారు. ఏ తెలంగాణ పేరు చెప్పి, ప్రజల సెంటిమెంట్ ఉపయోగించుకొని కేసీఆర్ రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారని, అలాంటిది తెలంగాణ బిడ్డకు ఓటు వేయకుండా గైర్హాజరవడమంటే తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని ధ్వంసం చేయడమే అవుతుందన్నారు

బీఈడీ, లాసెట్లకు కౌన్సెలింగ్ షెడ్యూలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఎడ్‌సెట్-2025, లాసెట్, పీజీ లాసెట్, పీఈ సెట్ల కౌన్సెలింగ్ షెడ్యూలును ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ప్రతి సెట్‌కు రెండు విడతలుగా కౌన్సెలింగ్‌లు నిర్వహించనుంది. తొలుత ఏపీ లాసెట్, పీజీ లాసెట్ ప్రవేశాలను సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి టీవీ శ్రీకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాసెట్, పీజీ లాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్లను ఈనెల 11 వరకు నిర్వహిస్తారు. 9వ తేదీ నుంచి 12 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. వెబ్ ఐచ్ఛికాల నమోదుకు ఈ నెల 12 నుంచి 14 వరకు గడువు విధించారు. 15వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించారు. 17న సీట్లను ఖరారు చేస్తారు. 19 నుంచి కళాశాలల్లో చేరికలు ఉంటాయి. ఏపీ ఎడ్‌సెట్ 2025 కౌన్సెలింగ్ షెడ్యూలు వివరాలిలా ఉన్నాయి. బీఈడీలో ప్రవేశాలకు ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్లను ఈనెల 9 నుంచి 12 వరకు నిర్వహిస్తారు. 10 నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 13 నుంచి 15 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదు ఉంటుంది. 16న ఐచ్ఛికాల మార్పునకు అవకాశం కల్పిస్తారు. 19, 20 తేదీల్లో సీట్ల కేటాయింపు, కళాశాలల్లో చేరికలు ఉంటాయి. ఏపీ పీఈసెట్‌కు 10 నుంచి 13 వరకు రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తారు. 11 నుంచి 14 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుంది. 14 నుంచి 16 వరకు వెబ్ ఐచ్ఛికాల నమోదు ఉంటుంది. ఐచ్ఛికాల మార్పునకు ఈనెల 17 వరకు అవకాశం కల్పించారు. 19న సీట్ల కేటాయింపు ఉంటుంది. 22, 23 తేదీల్లో కళాశాలల్లో చేరికలు ఉంటాయి.

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రవాసాంధ్రుల ఆత్మీయ సదస్సులో మంత్రి కొండపల్లి

విశాలాంధ్ర - సచివాలయం: రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాసాంధ్రులు కీలక పాత్ర పోషించాలని, సృజనాత్మక ఆలోచనలతో తమ స్వగ్రామాలలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల రూపంలో అభివృద్ధికి పాటుపడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వారం రోజులు పాటు స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న మంత్రి కొండపల్లి ... జ్యూరిచ్‌లోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్విట్జర్లాండ్ అధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతూ వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవాసాంధ్రులు పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. తమ మాతృభూమితో నిత్యం సంబంధాలు కొనసాగిస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

'సృష్టి' కేసులో ముగ్గురు ప్రభుత్వ వైద్యుల సస్పెన్షన్

విశాలాంధ్ర -సచివాలయం: హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడపబడుతూ సంతాన సాఫల్య సేవల్లో అక్రమాలకు సంబంధించిన 'సృష్టి' కేసులో ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులకు చెందిన ముగ్గురు వైద్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారంలో ఆంధ్ర మెడికల్ కాలేజి- విశాఖపట్నంలో ఎనస్థిషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి, గైనకాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.ఉషాదేవి, శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో పిడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ. విద్యులత లపై గత నెలలో ఆరోపణలు వచ్చాయి. వీరు ముగ్గురిపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సరోగమి చట్టం జువినైల్ జస్టిస్ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు గత నెల 28న హైదరాబాద్ పోలీసులు అధికారికంగా తెలిపారు. ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఈ ముగ్గురు వైద్యులపై కేసులు నమోదైన నేపథ్యంలో వారిని సస్పెండ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలిచ్చారు.

కేన్సర్‌కు చైనా కొత్త ఔషధం

బీజింగ్: అత్యంత ప్రమాదకరమైన ఊపిరితిత్తుల కేన్సర్‌కు చైనా కొత్త ఔషధం కొనుగొన్నది. ప్రపంచవ్యాప్తంగా యేటా సుమారు 18 లక్షల మంది ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణిస్తున్నారని, ఇది కేన్సర్ సంబంధిత మరణాలకు ప్రధాన కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ)) నివేదికలు సూచిస్తున్నాయి. అత్యంత వేగంగా వ్యాపించే స్మాల్-సెల్ లంగ్ కేన్సర్ చికిత్స కోసం చైనా పరిశోధకులు అభివృద్ధి చేసిన ఓ కొత్త యాంటీబాడీ ఔషధం తొలి దశ క్లినికల్ ట్రయల్స్‌లోనే అద్భుత ఫలితాలు కనబరిచింది. ఈ వ్యాధికి పరిమిత చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఈ కొత్త ఆవిష్కరణ వైద్య ప్రపంచంలో సరికొత్త ఆశలు నింపుతోంది. చైనాలోని షాన్‌డాంగ్ ఫస్ట్ మెడికల్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ లిన్లిన్ వాంగ్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధన నిర్వహించింది. ఎస్‌హెచ్ఆర్-4849 (ఐడీఈ 849) అనే ఈ యాంటీబాడీ-డ్రగ్ కాంజుగేట్‌ను మొత్తం 54 మంది రోగులపై ప్రయోగించారు. కేన్సర్ కణాలపై ఉండే డీఎల్ఎల్ 3 అనే ప్రొటీన్ లక్ష్యంగా ఈ ఔషధాన్ని రూపొందించారు. పరిశీలనకు అర్హులైన 42 మంది రోగులలో ఈ ఔషధం దాదాపు 59.5 శాతం మందిలో కేన్సర్‌పై సానుకూలంగా స్పందించింది. అంతేకాకుండా 90.5 శాతం మందిలో వ్యాధిని విజయవంతంగా నియంత్రించినట్లు పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ప్రకారం 2.4 ఎంజీ/కేజీ మోతాదు తీసుకున్న రోగులలో స్పందన రేటు ఏకంగా 77.8 శాతంగా నమోదైంది. ఈ ఔషధం వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు కూడా నియంత్రించగలిగే స్థాయిలోనే ఉన్నాయని పరిశోధకులు తెలిపారు. తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గడం, రక్తహీనత, వికారం వంటి సాధారణ సమస్యలు కనిపించినప్పటికీ... వీటి కారణంగా ఎవరూ చికిత్సను మధ్యలో ఆపలేదని లేదా ప్రాణాపాయం కలగలేదని స్పష్టం చేశారు. ఈ ప్రోత్సాహకరమైన ఫలితాలను ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ది స్టడీ ఆఫ్ లంగ్ కేన్సర్ (ఐఏఎస్ఎల్‌సీ) 2025 ప్రపంచ సదస్సుకు సమర్పించారు. 'ఈ ప్రాథమిక ఫలితాలు మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయి. డీఎల్ఎల్ 3 పాజిటివ్ స్మాల్-సెల్ లంగ్ కేన్సర్ రోగులకు ఎస్‌హెచ్ఆర్-4849 మోట్ మంచి చికిత్సా విధానంగా మారే అవకాశం ఉంది' అని డాక్టర్ వాంగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రెండో దశ ప్రయోగాలకు అవసరమైన మోతాదును నిర్ధారించే పనిలో ఉన్నామని, త్వరలోనే దీనిపై మరింత స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు.

ఏసీ పేలి ముగ్గురు కుటుంబ సభ్యుల మృతి

ఫరీదాబాద్: హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఓ కుటుంబానికి అర్ధరాత్రి కాళరాత్రి అయింది. ఏసీ పేలి కుటుంబ సభ్యులు నిద్రలోనే మృతిచెందారు. నాలుగు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తులో ఏసీ పేలి భార్యాభర్తతో పాటు కుమార్తె ప్రాణాలు కోల్పోయారు. పెంపుడు కుక్క కూడా చనిపోయింది. దీంతో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం తెల్లవారుజామున 1:30 గంటలకు ఒక్కసారిగా ఏసీ పేలి భారీ పేలుడు సంభవించింది. పెద్దఎత్తున మంటలు ఎగిసిపడి రెండవ అంతస్తు వరకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కుటుంబంలోని ముగ్గురు సభ్యులతో పాటు పెంపుడు కుక్క ప్రాణాలు కోల్పోయింది. కుమారుడు కిటికీ నుంచి కిందకు దూకేశాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. మృతులను సచిన్ కపూర్, అతని భార్య రింకు కపూర్, కుమార్తె సుజన్ కపూర్‌గా గుర్తించారు. ఏసీ పేలిపోయాక పొగలు వ్యాపించాయి. ఊపిరాడక పోవడంతోనే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మరో గదిలో నిద్రిస్తున్న కొడుకు మాత్రం కిటికీలోంచి దూకేశాడు. భారీ పేలుడు సంభవించడంతో ఇరుగుపొరుగు వారు చేరుకుని పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. నాల్గో అంతస్తులో ఏడుగురు సభ్యుల కుటుంబం నివసిస్తుందని, మూడవ అంతస్తును కపూర్ కార్యాలయంగా ఉపయోగించుకున్నారని స్థానికులు చెప్పారు.

ఎకరాకు రూ.20 వేల పరిహారం: పంజాబ్

చండీగఢ్: వరదలకు నీటి మునిగి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల పరిహారం అందించనున్నట్లు పంజాబ్ ప్రభుత్వం ప్రకటించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు తీవ్ర నష్టం మిగిల్చాయి. ముఖ్యంగా పంజాబ్‌లో ఎడతెరపి లేకుండా వర్షాలు పడటంతో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది. పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టం నీటి పాలైందని రైతులు తలలు పట్టుకున్నారు. దాంతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు పంజాబ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీట మునిగిన ప్రతి ఎకరా పంటకు రూ.20 వేల చొప్పున పరిహారం చెల్లించాలని నిర్ణయించింది. పంజాబ్ సీఎం కార్యాలయం సోమవారం అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది.

పంజాబ్‌కు ప్రత్యేక సహాయ ప్యాకేజీ

- వరద బాధితులను తక్షణం ఆదుకోవాలి
- హోంమంత్రి అమిత్‌షాకు సీపీఐ ఎంపీ సంతోశ్‌కుమార్ లేఖ

న్యూఢిల్లీ: వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న పంజాబ్‌కు తక్షణం ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని సీపీఐ ఎంపీ సంతోశ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. పంజాబ్‌లోని ఫజిల్కా జిల్లాలో అసాధారణ రీతిలో సంభవించిన వరదలు కలిగించిన అపార నష్టాన్ని తాను చూశానని తెలిపారు. వ్యవసాయ భూములన్నీ నీటమునిగి తీవ్రంగా పంట నష్టం జరిగింది. పశు వులు చనిపోవడంతోపాటు ఆయాప్రాంతాల ప్రజలు ఇళ్లు సైతం కోల్పోయారు. జల దిగ్బంధంలో ఉండిపోవాల్సి వచ్చింది. జీవనోపాధి కోల్పోవడంతో పాటు అపారిశుధ్యం కారణంగా వారిని వ్యాధుల భయం వెంటాడుతోంది. సర్వం కోల్పోయిన రైతుల నిరాశ, ఆశ్రయం కోల్పోయి జీవనోపాధి కోసం వెతుకుతున్న కుటుంబాల నిస్సహాయత నన్ను తీవ్రంగా బాధించింది. బాధితులకు సహాయం అందిస్తున్న అనేక స్వచ్ఛంద సేవకులతో కూడా నేను మాట్లాడాను.ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, భారత సైన్యం, ఇతర సంస్థలు క్లిష్ట పరిస్థితుల్లో అవిశ్రాంతంగా పనిచేస్తున్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీతో సహా ప్రజాసంఘాలు కలిసి పనిచేస్తున్నాయి.

ప్రాణాలను కాపాడటంలో, ముంపులో ఉన్న గ్రామాలకు ఆహారం మరియు మందులను చేరవేయడంలో వారు చూపుతున్న తెగువ అత్యంత ప్రశంసనీయం. అయినప్పటికీ ఈ విపత్తు స్థాయి ప్రస్తుతం అందుబాటులో ఉన్న సహాయాన్ని మించిపోయింది. ఫజిల్కా, గురుదాస్‌పూర్, అమృత్‌సర్, కపుర్తలా, ఫిరోజ్‌పూర్, తర్న్ తరణ్, హొషియార్‌పూర్, లూథియానా, మాన్సా, పాటియాలా గ్రామాలు నీట మునిగిపోయాయి. సర్వం కోల్పోయిన లక్షలాది మంది ప్రజలు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితులలో అత్యవసరంగా మరియు కరుణతో వ్యవహరించాలని సంతోశ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పంజాబ్ సాధారణ కేటాయింపులకు మించి భారీగా సహాయ నిధులు వెంటనే విడుదల చేయాలి. అలాగే పంట, పశువుల నష్టాలు, ఇళ్లు, జీవనోపాధిని కోల్పోయిన కుటుంబాల పునరావాసం కల్పించేలా సమగ్ర సమాయ ప్యాకేజీ కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తదుపరి పంట సీజన్ కోసం సబ్సిడీ ధరలకు విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ ముడిసరుకు సరఫరా చేయడం ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంటువ్యాధులను నివారించడానికి ఆరోగ్య సేవలను ముమ్మరం చేయడం, పాఠశాలలు, ప్రజా సౌకర్యాల పునరుద్ధరణ, వరదల వల్ల దెబ్బతిన్న సామాజిక మరియు ఆర్థిక వ్యవస్థను సకాలంలో పునర్నిర్మించడం కూడా ముఖ్యమని కేంద్రప్రభుత్వానికి సూచించారు. పంజాబ్ ప్రజలకు ఇవన్నీ సకాలంలో అందేలా వ్యక్తిగతంగా జోక్యం చేసుకోవాలని అమిత్‌షాను కోరారు.

ఎల్‌డీఎఫ్ సర్కార్ పోలీసు విధానాలు వ్యతిరేకించే

అధికారులకు కఠిన శిక్ష తప్పదు

- సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం

అలప్పుజ: వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వ పోలీసు విధానానికి వ్యతిరేకంగా వ్యవహరించే అధికారులు కఠిన శిక్షను ఎదుర్కొంటారని సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం స్పష్టం చేశారు. సోమవారం ఇక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఏదైనా సమస్య తలెత్తినప్పుడు సరైన విచారణ లేకుండా తక్షణ చర్య తీసుకోలేమని విశ్వం అన్నారు. 'పోలీసు అధికారులపై ఫిర్యాదులు వచ్చిన సందర్భాల్లో ప్రభుత్వం దర్యాప్తు నిర్వహిస్తుంది. ఆ అధికారి దోషిగా తేలితే కఠిన చర్య తీసుకుంటారు. అటువంటి అధికారులను నియంత్రణలోకి తీసుకురాగల సామర్థ్యం ప్రభుత్వం కలిగి ఉంది' అని పేర్కొంటూ... కస్టడీ అణచివేతను ప్రతిఘటించి ఓడించడం ద్వారా వామపక్షాలు అధికారంలోకి వచ్చాయని అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నాయకుడిని రహస్యంగా సందర్శించిన అదనపు పోలీసు డైరెక్టర్ జనరల్ (ఏడీజీపీ) తో సహా అధికారులు ఎల్‌డీఎఫ్ పోలీసు విధానం సారాంశాన్ని అర్థం చేసుకోలేదని ఆయన అన్నారు. 'ప్రభుత్వ పోలీసు విధానాన్ని పాటించని అధికారులు ఇప్పటికీ పోలీసు దళంలో ఉన్నారు. అందుకే ఒక పోలీసు అధికారి ఆర్ఎస్ఎస్ నాయకుడిని కలవడానికి వెళ్లాడు' అని వినయ్ విశ్వం అన్నారు. ఏడీజీపీ ఎం.ఆర్.అజిత్ కుమార్‌ను శాంతిభద్రతల బాధ్యత నుంచి తొలగించారని సీపీఐ నాయకుడు పేర్కొన్నారు. 'త్రిస్సూర్ పూరం సందర్భంగా అల్లర్లు, మంత్రి ఫోన్ కాల్‌కు ఏడీజీపీ సమాధానం ఇవ్వడంలో వైఫల్యం వంటి సంఘటనలను కేరళ చూసింది. ఇంత తీవ్రమైన లోపాలు చేసిన వ్యక్తి కేరళలో పోలీసు ఉన్నత స్థాయికి ఎదగడు' అని ఆయన అన్నారు. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు నిర్వహిస్తున్న గ్లోబల్ అయ్యప్ప సంగమంలో భక్తులు పాల్గొనవచ్చని వినయ్ విశ్వం అన్నారు. 'అయ్యప్పను రాజకీయ వివాదానికి కేంద్రంగా మార్చడంలో సీపీఐకి ఆసక్తి లేదు. అయ్యప్పను రాజకీయాల్లోకి తీసుకురావడం సీపీఐ విధానం కాదు. అయ్యప్ప, భక్తి విషయాలు భక్తుల హక్కులు. అయ్యప్ప ప్రజల దేవుడు. శబరిమల వెళ్లేవారికి ఒక సాధారణ దుస్తుల నియమావళి ఉంది. ఒక ప్రతిజ్ఞ ఉంది. ముందుకు సాగే ముందు వారు వావర్ మసీదును సందర్శించి పెట్ట తుల్లాల్ ఆచారంలో పాల్గొంటారు. ఈ దేవతకు దాని స్వంత ప్రత్యేక సంప్రదాయాలు ఉన్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ భక్తుల హక్కులను, వారి మత విశ్వాసాలను గౌరవిస్తుంది' అని ఆయన అన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభకు ఏర్పాట్లు పూర్తి

అలప్పుజలో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభకు సన్నాహాలు పూర్తయినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం తెలిపారు. ప్రతినిధుల సమావేశం జరిగే వేదికకు టార్చ్ రిలే ర్యాలీ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు వాయలార్ అమరవీరుల స్మారక చిహ్నం నుంచి ప్రారంభమవుతుంది. దీనిని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.చంద్రశేఖరన్ ప్రారంభిస్తారు. ప్రతినిధుల సమావేశం ఎస్.కె.కన్వెన్షన్ సెంటర్, కలర్‌కోడ్, (కణం రాజేంద్రన్ నగర్) సెప్టెంబరు 10 నుంచి 12 వరకు. బుధవారం (సెప్టెంబరు 10) ఉదయం 10.45 గంటలకు దీనిని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభిస్తారు. 39 మంది ప్రత్యేక ఆహ్వానితులు సహా 528 మంది ప్రతినిధులు పాల్గొంటారు. పార్టీ యూట్యూబ్ ఛానల్ 'కనల్' ను సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు కె.నారాయణ ప్రారంభిస్తారు. సెప్టెంబరు 10న సాయంత్రం 5 గంటలకు ఎస్.కె కన్వెన్షన్ సెంటర్‌లో 'లౌకికవాదం-సమాఖ్యవాదం భవిష్యత్' అనే అంశంపై సదస్సు జరుగుతుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రారంభిస్తారు. కార్యకర్త, నటుడు ప్రకాశ్ రాజ్ కీలకోపన్యాసం చేస్తారు. సెప్టెంబరు 12న మధ్యాహ్నం 3 గంటలకు ముప్పాలంలో వాలంటీర్ కవాతు జరుగుతుంది. తరువాత సాయంత్రం 4.30 గంటలకు అలప్పుజ బీచ్ (అతుల్ కుమార్ అంజన్ నగర్) లొ బహిరంగ సభ జరుగుతుంది. దీనిని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభిస్తారు.

పరిశ్రమలే లక్ష్యం

- 99 పైసలకే భూ కేటాయింపు
- టీసీఎస్ ద్వారా 25 వేల ఉద్యోగాలు
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో విద్యా, ఐటీ శాఖల మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి పరిశ్రమలు రప్పించేందుకు మెరుగైన ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా 99 పైసలకే భూమి కేటాయిస్తున్నామని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. రాష్ట్రానికి సీఎం చంద్రబాబు అనే బ్రాండ్ అంబాసిడర్ ఉన్నారని , ఆ బ్రాండ్‌తోనే దేశంలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారం, డాటా సెంటర్లు, ఐటీ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని చెప్పారు. కోయంబత్తూరులో 'ఎట్రాక్టింగ్ ఇన్వెస్టిమెంట్ ఫర్ ద సన్ రైజ్ స్టేట్' అంశంపై ప్రముఖ మీడియా సంస్థ ఇండియా టుడే నిర్వహించిన కాంక్లేవ్‌లో మంత్రి లోకేశ్ సోమవారం ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు 15 నెలలుగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మంత్రి వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సీనియర్ జర్నలిస్టు రాజ్ దీప్ సర్దేశాయ్ సంధానకర్తగా వ్యవహరించారు. లోకేశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో మేం ఇచ్చిన సూపర్-6 హామీల్లో ప్రధానమైది... యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన అని, దాని లక్ష్యసాధన కోసం మేం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. టీసీఎస్ సంస్థ 25 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని, ఆ సంస్థకు 99 పైసలకే భూమి కేటాయిస్తే తప్పేమిటి?, కర్నాటక, తమిళనాడు, కేరళ, యూపీ వంటి రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను రప్పించడానికే తక్కువ ధరకు భూమి, ఇతర రాష్ట్రాల కంటే మెరుగైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లో విమానాశ్రయ నిర్మాణానికి 5 వేల ఎకరాలు ఎందుకని అప్పట్లో చాలామంది రాజకీయ ప్రత్యర్థులు విమర్శించారని, శంషాబాద్ విమానాశ్రయం దేశంలోనే అత్యుత్తమ పోర్టుల్లో ఒకటిగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరుగా మారిందని, విజనరీ లీడర్ చంద్రబాబు ముందుచూపు వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. విమానాశ్రయం ట్రాఫిక్ రద్దీని తట్టుకునేందుకు ఇప్పుడు బెంగళూరులో రెండో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారని తెలిపారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి భారత్ ఫస్ట్ అనే నినాదానికే మేం కట్టుబడి ఉన్నామని, దేశాన్ని ముందుండి నడిపించే నాయకత్వానికే తాము మద్దతు ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ అభ్యర్థికి టీడీపీ మద్దతు ఇస్తుందని, ఎన్డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ప్రకటించగానే ఢిల్లీలో సీపీఆర్‌ను కలిసి అభినందించామని వివరించారు. భారత్ మల్టీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఆవిష్కృతమవున్న తరుణంలో పారదర్శక రాజకీయాలు అవసరమని తాము బలంగా విశ్వసిస్తున్నామని, రాజకీయ నాయకులపై ఉన్న కేసులకు సంబంధించి ఏడాదిలోగా విచారణ పూర్తి చేసి... తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టు గతంలో మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. మేము కొత్తగా ఏర్పడిన రాష్ట్రమైనప్పటికీ పెట్టుబడుల ఆకర్షణలో ఇతర అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతున్నామన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలతో పాటు ఇతర ప్రముఖ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని, స్పేస్ సెక్టార్ అభివృద్ధికి ఇటీవల 200 ఎకరాల భూమి కేటాయించామని తెలిపారు. అమరావతి నిర్మాణానికి రైతుల అంగీకారంతో 35 వేల ఎకరాలను సమీకరించామని, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టామని వివరించారు. జనవరిలో అమరావతికి దేశంలోనే మొట్టమొదటి 158 బిట్ క్వాంటమ్ కంప్యూటర్ రాబోతోందని, త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నామని, రాష్ట్రాభివృద్ధికి వర్టికల్, హారిజంటల్‌గా చర్యలు చేపడుతున్నామని లోకేశ్ తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.